



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 347 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 3 సెప్టెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-




# తీరానికి మణిహారం

- లాజిస్టిక్స్ గేట్‌వేగా తూర్పు తీరం.. మన రాష్ట్రమే దానికి కేంద్రం
- ప్రతి 50 కి.మీ.లకు ఒక పోర్టు.. రైల్, ఎయిర్, రోడ్డుతో అనుసంధానం
- లాజిస్టిక్స్ కోసం ప్రత్యేక కార్పొరేషన్.. త్వరలో రెండు కొత్త యూనివర్సిటీలు
- అదానీ లాజిస్టిక్స్ యూనివర్సిటీ,జీఎంఆర్ సివిల్ ఏవియేషన్ వర్సిటీ రాక
- ప్రస్తుతం 6 పోర్టులు, నిర్మాణంలో మరో 4
- షిప్ బిల్డింగ్ తయారీలోనూ ముందుకు.. అమరావతికి త్వరలోనే బుల్లెట్ ట్రైన్
- ఈస్ట్ కోస్ట్ మారీటైమ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో సీఎం చంద్రబాబు వెల్లడి

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రంలో 1,050 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం ఉంది. సముద్ర రవాణాలో ఏపీ రెండోస్థానంలో ఉంది. ఈ విషయంలో మనం మరింత అభివృద్ధి సాధించాలి. మనకు మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు ఉన్నందున ఇది సాధ్యమే. "తూర్పు తీరం మారీటైమ్ లాజిస్టిక్స్ గేట్ వేగా మారుతుంది. దీనికి ఏపీనే కేంద్రంగా ఉంటుంది. పొరుగు రాష్ట్రాల కార్గోను కూడా రాష్ట్రంలోని పోర్టుల ద్వారానే రవాణా చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టును ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. ప్రతి పోర్టునూ రైలు, ఎయిర్, రోడ్డు మార్గాలతో అనుసంధానిస్తూ మాస్టర్‌ప్లాన్ రూపొందించనున్నట్టు తెలిపారు. విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం జీఎఫ్ఎస్‌టీ, మారీటైమ్ గేట్‌వే సంయుక్తంగా నిర్వహించిన 'ఈస్ట్ కోస్ట్ మారీటైమ్ అండ్ లాజిస్టిక్స్ సమ్మిట్'కు ఆయన హాజరయ్యారు. లాజిస్టిక్స్ కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి, పాలసీని రూపొందిస్తామన్నారు. దీనికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడానికి 15 నుంచి 20 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని పారిశ్రామికవేత్తలకు - మిగతా2లో



# మరణించిన నా తల్లిని దూషిస్తారా?

- ఇది అందరు అమ్మలు, అక్కచెల్లెళ్లను, ఆడబిడ్డలను అవమానించడమే : ప్రధాని
- బీసీ గద్దెనెక్కడం కాంగ్రెస్ సహించదు
- ఆర్జేడీ హయాంలో బిహార్లో నేరాల వెల్లువ
- ఓదుకే మహిళలే దించేశారు: మోదీ

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బిహార్లో చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర'లో కాంగ్రెస్, ఆర్‌జేడీ నేతలు తన తల్లిని, తనను దూషించడంపై ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. నూరేళ్లు బతికి మరణించిన తన తల్లికి రాజకీయాలు తెలియదని.. ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేయడం.. తన తల్లినే గాక దేశంలోని అందరు అమ్మలు, అక్కచెల్లెమ్మలు, ఆడబిడ్డలను అవమానించడమేనని స్పష్టంచేశారు. స్వయం సహాయక - మిగతా5లో

# సామాజిక వైద్యుడు వైఎస్సార్



- ప్రజల హృదయాల్లో వైఎస్సార్ స్థానం ఎప్పటికీ పదిలమే
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి
- పార్టీ ప్రధాన కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన నేతలు
- రక్తదానం చేసిన అభిమానులు
- దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, పేదలకు దుస్తుల పంపిణీ

2లో



# చైనా ఆయుధ పాటవం

- నేడు బీజింగ్‌లో తొలిసారి భారీ ప్రదర్శన
- జిన్‌పింగ్, పుతిన్, కిమ్ సహా 26 దేశాల నేతల హాజరు
- అమెరికా తన బలాన్ని చాటేందుకు జూన్‌లో ఇలాంటి ప్రయత్నమే చేసింది.
- నాలుగో తరం యుద్ధ ట్యాంకులు, అత్యాధునిక విమానాలు, హైపర్‌సోనిక్ క్షిపణులు వంటివి ఉంటాయి

5లో

# కొప్పర్తికి లక్ష ఉద్యోగాలు


- అక్కడికి పరిశ్రమలు తెచ్చే బాధ్యత నాదే
- మార్పు ఇంటి నుంచే మొదలవ్వాలి
- మహిళలను ఎక్కడ గౌరవిస్తే అక్కడే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం
- కడప జిల్లా చింతకొమ్మదిన్నె స్కూల్‌లో
- తొలి స్మార్ట్ కిచెన్ ప్రారంభించిన లోకేశ్
- మరో 4 వర్చువల్‌గా ప్రారంభం
- టీవీల తయారీ, రెడీమేడ్ దుస్తుల పరిశ్రమలను ప్రారంభించిన మంత్రి



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. అక్కడకు పరిశ్రమలను తీసుకొచ్చే బాధ్యత తాను తీసుకుంటానని మంత్రి వెల్లడించారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్లతో నెలకొల్పిన స్మార్ట్ కిచెన్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థుల పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి కిచెన్‌ను ఏర్పాటుచేయడం దేశంలోనే తొలిసారి అని తెలిపారు. అనంతరం ఈ జిల్లాలో మరో నాలుగు స్మార్ట్ కిచెన్లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఇక్కడ విజయవంతం అయితే, రాష్ట్రమంతా సెంట్రలైజ్డ్ స్మార్ట్‌కిచెన్లను విస్తరిస్తామని తెలిపారు. సోలార్ విద్యుత్‌ను వాడి ఆధునిక పద్ధతుల్లో ఇక్కడ వంటలు తయారుచేసి చుట్టుపక్కల 136 స్కూళ్లకు ప్రత్యేక వాహనాల్లో పంపించనున్నారు. వంట కోసం ఆర్వోప్లాంట్ నీటిని వినియోగించనున్నారు. దీనికి - మిగతా2లో

# ఎట్టకేలకు పంచాయతీలకు నిధులు!



**కేంద్రం ఇచ్చిన రూ.1,121 కోట్ల నిధులు ఎనిమిది నెలల తర్వాత జమ**

**నిధుల మళ్లింపుపై 20 రోజుల క్రితం రాష్ట్రాన్ని తీవ్రంగా ఆక్షేపించిన కేంద్రం**

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

"మీకు చేరిన ఈ నిధులను పది పని దినాల్లోగా గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల బ్యాంకు ఖాతాల్లో జమ చేయండి.." అంటూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు ఎనిమిది నెలల తర్వాత కానీ మోక్షం లభించలేదు. 15వ ఆర్థిక సంఘం నుంచి కేటాయించిన ఈ నిధులను కూటమి ప్రభుత్వం ఇన్నాళ్లూ దారిమళ్లించింది. గత ఏడాది డిసెంబరులో రూ.1,121 కోట్లను కేంద్రం రాష్ట్రానికి విడుదల చేసింది. నిబంధనల ప్రకారం పంచాయతీలకు 70 శాతం, మండల పరిషత్‌లకు 20, జిల్లా పరిషత్‌లకు 10 శాతం చొప్పున వాటి బ్యాంకు ఖాతాల్లో వేయాలి. కానీ, రాష్ట్ర ఖజానాలోనే ఉంచేసి, వివిధ అవసరాలకు వాడేసింది కూటమి సర్కారు. నిధులను విడుదల చేసినట్లు చెప్పుకోవడానికి అన్నట్లు... నాలుగు నెలల తర్వాత ఏప్రిల్ 25న పంచాయతీరాజ్ శాఖ నుంచి బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ల (బీఆర్వో) - మిగతా2లో

# మహిళల్లో కేసులెక్కువ.. పురుషుల్లో మరణాలెక్కువ

- దేశవ్యాప్తంగా కేన్సర్ కేసుల్లో కనిపిస్తున్న భిన్న వైఖరి
- 2015-19 మధ్య నమోదైన గణాంకాల ఆధారంగా తాజా అధ్యయనంలో వెల్లడి
- స్క్రీనింగ్ ద్వారా కేన్సర్‌ను ముందే గుర్తించే వీలుండటమే స్త్రీలలో తక్కువ మరణాలకు కారణం
- కేన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తుండటం వల్ల వ్యాధి ముదిరి మరణిస్తున్న పురుషులు
- మారిన ఆహార అలవాట్లు, జీవనశైలి మార్పులే కేసులకు ప్రధాన కారణమంటున్న నిపుణులు
- ఈ లెక్కన 2024లో 15.6 లక్షల కేసులు.. 8.74లక్షల మరణాలు నమోదై ఉండొచ్చని అంచనా

5లో

# సామాజిక వైద్యుడు వైఎస్సార్

అమరావతి

సంక్షేమ పథకాలతో.. చిరునవ్వుతో కూడిన పలకరింపుతో ప్రతి గుండెను కదిలించిన సామాజిక వైద్యుడు, మహోన్నత వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రజల గుండెల్లో వైఎస్సార్ స్థానం ఎప్పటికీ పదిలంగా ఉంటుందని నివాళులర్పించారు. మంగళవారం మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, పేదలకు దుస్తుల పంపిణీని ప్రారంభించారు. అనంతరం సజ్జల మాట్లాడుతూ.. పేదరికం, వెనుకబాటుతనాన్ని పారద్రోలడానికి సిద్ధాంతాలు, సమీక్షల పేరుతో కాలయాపన చేయడం సరైన విధానం కాదని, సహజ స్వభావాలతో ఆలోచించి చికిత్స చేయాలని నిరూపించిన సామాజిక వైద్యుడు రాజశేఖరరెడ్డి అని చెప్పారు. రైతులు, విద్యార్థులు, మహిళలు.. ఇలా అన్ని వర్గాల వారిని ముందుకు నడిపించిన మహోన్నత నాయకుడు అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా పెనుమార్పులు తీసుకొచ్చిన మహనీయుడు వైఎస్ అన్నారు. ఉచిత విద్యుత్ ద్వారా ఎంతోమంది రైతులకు, ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి పేద కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా కోట్ల మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసిన ఆదర్శప్రాయుడు వైఎస్ అని గుర్తు చేశారు. వైఎస్సార్ ఆశయాలకు ప్రతిరూపం వైఎస్ జగన్ వైఎస్సార్ మనకు దూరమైనా వైఎస్ జగన్ రూపంలో



గొప్ప వారసత్వాన్ని అందించారని సజ్జల పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో వైఎస్ జగన్ విజయవంతమయ్యారని, వైఎస్సార్‌సీపీని ఏర్పాటు చేసి ఈ ప్రజా సంకల్పంలో మనల్ని అందర్నీ భాగస్వాముల్ని చేసినందుకు గర్వంగా భావిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలకు వైఎస్సార్ బీజం వేస్తే ఐదేళ్ల పాలనలో అంతకన్నా మెరుగ్గా మరిన్ని పథకాలను వైఎస్ జగన్ ముందుకు తీసుకెళ్లగలిగారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ నాయకులు జూపూడి ప్రభాకర్‌రావు, పూనూరు గౌతమ్‌రెడ్డి, కాకుమాను రాజశేఖర్, పోతిన మహేష్, చల్లా మధు, కొమ్మూరి కనకరావు, పానుగంటి చైతన్య, ఎ.రవిచంద్ర, పార్టీ గ్రీవెన్స్, లీగల్, యువజన, మహిళా విభాగాల నాయకులు పాల్గొన్నారు.

# కొప్పర్తికి లక్ష ఉద్యోగాలు

-మొదటిపేజీ తరువాయి

సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం 10వ తరగతి విద్యార్థినులతో మంత్రి భేటీ అయ్యారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో నూతనంగా ఏర్పాటు అయిన ఎగ్జిక్యూటివ్ సెంటర్ భవనాన్ని మంత్రి లోకేశ్ ప్రారంభించారు. టీవీలను తయారుచేసే ఎంఎస్ టెక్నోడోమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌ను, రెడీమెడ్ దుస్తులు తయారుచేసే టెక్సాసానా వరల్డ్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలను కొప్పర్తి మెగా ఇండ్రస్ట్రియల్ హబ్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డితో కలిసి ఆరంభించారు. మహిళలను ఎక్కడ గౌరవిస్తే అక్కడే అక్కడే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. అనంతరం మహిళలతో కలిసి సెల్ఫీ దిగారు. పరిశ్రమ లోపల తిరిగి ఎల్‌ఈడీ టీవీల తయారీని పరిశీలించారు.

**కార్యకర్తలకు అండగా ఉంటాం: లోకేశ్**

కార్యకర్తలకు అండగా ఉంటామని మంత్రి లోకేశ్ తెలిపారు. సీకేదిన్నె మండలం కొలుములపల్లెలో 69వ ప్రజాదర్బార్‌ను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్‌ను కలిసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలి వచ్చారు. ప్రజలు, కార్యకర్తల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం వారితో కలిసి ఫొటోలు దిగారు.

**లోకేశ్‌తో భేటీలో విద్యార్థుల సంతోషం**

ప్రభుత్వం చేపట్టిన విద్యాసంస్కరణలతో కలుగుతున్న మంచి గురించి మంత్రి లోకేశ్ విద్యార్థులను అడిగి



తెలుసుకున్నారు. "సెమిస్టర్‌వైజ్ టెస్ట్‌బుక్ విధానం మాకు ఉపయోగకరంగా ఉంది. దాని నివల్ల పుస్తకాల బరువు తగ్గింది. సోషల్ స్టడీసలోని నాలుగు టెక్స్ట్ బుక్‌లను రెండిటికి కుదించాలి. ఇంగ్లీష్ టెస్ట్‌బుక్, సప్లిమెంటరీ కలిపి ఒకటిగా ఇస్తే బాగుంటుంది. సన్నబియ్యం ఇస్తుండడం వలన మధ్యాహ్న భోజనం గతం కంటే బాగుంది. బుక్‌లెట్స్ బాగున్నాయి." అని పేర్కొన్నారు. వారి సూచనలను మంత్రి సానుకూలంగా ఆలకించారు. అనంతరం పెండ్లిమర్రి మండల పరిధిలోని చెర్లోపల్లె పంచాయతీలో రూ.12కోట్లతో నిర్మించిన అధునాతన ఆదర్శ డిగ్రీ కళాశాల భవనాలను లోకేశ్ ప్రారంభించారు. పీఎం ఉష పథకంలో భాగంగా యోగివేమన వర్శిటీలో రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆడిటోరియం, నూతన పరిపాలన భవనానికి శంకుస్థాపన చేశారు.

# వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళి





విజయవాడ

మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి వేడుకలు కృష్ణలంక 22వ డివిజన్ నందు ఘనంగా జరిగాయి. డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్ పాల్గొన్నారు. మలేరియా ఆసుపత్రి వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు.. దివంగత నేతకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం, విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు కడియాల బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు పంచాయతీలకు నిధులు!

-మొదటిపేజీ తరువాయి

పేరుతో రెండు జీవోలను విడుదల చేసింది. మళ్లీ నాలుగు నెలలు గడిపేసి, మంగళవారం రాత్రి ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల ఖాతాలో వేసింది.

గత ప్రభుత్వంలో సర్పంచుల ఆధ్వర్యంలోనే స్వేచ్ఛగా చెల్లింపులు 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్రం ప్రత్యేకించి గ్రామీణ స్థానిక సంస్థలకు విడుదల చేసే నిధులను రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలు లేకుండా సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీ చైర్మన్ల పరిధిలో అభివృద్ధి పనులకు ఖర్చు చేసేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొత్త విధానం మొదలైంది. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లలో తీర్మానాల ప్రకారం చేపట్టే పనులకు ఆయా స్థానిక సంస్థల ప్రభుత్వాలే నేరుగా బిల్లులు చెల్లించేలా, రాష్ట్ర ట్రెజరీల ఆంక్షలు కూడా లేకుండా ఆ నిధులను గ్రామీణ స్థానిక సంస్థల ప్రత్యేక బ్యాంకు ఖాతాల్లో జమ చేసే పద్ధతి అమలులో ఉంది. ఇందుకుగాను 15వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు కేంద్రం విడుదల చేసే నిధులను ఎప్పటికప్పుడు గ్రామీణ స్థానిక సంస్థలకు జమ చేసేది.

**కూటమి పాలనలో రెండుసార్లు**

కూటమి ప్రభుత్వం వచ్చాక.. మరీ గత 10 నెలల కాలంలోనే రెండుసార్లు గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్రం విడుదల చేసిన నిధులను నెలల తరబడి రాష్ట్ర ఖజానాలో ఉంచేసింది. ఈ తీరుపై విమర్శలు వచ్చాక గ్రామీణ స్థానిక సంస్థలకు విడుదల చేసింది. 2024%–%25 ఆర్థిక సంవత్సరం మొదటి విడత నిధులు రూ.988.76 కోట్లను నిరుడు సెప్టెంబరులో విడుదల చేయగా.. దాదాపు రెండు నెలల తర్వాత నవంబరులో స్థానిక సంస్థల ఖాతాల్లో వేసింది. 2023%–%24 ఆర్థిక సంవత్సరానికి రెండో విడతగా కేంద్రం విడుదల చేసిన రూ.998 కోట్లను కూడా ఆలస్యంగా విడుదల చేసింది. గత ఏడాది మార్చి నాటికి ఎన్నికల షెడ్యూల్ విడుదలై కోడ్ అమలు లోకి వచ్చింది. అప్పటి అధికారులు నిధులను గ్రామీణ స్థానిక సంస్థలకు విడుదల చేయలేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం నిరుడు జూన్ 12న బాధ్యతలు చేపట్టినా ఆగస్టు దాకా స్థానిక సంస్థల నిధులను ఇవ్వలేదు. నిరుడు ఆగస్టు 13న ఈ అంశంపై 'సాక్షి' ప్రత్యేక కథనం ప్రచురించాక చర్యలు చేపట్టింది.

## తీరానికి మణిహారం

-మొదటిపేజీ తరువాయి

సూచించారు. అమరావతికి బుల్లెట్ ట్రైన్ వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా అదానీ గ్రూపు లాజిస్టిక్స్ యూనివర్సిటీ ఏర్పాటుచేస్తుందని, అలాగే విశాఖపట్నంలో జీఎంఆర్ సంస్థ సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుందన్నారు. రాష్ట్రంలో షిప్ బిల్డింగ్‌తోపాటు రిపేర్లు, బ్రేకింగ్ యూనిట్లు, కంటెయినర్ల నిర్మాణానికి ఎవరైనా ముందుకు వస్తే తగిన సహకారం అందిస్తామన్నారు.ఏపీలో పోర్టుల నుంచి కార్గో 90 శాతం బల్క్‌గానే రవాణా జరుగుతోందని, కంటెయినర్ కార్గో కూడా పెంచాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో 1,050 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, సముద్ర రవాణాలో ఏపీది రెండో స్థానమని, మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు ఉన్నందున మరింత అభివృద్ధి సాధించవచ్చునన్నారు. లాజిస్టిక్స్ కోసం దీర్ఘకాలిక విధానం తీసుకువస్తామని, వాటికి భూమిని దీర్ఘకాలిక లీజుకు ఇస్తామని వివరించారు. రాష్ట్రంలోని అన్ని విమానాశ్రయాల నుంచి ఎయిర్‌కార్గో పెంచాలని సూచించారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులకు ప్రాధాన్యం ఇచ్చి, వయబులిటీ గ్యాప్ ఫండింగ్ కూడా ఇస్తామన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు పోర్టుల ద్వారా ఏడాదికి 69 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్, 11 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా జరుగుతోందన్నారు. భారీ నౌకలు వచ్చేందుకు అవసరమైనంత లోతు 18 మీటర్ల డ్రాఫ్ట్ ఏపీలోనే ఉందన్నారు. నదుల అనుసంధానం ద్వారా కూడా జల రవాణా పెంచుకోవచ్చునన్నారు. ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ వ్యవస్థను అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఆరు పోర్టులు ఉండగా, మరో 4 నిర్మాణంలో ఉన్నాయన్నారు. మూలపేట, మచిలీపట్నం, కాకినాడ, రామాయపట్నం.. పోర్టుల వద్ద అనుబంధ పరిశ్రమలు, పోర్టు టౌన్‌షిప్‌ల కోసం పది వేల ఎకరాలు అందుబాటులో ఉందన్నారు.

**డ్రోన్లతో సరుకు రవాణాకు సహకారం**

సదస్సుకు ముందు ఆయన వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ భేటీలో 14 మంది పలు సూచనలు చేశారు. అందులో ఒకరు డ్రోన్ల ద్వారా సరుకులను రవాణా చేస్తున్న తమకు సహకారం అందించాలని కోరారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు మందులను డ్రోన్ల ద్వారా పంపిస్తుంటే కిలో రూ.80 వరకు పడుతోందని సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు.. తప్పక ప్రోత్సహిస్తామన్నారు. శ్రావణ్ షిప్పిం గ్ ఎండీ సాంబశివరావు మాట్లాడుతూ.. విమానాల ద్వారా సరుకు పంపడానికి ఏర్పాట్లు చేయాలని, పోర్టులకు కూడా ఇండస్ట్రియల్ ఏరియాల లోకల్ అథారిటీ(ఐలా) పెట్టాలని కోరగా, సీఎం అంగీకరించారు. అనంతరం ఎయిర్ కార్గో ఫోరం ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్‌ను ప్రారంభించారు.

## ఆడుదాం ఆంధ్రలో 40 కోట్లు లూటీ

తిరుపతి

మాజీ మంత్రి రోజా( అరెస్టు తప్పదా? వారం రోజుల్లో ఆమె అరెస్టు ఉంటుందా? కూటమి నేతలు చెబుతున్న మాటల్లో నిజం ఎంత? ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ఇదే చర్చ నడుస్తోంది. శాప్ చైర్మన్ గా ఉన్న రవి నాయుడు అనే నేత రోజా అరెస్టు ఉంటుందని ప్రకటన చేశారు. వారం రోజుల్లో ఆమె అరెస్టు తప్పదని ఆయన చేసిన ప్రకటన ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. వైసిపి హయాంలో జరిగిన 'ఆడుదాం ఆంధ్రా' పోటీల్లో భారీ అవినీతి జరిగిందన్నది కూటమి ప్రభుత్వం అనుమానం. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై విజిలెన్స్ విచారణ కూడా చేపట్టింది. అన్ని జిల్లాల నుంచి వివరాలు సేకరించింది. అయితే పోటీల నిర్వహణ, క్రీడాకారుల నజరానాలు, క్రీడా పరికరాలకు కొనుగోళ్లలో భారీ అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలింది. దీనికి బాధ్యులను చేస్తూ మాజీమంత్రి ఆర్కే రోజాతో పాటు అప్పటి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగించే ప్రయత్నంలో ఉంది కూటమి. తప్పకుండా మాజీ మంత్రి రోజా అరెస్టు ఉంటుందని ఎప్పటినుంచో ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు ఆ సమయం ఆసన్నం అయినట్లు తెలుస్తోంది. దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విచారణ పూర్తయింది. 40 కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు విజిలెన్స్ ఎంక్వైరీలో తేలినట్లు సమాచారం.అయితే మహిళా నేతగా ఉన్న రోజా అరెస్టు విషయంలో కూటమి ప్రభుత్వం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే వైసిపి హయాంలో చాలా దూకుడుగా ఉండేవారు రోజా. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేవారు. ఈ క్రమంలోనే ఆమెపై ఒక రకమైన నెగిటివ్ ప్రభావం కూడా ఉంది. ఆమె తీరుపై ప్రజల్లోనే భిన్నాభిప్రాయం ఉంది. అందుకే ఆమె అరెస్టు విషయంలో ఎటువంటి ఇబ్బందులు వచ్చే అవకాశం లేదని.. ప్రజల్లో నెగిటివ్ అనేది ఉండదని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే రోజా అరెస్టు జరిగితే వైసిపి దానిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధపడుతోంది. కానీ కూటమి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రాలో ప్రతి జిల్లాలో జరిగిన అవినీతిని పక్కా ఆధారాలతో బయట పెట్టేందుకు అన్ని రకాల సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.వాస్తవానికి తన విషయంలో అరెస్టు ఉండదని రోజా భావించారు. మహిళా నేతగా తనవరకు వస్తే కూటమి ప్రభుత్వంపై నెగిటివ్ వస్తుందని అంచనా వేసుకున్నారు. కానీ ఆడుదాం ఆంధ్రాలో రోజా అవినీతిని కళ్లకు కట్టినట్లు ఆధారాలతో చూపించి.. అరెస్టు చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అయితే విజిలెన్స్ నివేదికను ఆధారంగా చేసుకుని ఏసీబీ కేసు నమోదు చేసి అరెస్టు చేస్తారా? లేకుంటే సిఐడి ద్వారా అరెస్టుకు చర్యలు తీసుకుంటారా? అనేది తెలియాల్సి ఉంది. రోజాను అరెస్టు చేయాలంటే ముందుగా గవర్నర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ఆమె మాజీ మంత్రి కాబట్టి. అయితే రోజా విషయంలో కొద్ది రోజులపాటు ప్రభుత్వం ఆలోచన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ


బుధవారం 3 సెప్టెంబర్ 2025

www.viswamvoice.com



## పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా వై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు సేవలు





- పవన్ గొప్ప మానవతావాదని కొనియాడిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి
- కేక్ కట్ చేసి మిఠాయిలతో ఆనందం పంచుకున్న జనసేన శ్రేణులు

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలో మంగళవారం రాజమహేంద్రవరం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్థానిక దేవి చౌక్ సెంటర్ అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద భవన నిర్మాణ కార్మికులకు అల్పాహార వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమండ్రి జనసేన అధ్యక్షులు వై. శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై కార్మికులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి మాట్లాడుతూ, "పవన్ కళ్యాణ్ ఎల్లప్పుడూ సాధారణ ప్రజల పక్షాన ఆలోచించే నాయకుడని, గొప్ప మానవతావాదని , కార్మికుల కష్టాలు, వారి జీవనోపాధి పట్ల ఆయనకు ప్రత్యేకమైన దృష్టి ఉందన్నారు. ఆ ఆలోచనతోనే జనసేన కార్యకర్తలు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. వై. శ్రీనివాస్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సమర్థవంతమైన నాయకత్వం ద్వారా కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ సుపరిపాలనందించే ప్రభుత్వాలు ఏర్పాటు చేయడంలో ప్రాణాలకు సైతం తెగించి నిలబడ్డారన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ముందున్నడు లేనివిధంగా గ్రామ పరిపాలనకు జీవం పోసి పంచాయతీలకు నిధులు సమకూర్చి గ్రామసభలు ద్వారా స్థానిక సమస్యలు పరిష్కరించి గిన్నిస్ రికార్డ్ సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. కనీస సౌకర్యాలు లేని ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటించి గిరిజనులకు కోసం రోడ్లు వేయించారన్నారు. ఉప ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు సేవలందిస్తూ అందిస్తూ జనసేన పార్టీని క్రమశిక్షణతో నడిపిస్తున్నారని తెలిపారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా పార్టీ కార్యకర్తలతో పాటుగా స్వచ్ఛందంగా ప్రజలు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం మరి నాయకుడికి దక్కని గొప్ప గౌరవంగా భావిస్తున్నామన్నారు. అనంతరం గోదావరి తీరాన ఉన్న శంకరమఠంలో వేదపండితుల ఆశీర్వచన కార్యక్రమ నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల నడుమ పండితులు పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వచనాలు అందజేశారు. ఆయన సహకారంతో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు మేలు జరగాలని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజమండ్రి జనసేన పార్టీ అధ్యక్షులు వై. శ్రీనివాస్ పాల్గొన్నారు. తరువాత రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రసూతి విభాగంలో బ్రెడ్స్, పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న ప్రసూతి స్త్రీలకు ఆహారపదార్థాలు అందజేసారు. మధ్యాహ్నం నందంగని రాజు జంక్షన్ వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. నగరంలో పలుచోట్ల కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తం చేసిన జనసేన నాయకులు. ఈ సేవా కార్యక్రమాల్లో జనసేన జిల్లా, నగర కమిటి, నూతనంగా పదవులు పొందిన చైర్మన్లు డైరెక్టర్లు, వీర మహిళలు, జనసైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బొడ్డు ఆధ్వర్యంలో ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు.



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు రాజానగరం నియోజకవర్గం తెదేపా ఇంచార్జ్ రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం బూరుగుపూడి గేటు వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బొడ్డు వెంకటరమణ చౌదరి పలువురు తెలుగు తమ్ముళ్ల ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకు కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అనేక సందర్భాలలో ఆపదలో ఉన్నవారికి విరివిగా విరాళాలు ఇచ్చి, తన దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు. సినీ రంగం తో పాటు రాజకీయ రంగంలోనూ భవిష్యత్తులో మరింత రాణించి, రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజాసేవలోను విశిష్ట గుర్తింపు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశవరావు, అడపా వీరబాబు, మార్ని రాము, దూది కాంతారావు, ముంద్రు గాంధీ, గంగిశెట్టి చంటిబాబు, నూనె వెంకన్న, చిట్టిప్రోలు పద్దరాజు, కొల్లపు రత్నం, తెలగంశెట్టి శ్రీనివాస్, పుప్పాల వెంకటరత్నం, పీతా శ్రీనుబాబు, దాడి శ్రీను, మాతా సీతారాముడు, పలువురు తెలుగు తమ్ముళ్లు తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా నగర అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే ఆదిరెడ్డిశ్రీనివాస్

- అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ నందు ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డివిజన్ల వారీగా ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో నగరంలో అక్షరాల రూ. 250 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. వీటిలో రూ. 148 కోట్ల పనులు పూర్తి కాగా..మిగిలిన పనులు వివిధ దశలలో ఉన్నాయన్నారు. అధిక వర్షాల కారణంగా నగరంలో 567 చోట్ల గుంతలు ఏర్పినట్లు గుర్తించగా.. వీటిని పూడ్చేందుకు రూ. కోటి 20 లక్షలతో టెండర్లు పిలిచినట్లు వెల్లడించారు. వర్షాలు తగ్గిన తర్వాత మూడవ వారంలో పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రజల కనీస అవసరాలైన రోడ్లు, డ్రెయిన్లు, పార్కులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ పనులను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయగా..కూటమి వచ్చాక ఎంపీ పురంధేశ్వరితో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. రూ. 2 కోట్ల నిధులతో ఫ్లైఓవర్ కు ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ఈనెల 15 కల్లా టెండర్ ప్రక్రియ పూర్తిచేసి, నెలాఖరుకి పనులు పూర్తి చేస్తామన్నారు. గాదాలమ్మ నగర్లో హైవేను ఆనుకుని రోడ్డు నిర్మాణానికి నిధులు ఇప్పటికే మంజూరు కాగా.. విస్తరణ పనులు పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. పైపులైన్ల పనులు సైతం నగరంలో శరవేగంగా జరుగుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రత్నంపేట నుంచి మునిసిపల్ కాలనీ వరకు టౌన్ హాల్ రోడ్డు ఇలా ప్రజల అవసరాలను బట్టి నూతన పైపులైన్లను వేస్తునట్లు పేర్కొన్నారు. అలాగే నందం గణిరాజు, సురుచి,తాడితోట జంక్షన్ సహా నగరంలోని అన్ని జంక్షన్ లను అభివృద్ధి పరుస్తున్నట్లు వెల్లడించారు. హ్యాపీ స్ట్రీట్ కప్ అండ్ సాసర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా.. బస్సులు సైతం సులభంగా ప్రయాణించేలా జంక్షన్ ను అభివృద్ధి పరుస్తున్నామన్నారు. మరోవైపు ఇందిరానగర్ పార్కులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.కోటిలింగాల పేటలో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన పంపింగ్ స్టేషన్ కు ఎలక్ట్రిసిటీ కనెక్షన్ ఇవ్వవలసిందిగా ఆదేశించారు.కూటమి నాయకులు,అధికారుల సమన్వయంతో నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి పరుస్తున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. సమావేశంలో నాయకులు కాశీ నవీన్ కుమార్,వర్రే శ్రీనివాస్,మజ్జి రాంబాబు, నక్కాచిట్టిబాబు,రెడ్డి మణేశ్వరరావు,బుడ్డిగ రాధా,ఉప్పులూరి జానకి రామయ్య,బుడ్డిగ రవి, కంటిపూడి శ్రీనివాస్, కొయ్యల రమణ, మొకమాటి సత్య నారాయణ,అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్,సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎస్ఈ (ఇంఛార్జి) రీటా,ఈఈలు మాధవి, మదర్సా అలీ ఇతర అధికారులు, పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి



**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల గుండె ల్లో శిరస్మరణీయుడుగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గం ఇన్చార్జి తలారి వెంకట్రావు అన్నారు. మంగళవారం మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకొని ఊరు పట్టణంలోని ది మరియు మెయిన్ రోడ్ లోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల కుటుంబాలలో వెలుగులు నింపాలి అనే సంకల్పంతో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో పాదయాత్ర నిర్వహించి ప్రతి ప్రాంతాన్ని పర్యటిస్తూ ప్రజల కష్టాలను తెలుసుకొని అధికారంలోకి వచ్చిన వెంటనే విద్య వైద్యం వ్యవసాయం ప్రాధాన్యతనిస్తూ పేద విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని, రైతన్నల అభివృద్ధికి ఉచిత విద్యుత్, రైతు భరోసా పథకం, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండేందుకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్య సేవలు అందించడంతోపాటు 108104 లాంటి అంబులెన్స్ సౌకర్యాలను కల్పించి ప్రజల గుండెల్లో శిరస్మరణీయుడిగా నిలిచారన్నారు తండ్రి బాటలో తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి నడుస్తూ పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలనను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్టూరి అన్నవరం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంటిలెక్చువల్ ఫోరం కార్యదర్శి బండి అబ్బులు, తూర్పుగోదావరి జిల్లా వైయస్సార్ యువజన నాయకులు కంట మని రమేష్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, కొవ్వూరు పట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ మహిళా అధ్యక్షులు ఏలూరి విజయలక్ష్మి, కౌన్సిలర్లు మద్దిపట్ల సాయి గీత, సఖినేటిపల్లి చాందిని, చీర అరుణ, ఎస్సీ సెల్ నాయకులు మెరుపు వీర్రాజు, గుపతాల సురేష్, ఉప్పులూరి సూరిబాబు, పరిమి సోమరాజు, మారిన రామకృష్ణ, తదితర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఎంపీడీఓ కార్యలయం నందు సర్వ సభ్య సమావేశం




**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** గ్రామిణ ప్రాంతాలలోని ప్రజల అవసరాలను, సమస్యలను గుర్తించి పరిస్కరించేదిశగా ప్రజాప్రతినిధుల సమన్వయంతో అధికారులు పనిచెయ్యాలని కొవ్వూరు శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు పట్టణంలోని ఎంపీడీఓ కార్యలయం నందు సర్వ సభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ కాకర్ల నారాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈ మేరకు సభలో సభ్యుల ఆమోదం కొసం గ్రామాలలోని పలు అభివృద్ది సంశాలకు సంభందించిన అజండాను ప్రవేశపెట్టారు. అలాగే అధికారులు ఆయా శాఖ వారిగా ప్రభుత్వ కార్యక్రమాలను సభకు వివరించారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ గ్రామాలలో ప్రజల మౌళిక సదుపాయాల కల్పనలో అధికారులు శ్రద్ద చూపాలని తెలిపారు. ముఖ్యంగా మంచినీటి అవసరాల విషయంలో చిత్త శుద్దితో పనిచెయ్యాలని సూచించారు. గ్రామాలలో పర్యటించిన సందర్బంలో గ్రామాలలో అధికారుల తీరుపై ప్రజలు పిర్యాదుచేస్తే చర్యలు తప్పవని అన్నారు. పార్టిల అతీతంగా పనిచెయ్యాలని, ప్రజల సంక్షేమమే ముఖ్యమని చెప్పారు. గ్రామ అభివృద్ది గురించి, ప్రజల సమస్యల పరిస్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచెయ్యాలని సూచించారు. గ్రామాలలో డ్రైన్స్, వీధిలైట్లు, తదితర సమస్యలు తలెత్తకూడదని స్పష్టం చేసారు. సమావేశాలకు పంచాయితీ కార్యదర్శులు గైరుహాజరు కావడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ది అధికారి రమణ, మండల ప్రత్యేక అధికారిని బి సుభాషిని, తాహశిల్దార్ డి.దుర్గా ప్రసాద్, గ్రామ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, జడ్పీటీసీ బొంతా వెంకట లక్ష్మి, గ్రామ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## పరిపాలనను ప్రజాస్వామ్య హృదయంగా మార్చిన మహానేత వైయస్సార్

- డాక్టర్ వైయస్సార్ "స్ఫూర్తి" శాశ్వతం
- ఆరోగ్యం,వైద్యం, చదువు ఉచితంగా అందించిన మహానేత వైయస్సార్
- డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్య ప్రకాష్ రావు
- గూడూరి శ్రీనివాస్ ఆధ్వర్యం డాక్టర్ వైయస్సార్ వర్ధంతి నివాళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** దివంగత మహానేత ప్రియతమ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు అంకితమైన జగనన్న కు ప్రతి ఒక్కరూ మద్దతు ఇచ్చి ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ శాసనసభ్యులు రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమం రాజమండ్రి తిలక్ రోడ్ లోని పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ శాసనసభ్యులు రౌతు సూర్యప్రకాశరావు, నాయకులు డాక్టర్ వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ డాక్టర్ వైయస్సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజల హృదయాలలో చిరస్మరణీయుడు డాక్టర్ వైయస్సార్ అని అన్నారు. "రైతు బంధువు"గా, "ఆరోగ్య శ్రీ కర్త"గా ప్రతి గృహంలో ఆయన జ్ఞాపకం నిలిచి పోయిందన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ తో ఎంతోమంది ఉన్నత విద్యను అభ్యసించేందుకు కృషిచేసి అనేక కుటుంబాల స్థితిగతులను అభివృద్ధి చేశారన్నారు.ఉచిత విద్యుత్, ఉచిత బీమా, రుణ మాఫీ వంటి నిర్ణయాలతో రైతుకు భరోసా ఇచ్చారన్నారు. రైతే రాష్ట్ర బలం అనే ఆయన నమ్మకం నేటికీ మార్గదర్శకం అన్నారు. ఆరోగ్య శ్రేయస్సు కోసం యుగప్రవర్తకుడు వైయస్సార్ అని అన్నారు. "ఆరోగ్యశ్రీ" పథకంతో పేదవాడికి కూడా మెరుగైన వైద్యం అందుబాటులోకి తెచ్చారని, ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని చూపించిన అరుదైన నాయకుడు డాక్టర్ వైయస్సార్ అన్నారు. డాక్టర్ వైయస్సార్ కేవలం ఒక సీఎం కాదు, ఒక ప్రజామిత్రుడు అన్నారు. సేవను శాసనంగా, పరిపాలనను ప్రజాస్వామ్య హృదయంగా మార్చిన మహా మనిషి డాక్టర్ వైయస్సార్ అని కొనియాడారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ మాజీ అధ్యక్షులు తోట రామకృష్ణ,పెద్దేవం గ్రామ సర్పంచ్, స్థానిక నాయకులు తదితరులు వైయస్సార్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు.

## కొత్త బాలికా సంరక్షణ పథకం డబ్బులు గడువు ముగిసినా రాలేదు

- త్వరితగతిన ఇప్పించాలని సీడీపీవోకి యానాపు ఏసు వినతి




**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్:** కాతేరులో రెండో అంగన్వాడి సెంటర్ను సి డి పి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌరీ మంగళవారం సందర్శించారు.ముందుగా పిల్లలతో కలిసి భోజనం చేసారు.ఈసందర్భంగా స్టేట్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు ఆమెను కలుసుకుని కొత్త బాలిక సంరక్షణ పథకం 2005లో అప్పటి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇద్దరు ఆడపిల్లలకు 60వేల రూపాయలు,ఒక్క ఆడపిల్లకు లక్ష రూపాయలు డిపాజిట్ చేసి, 18 సంవత్సరాలు పూర్తయిన తర్వాత వస్తాయని చెప్పారని ప్రస్తావించారు.అయితే ప్రభుత్వం ఇచ్చిన ఎల్ఐసి బాండ్లు మెచ్యూరిటీ సమయం దాటిపోయి రెండేళ్లు అవుతున్నా ఎలాంటి డబ్బులు అందలేదని పేర్కొన్నారు. ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సిడిపిఓ గౌరీ తెలియజేశారు. అంగన్వాడి సూపర్వైజర్ సింహాచలం, టీచర్, సరస్వతి,ఆయా పూర్ణిమ, బలగం కిరణ్,కండెల్ల సురేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఎడిటర్ వాయిస్


# అమెరికా ఆవల ప్రపంచం

గత ఏడాది కజాన్‌లో జరిగిన సమావేశంతో పోలిస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య తియాంజిన్‌లో జరిగిన తాజా మీటింగ్ స్నేహపూరిత వాతావరణంలో జరిగింది.షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సమావేశం సందర్భంగా జరిగిన ఈ సమావేశాన్ని చరిత్రాత్మకమని చెప్పలేకపోయినప్పటికీ, దీనికి వేరే ప్రాముఖ్యత ఉంది.అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు, సుంకాల యుద్ధాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ఇద్దరు నాయకులు సమావేశమయ్యారు.సంబంధాలను సమతుల్యం చేసుకోవడానికి జాగ్రత్తగా చేసిన ప్రయత్నంగా ఈ సమావేశాన్ని చాలామంది చూస్తున్నారు.ఉమ్మడి ప్రకటనలో, భారత్, చైనాలు అభివృద్ధిలో భాగస్వాములని, ప్రత్యర్థులు కాదని పేర్కొన్నారు. విభేదాలు వివాదాలుగా మారకూడదని కూడా కోరుకున్నారు.2020లో గల్వాన్ ఘర్షణల నుంచి కొనసాగుతున్న ఉద్రిక్తత నేపథ్యంలో ఇప్పుడు నమ్మకం కలిగించే ప్రయత్నం జరిగింది.ఇద్దరు నాయకులు వాణిజ్యం, సరిహద్దు గురించి మాత్రమే కాకుండా బహుళ ధ్రువ ఆసియా, బహుళ ధ్రువ ప్రపంచం విస్తృత దృక్పథంపై కూడా దృష్టిపెట్టారు.ట్రంప్ టారిఫ్ యుద్ధం కారణంగా భారతదేశం పరిమిత ఆప్షన్ల మధ్య పరిష్కారం కోసం తహతహలాడుతోంది.రష్యా నుంచి తక్కువ ధరలకు చమురు కొంటున్నందుకు శిక్షగా భారత్‌పై అదనపు సుంకాలను అమెరికా సమర్థించుకుంటోంది.నిజానికి, ఈ చర్యలు భారతదేశాన్ని అమెరికా ఉనికి లేని యురేషియా వేదికల వైపుకు తీసుకెళ్తున్నాయి.ఆర్థిక రంగంలో చూసుకుంటే లోటును తగ్గించడం, వాణిజ్యాన్ని పెంచడంపై చర్చలు మరింత ఆశావహంగా కనిపిస్తున్నాయి. వీటిపై నిర్దిష్టమైన చర్చలు జరగలేదుగానీ చైనాతో వ్యాపారం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందనే రాజకీయ సందేశం కచ్చితంగా ఉంది.వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ప్రస్తావిస్తూ, మూడో దేశ అభిప్రాయం అన్న భావనను తిరస్కరిస్తూ చైనాతో సంబంధాలను అమెరికా ఒత్తిడికి లోబడి నిర్ణయించబోమన్న సందేశాన్ని యూఎస్‌కు భారత్ ఇచ్చింది.తియాంజిన్‌లో ప్రధాని మోదీ, జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్ ఒకే వేదికపై కలిసి కనిపించినప్పుడు, ఈ ఫోటో కేవలం ఎస్‌సీఓ హాల్‌కు మాత్రమే పరిమితమయిందిగా భావించలేం.ఇది భారతదేశానికి చాలా ముఖ్యమైన సమయం. కొన్ని రోజుల కిందటే, ట్రంప్ భారత ఎగుమతులపై 50 శాతం సుంకాలను విధించారు. మరో వైపు యూఎస్ ఫెడరల్ అప్పీల్ కోర్టు ఈ సుంకాలు చెల్లవని, చట్టవిరుద్ధమని తెలిపింది. అయినప్పటికీ కేసు సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతున్నందున అవి అమలులో ఉంటాయి.ఈ సందర్భంలో, అమెరికా ఆంక్షలు, ఒత్తిడికి లక్ష్యంగా మారిన జిన్‌పింగ్, పుతిన్‌తో కలిసి ఒకే వేదికపై మోదీ కనిపించడానికి ప్రాముఖ్యత ఉంది.ట్రంప్ సుంకాలు చాలా అసహజమైనవని, మోదీ-జిన్‌పింగ్-పుతిన్ తియాంజిన్‌లో ఒకే వేదికపైకి రావడం అమెరికాకు సమాధానం అని, ముగ్గురూ కలిసి అమెరికా విధానాల వల్ల ఏర్పడిన ఒత్తిడిని బలంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.ఏడు సంవత్సరాల తర్వాత ప్రధాని మోదీ చైనా వెళ్లారు. ఇది ఒక ప్రాంతీయ సమావేశంలో పాల్గొనే కార్యక్రమం మాత్రమే కాదు.జిన్‌పింగ్‌తో జరిగిన ద్వైపాక్షిక సమావేశం సంబంధాలను సమతుల్యం చేసుకోవడానికి ఒక అవకాశాన్ని కల్పించింది. అదే సమయంలో, భారత్‌కు అమెరికా ఆవల భాగస్వాములు, ఇతర మార్గాలు ఉన్నాయని చూపించడానికి ఒక వేదికను ఎస్‌సీఓ సమావేశం అందించింది.ఎస్‌సీఓను నియంతృత్వ దేశాల గ్రూప్‌గా అమెరికా చూస్తుంటుంది. కానీ భారత్, ఇతర సభ్య దేశాలు దీనితో ఏకీభవించవు.భారత్‌కు, దాని ప్రాముఖ్యత మరోలా ఉంది. భారత్ వైపు నుంచి చూస్తే రష్యా, చైనా, మధ్యాసియా దేశాలు, అలాగే ఇరాన్ కూడా ఒకే టేబుల్ వద్ద కూర్చునే వేదిక.చైనాను భారత్ ప్రత్యర్థిలా కాకుండా భాగస్వామిగా చూడాలనే సందేశాన్ని పంపడానికి ఈ శిఖరాగ్ర సమావేశాన్ని చైనా ఉపయోగించుకుంది.స్థిరత్వం గురించి తరచుగా జరిగే చర్చలు మరింత విశ్వసనీయ సంబంధంగా మారగలవా అన్న విషయంలో భారత్‌కు ఈ సమావేశం ఒక పరీక్ష లాంటిది.భారత్‌లోని ప్రజలు వాస్తవాన్ని అర్థం చేసుకున్నారు. సరిహద్దు వివాదం ఇంకా పరిష్కారం కాలేదు. చైనాతో భారతదేశానికి 99 బిలియన్ ( సుమారు 8 లక్షల 72 వేల 470 కోట్లు) డాలర్ల వాణిజ్య లోటు రాజకీయంగా తలనొప్పిలా మిగిలిపోయింది. అయినప్పటికీ ఎంత కష్టమైనా సరే... చర్చలు అవసరమని భావిస్తున్నారు.ఆరు దేశాల చిన్న గ్రూప్‌గా ప్రారంభమైన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) ఇప్పుడు పది సభ్య దేశాలు, ఇద్దరు పరిశీలకులు, 14 చర్చా భాగస్వాములతో కూడిన సమూహంగా ఎదిగింది.ప్రస్తుతం ఇది ప్రాంతీయ సంస్థకు సంబంధించి అతిపెద్ద భౌగోళిక ప్రాంతానికి, ప్రపంచంలో ఎక్కువమంది జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తోంది.వివిధ దేశాలు ఎలా కలిసి పనిచేయవచ్చో ఎస్‌సీఓ ప్రపంచానికి చూపిస్తోందని ఆయన అంటున్నారు. ఇది ఇంకా పూర్తి కానప్పటికీ, దేశాలు కలిసి వస్తే పరస్పర సహకార పరిస్థితిని బలోపేతం చేయవచ్చనడానికి ఇది రుజువని ఆయన అన్నారు.ఈ సమీకరణంలో రష్యా పాత్ర తక్కువేం కాదు. రష్యా నుంచి భారత్ చౌకైన ముడి చమురును ఎక్కువగా కొనుగోలు చేసే దేశంగా మారింది. ఇలా చేయడం ద్వారా, భారత్ తన పౌరులను ద్రవ్యోల్బణం నుంచి కాపాడింది.ఈ సంవత్సరం రష్యా అధ్యక్షుడు పుతిన్ భారతదేశాన్ని సందర్శించనున్నట్టు కూడా వార్తలు వస్తున్నాయి. ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది.భారత్‌కు సంబంధించి రష్యా కేవలం చమురు, ఆయుధాల సరఫరాదారు మాత్రమే కాదు. ఇది స్వయంప్రతిపత్తికి చిహ్నం. నరేంద్ర మోదీ ప్రభుత్వం అమెరికాకు తలవంచకుండా తన సంబంధాలలో సమతుల్యతను కాపాడుకోగలదనడానికి కూడా ఇది రుజువు. నరేంద్ర మోదీ, వ్లాదిమిర్ పుతిన్, జిన్‌పింగ్ కలవడం కచ్చితంగా ఒక ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది. అయినప్పటికీ రక్షణ, సాంకేతికత, పెట్టుబడి రంగాలలో అమెరికాపై భారత్ ఆధారపడటం కొనసాగుతుంది.మోదీ గతంలో కంటే ఎక్కువగా సమతుల్యతను పాటిస్తున్నారు. ఏదైనా నిర్ణీత ఫార్మాట్‌కు పరిమితం కావడానికి నిరాకరిస్తున్నారు."అతి ముఖ్యమైన



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# ఆధ్యాత్మిక సద్గురు జగ్గీ వాసుదేవ్



భారతీయ మోక్షకామి, ప్రవచన కర్త, యోగి, ఆధ్యాత్మిక సద్గురు జగ్గీ వాసుదేవ్ చొరవతో లాభాపేక్ష లేని సంస్థ "ఈషా ఫౌండేషన్"ను స్థాపించి ఇండియా, అమెరికా, యూకె, లెబనాన్, సింగపూర్, ఉగాండా, ఆస్ట్రేలియా లాంటి పలు దేశాలకు విస్తరించి యోగాతో పాటు పలు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. హిందూ సమాజానికి కాకుండా అన్ని మతస్థులకు అనుకూలంగా ప్రపంచ మానవాళికి జగ్గీ వాసుదేవ్ చేస్తున్న అమూల్య సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2017లో పద్మ భూషన్ పురస్కారాన్ని పొందడం, ఐరాస సామాజిక, ఆర్థిక సంస్థకు సలహాదారుగా నియమించబడ్డారు. 03 సెప్టెంబర్ 1957 రోజుల కర్నాటక రాష్ట్ర మైసూర్‌లో తెలుగు కుటుంబానికి చెందిన సుశీల-డా: వాసుదేవ్ దంపతులకు నాలుగవ, చివరి సంతానంగా జన్మించారు జగదీష్ వాసుదేవ్. తండ్రి రైల్వేశాఖలో నేత్ర వైద్యులుగా పనిచేయడం వల్ల పలు చోట్లకు బదిలీ కావడం జరిగేది. జగ్గీ అనే ముద్దు పేరుతో పిలువబడే జగదీష్ చిన్నపాటి నుంచే ప్రకృతిని ప్రేమిస్తూ, తరుచుగా అడవులను వెళ్లి ఆనందంగా గడిపే వారు. తన 11వ ఏట మల్లాడి హళ్ళి శ్రీ రాఘవేంద్ర స్వామి పరిచయంతో యోగాసనాలు నేర్చుకొని నిత్యం యోగసాధన చేస్తూ లోతైన అనుభవాలను గడించారు. పాఠశాల విద్య అనంతరం మైసూర్ యూనివర్సిటీలో బి.ఎ. ఇంగ్లీష్ పట్టా పొందారు. జగ్గీ వాసుదేవ్‌కు మోటార్లు సైకిల్‌పై షికారుకి వెళ్లడం ఇష్టంగా ఉండేది. కాలేజి చదువుల అనంతరం ఫౌల్ట్రీ, ఇటుక తయారీ, భవన నిర్మాణ రంగాల్లో లాభదాయక వ్యాపారం చేశారు. తన 25వ ఏట మధ్యాహ్నం మోటార్లు సైకిల్‌పై చాముండి కొండపైకి వెళ్ళి ఒక రాయిపై కూర్చొని నాలుగున్నర గంటల పాటు అపూర్వ ఆధ్యాత్మిక అనుభవం పొంది నేను, రాయి, చెట్టు, ప్రకృతి అంతా ఒక్కటే అంటూ ఒక్కటే అనే అనుభవానికి వచ్చారు. తన వ్యాపారాన్ని మిత్రులకు అప్పగించి ఆధ్యాత్మిక అనుభవ అంతరార్థాన్ని అవగతం చేసుకోవడానికి పలు చోట్ల తిరుగుతూ ధ్యానం, యోగాలను బోధించడానికి నిశ్చయించారు. 1983లో మైసూర్‌లో ఏడుగురితో ప్రారంభమా యోగా తరగతులు క్రమంగా పలు నగరాలకు, ప్రాంతాలకు, దేశాలకు విస్తరించడం విశేషం. 1989లో కోయంబత్తూర్‌లో యోగా శిబిరం ప్రారంభించి "ఈషా యోగ సెంటర్" ప్రారంభించి ప్రాణాయామం, యోగాసనాలు, ధ్యానం బోధించడం నిత్యకృత్యం చేసుకున్నారు. 1993లో తన శిష్యుల సహాయంతో ఒక ఆశ్రమాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. 1994లో కోయంబత్తూర్‌కు 40 కిమీ దూరంలో వెళ్ళంగిరి పర్వత పాదాల చెంత 13 ఏరకాల భూమిని కొనుగోలు చేసి "ఈషా యోగా సెంటర్"ను ఏర్పాటు చేశారు. 'ఈషా' అనే సంస్కృతి పదానికి పాలకురాలు, యజమాని, ప్రభువు, రక్షించేది, నిరాకార దైవం, దివ్యత్వం లాంటి పలు అర్థాలు ఉన్నాయి. 1994లో ప్రారంభమైన ఈషా యోగా సెంటర్‌లో యోగా తరగతులు ప్రారంభం అయ్యాయి. 1999లో ధ్యాన లింగాన్ని ప్రతిష్టించడంతో ఆ ప్రాంగణాన్ని ప్రజల సందర్శనార్థం తెరువబడింది. ఏ మతానికి, విశ్వాసానికి చెందని ధ్యానలింగ యోగాలయం నేడు ధ్యానానికి మాత్రమే కేంద్రంగా నిలుస్తున్నది. ప్రవేశ ద్వారం వద్ద నిర్మించిన సర్వధర్మ స్తంభం అన్ని మతాల ఏకత్వాన్ని చాటుతూ అందరినీ ఆకర్షిస్తున్నది. సద్గురు జగ్గీ వాసుదేవ్ మతాతీత, లాభాపేక్షలేని స్వచ్ఛంద కార్యకర్తలతో నిర్వహింపబడే "ఈషా ఫౌండేషన్"ను స్థాపించారు. ఆశ్రమంలో సద్గురు యోగా తరగతులు తీసుకోవడంతో ప్రారంభమైన "ఇన్నర్ ఇంజనీరింగ్" బోధనలు నేడు విశ్వవ్యాప్తం చేయడంలో విజయవంతం అయ్యారు. వివిధ పట్టణాల్లోన కాకుండా విదేశాల్లో సహితం సత్సంగాలు నిర్వహిస్తూ, ఈషా ఫౌండేషన్ సంస్థ కేంద్రాలను ప్రారంభిస్తూ, ప్రతి ఏట మానస సరోవర్ యాత్రలను భక్తులతో పాటు నిర్వహిస్తూ ప్రజల్లో ధార్మిక భావాలను చిగిరింపజేస్తున్నారు. ఐరాస నిర్వహించే ప్రపంచ శాంతి సమావేశాల్లో పలుమార్లు ప్రసంగించారు. సామాజిక చైతన్యానికి కంకణబద్దులైన జగ్గీ వాసుదేవ్ చొరవతో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన "ప్రాజెక్ట్ గ్రీన్ హాండ్స్' అనే హరిత రక్షణ ఉద్యమానికి పూనుకొని 20 లక్షల కార్యకర్తలతో 82 లక్షల మొక్కలు నాటించగలిగారు. గ్రామీణ పునరాభువృద్ధికి ప్రజారోగ్యం, జీవన ప్రమాణాలను పెంచడానికి యోగా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక చైతన్యం, సామూహిక క్రీడలు మొదలగు సామాజిక హిత కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టడం చేపట్టి 54,000 గ్రామాల్లో 7 కోట్ల ప్రజలకు ప్రయోజనం చేకూర్చారు. ఈషా ద్వారా గ్రామీణులకు విద్య బోధనలు కొనసాగించడానికి ఏడు పాఠశాలలు నిర్వహిస్తూ గ్రామీణ పేద యువతను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. వీరు నిర్వహించే పాఠశాలల్లో చదువుతో పాటు సంగీతం, కళలు, యోగా, వృత్తి విద్యలను కూడా సమాంతరంగా నేర్పిస్తున్నారు. 78 ఏండ్ల ఆధ్యాత్మిక సద్గురు జగ్గీ వాసుదేవ్ ఇటీవల అనారోగ్యం కారణంగా ఢిల్లీలో మెదడు శస్త్ర చికిత్సను చేయించుకున్నారు. విజయకుమారిని వివాహమాడిన సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు ఒక కూతురు రాధే ఉన్నారు. తన అర్థాంగిని 1997లో కాలం చేయడం జరిగింది. పలు అంతర్జాత విశ్వవిద్యాలయాలు, ప్రఖ్యాత సంస్థల్లో అనేక ఉపన్యాసాలు ఇచ్చిన సద్గురు జగ్గీ స్థాపించిన ఈషా ఫౌండేషన్ వేదికగా 300లకు పైగా కేంద్రాల్లో 9 మిలియన్ల వాంలంటీర్లతో యోగ, ధ్యానం, ప్రాణాయామం, ప్రజాహిత సేవా కార్యక్రమాలను నిస్వార్థంగా నిర్వహిస్తున్నారు. ఒక సాధారణ వ్యక్తి తన నాలుగు దశాబ్దాల కాలంలో అసాధారణ స్థాయిలో ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, విద్య బోధన, ఆర్థికాభివృద్ధి, విశ్వ శాంతి స్థాపన యజ్ఞాలను కొనసాగిస్తూ, ప్రజలను ప్రభావితం చేస్తున్న సద్గురు జగ్గీ వాసుదేవ్ నిండు నూరేళ్లు సఫల జీవితం కొనసాగించాలని కోరుకుందాం, ఆయన ఆయురారోగ్యాలకు ప్రార్థనలు చేద్దాం.

# తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీక




నిజాం నిరంకుశ పాలనలో బానిసలుగా బతుకుతున్న వారి స్వేచ్ఛకోసం, తమ జీవితాన్ని త్యజించిన వారిలో 'సర్దార్ జమలాపురం కేశవరావు' ముందు వరుసలో నిలుస్తారు.. కట్టెదుట జరుగుతున్న అన్యాయాలకు చూస్తూ, సహిస్తూ ఉండలేక ప్రజల్లో ధైర్య సాహసాలను నూరి పోయడమే ఏకైక లక్ష్యంగా జీవితాంతం మందుకు సాగారు. హైదరాబాద్ రాజ్యంలో కాంగ్రెస్ పార్టీకి జీవంపోసి, ప్రజా శ్రేయస్సు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిబద్దత కలిగిన నేత, త్యాగశీలి సర్దార్ జమలాపురం కేశవరావు. సత్యాగ్రహిగా, క్విట్ ఇండియా ఉద్యమ కార్యకర్తగా, ఆంధ్ర మహాసభ నిర్వాహకుడిగా, గ్రంథాలయోద్యమ నిర్మాతగా, ఆదివాసీ, దళిత జనోద్ధారకుడిగా, పత్రిక స్థాపకుడిగా ఇలా కొన్ని ఎన్నో కార్యకలాపాలు చేపట్టి హైదరాబాద్ రాజ్య ప్రజల్లో చైతన్యాన్ని, ధైర్యాన్ని నింపిన మహోన్నతుడు కేశవరావు. అందుకే ఆయన్ను అందరూ తెలంగాణ 'సర్దార్'గా పిలుచు కుంటారు. తెలంగాణ కేసరిగా, 'దక్కన్ సర్దార్'గా బిరుదు లందుకున్న జమలాపురం కేశవరావు తనద్కెన శ్కెలిలో ఉద్యమాలు నడిపి కాంగ్రెస్‌కు, తెలుగు వారి ముఖ్యంగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ఊపిరి పోశారు. దక్కన్ సర్దార్‌గా, ఉక్కు మనిషిగా ప్రజలు పిలుచుకునే కేశవరావు నిజాం సంస్థానంలో తూర్పు భాగాన ఉన్న ఖమ్మం (నాటి వరంగల్ జిల్లా)లోని ఎర్రుపాలెంలో 1908, సెప్టెంబర్ 3 న జమలాపురం వెంకట రామారావు, వెంకట నరసమ్మలకు తొలి సంతానంగా జన్మించారు. సంపన్న జమీందారీ వంశంలో పుట్టినా, నాటి దేశ రాజకీయాలు అతనిని తీవ్రంగా కలవర పరచాయి. ఎర్రుపాలెం లో ప్రాథమిక విద్య అనంతరం, హైదరాబాదులోని నిజాం కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. వందేమాతరం గీతాలాపనను నిషేధించి నందుకు నిరసనగా, కళాశాల విద్యార్థులను కూడగట్టి, నిరసనోద్యమంలో కాలూనారు. గీతాన్ని ఆలాపించ నివ్వకపోతే తరగతులకు హాజరు కాబోమని హెచ్చరించారు. దీంతో చివరకు నిజాం పాలకవర్గం నిషేధాన్ని ఎత్తివేయక తప్పలేదు. ఈఘటన తర్వాత కేశవరావు ఆలోచనా పరిధి మరింత విస్తృతం అయింది. నిజాం పాలనలో కొనసాగుతున్న వెట్టి చాకిరితో అష్టకష్టాలకు గురవుతున్న ప్రజలను చూసిన కేశవరావు చలించి పోయారు. ప్రజలను విముక్తం చేయడానికి తెలంగాణ జిల్లాల్లో...ముఖ్యంగా వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కేశవరావు కాలినడకన విస్తృతంగా పర్యటించారు. ఆ క్రమంలోనే భారత స్వాతంత్ర్యోద్యమం పట్ల, గాంధీ సిద్ధాంతాల పట్ల కేశవరావు ఆకర్షితుడయ్యారు. 1923లో రాజమండ్రిలో మొదటిసారి మహాత్మా గాంధీ ఉపన్యాసాన్ని విన్న కేశవరావు, 1930లో విజయవాడలో జరిగిన సభలో గాంధీ పరిచయంతో మరింత ఉత్తేజితుడైనారు. ఆంధ్రపితామహుడుగా మాడపాటి హనుమంతరావు ప్రారంభించిన గ్రంథాలయ ఉద్యమంను తెలంగాణలోని ప్రతి పల్లెలోనూ ప్రచారం గావించారు. వయోజన విద్యకై రాత్రి పాఠశాలలు నడపడంలో కేశవరావు కృషి చేశారు. అణగారిన వర్గాల్లో చైతన్యాన్ని నింపడానికి ప్రత్యేక శ్రద్ధను కనపరిచేవారు. 1938లో దీపావళి సందర్భంగా ఆవిర్భవించిన 'హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్' స్థాపనలో కేశవరావు కీలకపాత్ర వహించి, దానికి మొదటి అధ్యక్షుడయ్యారు. 1938 సెప్టెంబర్ 24 మధ్యాహ్నం మధిరలో గోవిందరావు నానక్, జనార్దనరావు దేశాయ్, రావి నారాయణరెడ్డిలతో కలిసి సత్యాగ్రహ దీక్షకు కేశవరావు సిద్ధమయ్యాడు. ఎట్టి పరిస్థితుల్లో సర్దార్‌ను దీక్ష చేయనివ్వొద్దని నిజాం ప్రభుత్వం అనుమతి నివ్వలేదు. మధిరలో అడుగ డుగునా పోలీసులను మోహరించింది. అయినా భారీ సంఖ్యలో ప్రజలు దీక్ష వేదిక దగ్గరకు చేరుకున్నారు. అప్పుడే ఎవరూ ఊహించని విధంగా రైతు వేషంలో దీక్ష వేదిక దగ్గరకు వచ్చాడు కేశవరావు. వెంటనే మహాత్మా గాంధీకి జై, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ జై అని దిక్కులు పెక్కటిల్లేలా నినాదించారు. అరెస్టు చేసి నిషేధాన్ని ఉల్లఘించి సత్యగ్రహ దీక్ష చేశారంటూ కేశవరావుకు 18 నెలలు జైలు శిక్ష విధించారు. వరంగల్ జైలులో ఎనిమిది నెలల శిక్షను అనుభవించిన తర్వాత కేశవరావుతో సహా రాజకీయ ఖైదీలందరినీ నిజామాబాద్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలయ్యాక కూడా అదే పోరాట పంథాను కేశవరావు కొనసాగించారు. అంటరానితనం నిర్మూలించేందుకు, ఆదివాసీల అభివృద్ధికి కూడా ఉద్యమం చేశారు. 1942లో కాంగ్రెస్ పిలుపు మేరకు 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని తెలంగాణలో ఊరూరా ప్రచారం చేసే బాధ్యత వహించారు. 1946లో మెదక్ జిల్లా కందిలో కేశవరావు అధ్యక్షతన జరిగిన 13వ ఆంధ్ర మహాసభ సందర్భంగా నిర్వహించిన బ్రహ్మాండమైన ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. 1947 ఆగస్టు 7న మధిరలో స్టేట్ కాంగ్రెస్ చేపట్టిన సత్యాగ్రహం మరువలేనిది. దానికి బాధ్యుడైన కేశవరావుకు ప్రభుత్వం రెండు సంవత్సరాలు కారాగార శిక్ష విధించింది. యావత్ భారత దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడానికి ఉవ్విళ్లూరుతున్న సందర్భంలో కేశవరావు వంటి నాయకులు నిర్బంధానికి గురికావడం ఒక విషాదం. నిజాం సంస్థానం భారత దేశములో విలీనమైన తరువాత, 1952లో కేశవరావు రాజ్యసభకు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌పై పోలీసు చర్య అనంతరం రాష్ట్రంలో జరుగుతున్న అకృత్యాలను తీవ్రంగా నిరసించిన మొట్టమొదటి కాంగ్రెస్ వ్యక్తి కేశవరావు. అప్పటి మిలిటరీ అధికారి నంజప్పను నిలదీసిన నిజమైన ప్రజానాయకుడు సర్దార్. కాంగ్రెస్ పార్టీలో ఉండి జాగీర్దార్లను, జమిందార్లను విమర్శించమంటే ఆనాడు నిజంగా ఒక సాహసమే. నంజప్ప నేతృత్వంలో మిలిటరీ వారు కమ్యూనిస్టుల ఏరివేత పేరిట జరిగిన హింసా కాండను, ముస్లిముల ఊచకోతను కేశవరావు ఖండించారు. ప్రజల పక్షాన నిలిచారు. "మనం ఏ ప్రభుత్వాన్ని అయినా సరే అది రాష్ట్ర, జాతీయ ప్రభుత్వం, కాంగ్రెసు ప్రభుత్వం అయినా, కాంగ్రెసు కాని ప్రభుత్వం అయినా అమాయక ప్రజలపై అత్యాచారాలు జరపడాన్ని సహించబోము. నంజప్ప మన ప్రభుత్వంలో ఒక అధికారి మాత్రమే. యింకా స్పష్టంగా చెప్పాలంటే ఆయన మన ప్రజలకు సేవకుడు. ఆయన యధేచ్ఛగా ప్రవర్తించడానికి, మేము అనుమతించడానికి సిద్ధముగా లేము. ఆయన చేస్తున్న అకృత్యాలు నిజాం తొత్తుల్కెన జాగీర్దార్లను, నాజీ హిట్లరును తలదన్నిన నిజాంను మరిపిస్తున్నది. నంజప్ప తెలంగాణ రక్షకుడిగా కాక, భక్షకుడిగా వచ్చినట్లు అనిపిస్తున్నది." అని డోర్నకల్లులో జరిగిన సభలో కేశవరావు ఎలుగెత్తి చాటారు. సర్దార్ కేశవరావు భాషారాష్ట్ర సిద్ధాంతానికి పూర్తిగా వ్యతిరేకి. తెలంగాణ అస్తిత్వాన్ని స్థిరీకరించాలని కోరుకున్నారు. కన్నడ, మరాఠీ భాషా ప్రాంతాలతో కలిసి పోయిన హైదరాబాద్ రాష్ట్రం అలాగే ఉండాలని వాంచించారు. అలాగే జమిందారి, జాగిర్దారీ వ్యవస్థలతో అతలాకుతలమైన తెలంగాణను విశాలాంధ్రలో కలిపినట్లయితే ఏమాత్రం మేలు జరగదని నొక్కి చెప్పారు. విద్యాపరంగా, సామాజిక, ఆర్థిక రంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేయకుండా విశాలాంధ్ర ఏర్పాటు వల్ల స్థానికులపై స్థానికేతరుల అజమాయిషీ ఆరంభ మవుతుందని ముందుగానే ఊహించిన అనుభవశాలి ఆయన. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ సభలు, సమావేశాలు జరిగినపుడు ఒక సామాన్య కార్యకర్త మాదిరిగా పందిళ్ళు వేయడానికి, కర్రలు కూడా నాటి నిరాడంబరతకు, పార్టీ పట్ల అంకితభావంకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచి, అంతలా పార్టీకి సేవ చేసిన ఆయనకు కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల మూలంగా రావాల్సినంత పేరు, దొరకాల్సిన గౌరవం రాలేదు. చేపట్టిన ప్రతి ఉద్యమం లోనూ విజయాల్ని సాధించిన ఆయన స్వాతంత్ర్యానంతర కాలంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనకు ద్రోహం చేశారు. ఆయన ఎదుగుదలను అడ్డుకున్నారు. ఎన్నికల్లో ఓటమి చెందేలా పరిస్థితులు కల్పించారు. జైలు జీవితం, ఉద్యమ సమయంలో భోజనం లేకపోవడం, పార్టీలోని నాయకులు చేసిన మోసం, కలగలిసి తీవ్ర మానసిక ఒత్తిడికి గురి అయిన కేశవరావు1953, మార్చి 29న తన

## ఘనంగా పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు.



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** అల్లవరం మండలం బొడసకుర్రు సచివాలయం వద్ద సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో జనసేన పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ముందుగా పంచాయతీ పాలక వర్గ సభ్యులు,జనసేన నాయకులు, కూటమి నాయకులతో కలిసి కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ కి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం పారిశుధ్య కార్మికులను,ఆశ వర్కర్లను దుస్సలువాతో ఘనంగా సత్కరించి,పట్టు వస్త్రాలను పంపిణీ చేసి, కాయకూరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు దొమ్మేటి శ్రీ శాంతి భవాని, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు అడపా శ్రీను, పాలకవర్గ సభ్యులు బొంతు పల్లంరాజు, పొట్టుపోతు పోచమ్మ, ఓలేటి పరమేశ్వరరావు, అయిల నాగేశ్వరరావు, చింతం శ్రీనివాస్, జనసేన పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ళ శ్రీను, మొయిల గణపతి, ముత్యాల బాబీ, అరవ చంటి, రొక్కాల నాగేశ్వరరావు, దొమ్మేటి రాధాకృష్ణ, సచివాలయం ఉద్యోగులు, పంచాయితీ ఉద్యోగులు, అంగన్వాడీ ఉద్యోగులు, డ్వాక్రా యానిమేటర్లు, హెల్త్ ఉద్యోగులు, ఆశ వర్కర్స్, వివిధ శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం ఏర్పాటు....

అధిక సంఖ్యలో పాల్గొని రక్త దానం చేసిన జన సైనికులు.



అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్. అల్లవరం మండలం అల్లవరం ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా కిమ్స్ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అయితబత్తుల ఆనందరావు విచ్చేసి రక్తదాన శిబిరము మరియు ఉచిత వైద్య శిబిరం పాల్గొని రక్తదానం చేసిన యువకులకు స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా సర్టిఫికెట్ ప్రధానం చేయడం జరిగింది . అధిక సంఖ్య లో జన సైనికులు పాల్గొని రక్త దానం చేశారు.ఈ కార్యక్రమంలో అల్లవరం మండల సబ్ ఇన్స్పెక్టర్ సంపత్ కుమార్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఆడపా శ్రీనివాసరావు, జిల్లాకార్యదర్శి సుంకర సాయి, అల్లవరం మండల అధ్యక్షులు కట్టా నారాయణమూర్తి ,అల్లవరం మండల కార్యదర్శి కట్టా జనార్ధన్ ,జనసేన నాయకులు మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం లో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను మంగళవారం ఎమ్మార్వో ఐపి శెట్టి, ఎస్సై డి సురేష్ బాబు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాలు ఊరేగింపుగా వెళ్లే రూట్ మ్యాప్ ను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం లో ఎలాంటి అపశృతులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ గణనాథుల శోభా యాత్రను నిర్వహించాలని మండలం లోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వో లకు సూచించారు. పోలీసులతో సమన్వయం చేసుకొని వారి సూచనలను పాటిస్తూ, నిర్దేశించిన మార్గంలోనే ఊరేగింపు జరపాలని మండపాల నిర్వాహకులకు వివరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమలాపురం లో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు





**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఐమైండ్స్ స్కూలు ఆవరణలో ఏర్పాటుచేసిన వేడుకలలో పాల్గొని కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు . ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే . ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంటు సభ్యులు హరీష్ మధుర్, రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, కిమ్స్ హాస్పిటల్ చైర్మన్ చైతన్య రాజు, మట్ట మహాలక్ష్మి ప్రభాకర్, అధికారి జయవెంకటలక్ష్మి, బిజెపి నాయకులు నల్లా పవన్ కుమార్, జనసేన నాయకులు కల్వకోలను తాతాజీ,ఆర్ డి ఎస్ ప్రసాద్, నల్లా శ్రీధర్, యాళ్ళ సతీష్, లింగోలు పండు, ఇసుకపట్ల రఘుబాబు, కౌన్సిలర్ ఏడిదా శ్రీను, వీరమహిళా నాగమానస, గంధం పల్లంరాజు, నల్లా వెంకటేశ్వరరావు అవుపాటి గోపాల్, పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన వీరమహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు

# ఉప ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్** 01:-రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు పర్యావరణ అటవీ పంచాయతీరాజ్ శాఖ మంత్రి అయిన కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు రామచంద్రపురం నియోజవర్గంలో ఘనంగా నిర్వహించారు.వాడవాడల ఆ గ్రామాల్లోనూ, పట్టణంలోనూ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామచంద్రపురం రాజగోపాల్ సెంటర్ వాటర్ ప్లాంట్ బాబి పట్టణ కాపు సంఘం అధ్యక్షుడుతో గరు బ్రహ్మాజీ రావు చిక్కాల దొరబాబు,నారపరెడ్డి బాల రాం తదితరులు పాల్గొని భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. స్థానిక ఆటో యూనియన్ నాయకులు ఆకుమర్తి సూరిబాబు,ఆకుల పెద్ద, ఎలుగుబంటల రాము, మేడిశెట్టి జేజి బాబు,వెల్ల మాజీ సర్పంచ్ వట్టుకుటి ఏసుబాబు,నల్ల బ్రదర్స్ నున్న చిట్టిబాబు, అయ్యల రాంబాబు మరియు జన సైనికులు పవన్ కళ్యాణ్ అభిమానులు కుటమి నాయకులు పాల్గొన్నారు.



# మా ఆకలి కేకలు మీకు కనపడవా ఆటో కార్మికులు నిరసన

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్త్రీ శక్తి పథకం వల్ల తమ ఉపాధిని కోల్పోయామని అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.ఆటో కార్మికులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం ఏటా 15000 ఇస్తుందని మాటలలో చెప్పడమే తప్ప చేతల్లో లేదని మా కార్మికుల కుటుంబాలు పడుతున్న బాధను తీర్చాలంటే మాకు 25000 కచ్చితంగా ఇవ్వాలని గత సంవత్సరం బకాయికి ఈ సంవత్సర బకాయిని కూడా కలిపి 50000 చెల్లించాలని మరియు 50 సంవత్సరాలు నిండిన ఆటో డ్రైవర్లకు పెన్షన్ వసతి కలుగచేయాలని కోరారు. రేపటి నుంచి నల్ల బ్యాడ్జిలతో ఆటో కి నల్ల జండాతో మా నిరసన ప్రభుత్వానికి తెలియచేస్తామని తదుపరి కార్యాచరణ రేపు జరగబోవు రామచంద్రాపురం డివిజన్ ఆటో కార్మికులతో కూడా చర్చించి త్వరలో 48 గంటలు నిరహార దీక్ష చేపడతామని ఆటో డ్రైవర్ల జీవనోపాధికి ప్రభుత్వం తగు భద్రత కల్పించేవరకు దఫా దఫాలుగా



నిరసన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని .కోనసీమ జిల్లా జనరల్ సెక్రటరీ ఊటాల వెంకటేష్ తెలియచేశారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు వాసంశెట్టి సత్తిరాజు మరియు మండల డివిజన్ జిల్లా ఆటో కార్మిక సంఘాల నాయకులు,సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వైయస్సార్... పలివెల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ వర్ధంతి

**మండపేట మండలం... విశ్వం వాయిస్ న్యూస్...** మండపేట మండలం ఏడిద గ్రామ పార్టీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిద సంత మార్కెట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరావు, ఎంపీటీసీ లు తాతపూడి ఉషా రాజేశ్, పట్నాల నాగబాబు పాల్గొన్నారు అనంతరం వారు మాట్లాడుతూ దివంగత నేత రాజశేఖర్ రెడ్డి సేవలు ఎనలేవని, ఆయన చేసిన ప్రజా సంక్షేమ పథకాలు గుర్తు చేశారు. ఆయన కుమారుడు ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసే నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని రాబోయే 2029లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలో రావడానికి ఖాయమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో తోట త్రిమూర్తులు గెలుపు ఖాయమని వారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాష్ట్ర యువజన విభాగ జాయింట్ సెక్రెటరీ వాసిరెడ్డి అర్జున్, పార్టీ నాయకులు వల్లూరి రామకృష్ణ, రామిశెట్టి శ్రీహరి బాబు, పితాని



నారాయణరావు, చిలుకూరు బుజ్జి విసుపురెడ్డి శివ, పరమట తరుణ్, బూరిగ జానీ, బండారు కృష్ణ, కొండేటి కాళికృష్ణ, పమిడిపల్లి నానాజీ, బేతా రవితేజ, పలల్లేటి వినోద్, పార్థసారథి పైడిమళ్ళ బాబ్జీ, వి.వెంకట్, వీధి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు...

**మండపేట టౌన్... విశ్వం వాయిస్ న్యూస్...** వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల కోసం చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోయాయని ఆయన మరణం రాష్ట్రానికి తీరనిలోటని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మెన్ ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గ వైసిపి ఇన్ ఛార్జ్ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేటలో మంగళవారం రాజారత్న సెంటర్ వద్ద మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ రాజశేఖర్ లాంటి గొప్ప నాయకుడు లేకపోయినప్పటికీ ఆయన అందించిన స్ఫూర్తితో ఎంతోమంది నాయకులు రాజకీయాలలోకి వచ్చి సేవలందిస్తున్నారన్నారు. దేశంలో మొట్టమొదటిసారిగా పేదల కోసం ఆలోచించి ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్మెంట్ వంటి పథకాలను ప్రవేశపెట్టన గొప్ప నేత రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. రాజారత్న సెంటర్లో ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి , వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి



పాపారాయుడు, కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు, మున్సిపల్ వైస్ చైర్మెన్ వేగుళ్ల నారయ్య బాబు , కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్స్ మొండి భవాని మురళి, నీలం దుర్గ, మారిశెట్టి సత్యనారా యణ, మెండు బాపిరాజు, షేక్ ఆలీఖాన్ బాబా,సన్మాల ధనరాజు, కనికెళ్ళ ప్రసాద్, పోలమాల సత్తిబాబు, ముక్కా దాలియ్యా, ముక్కా సుబ్రమణ్యం, జొన్నపల్లి సత్తిబాబు, యాంద్ర ప్రభాకర్ రావు, శెట్టి నాగేశ్వరరావు, పెంకే గంగాధర్,జెట్టి బాబూరావు, పిఠాపురం సత్యనారా యణ,సాధనాల శివ, నాగులపల్లి ఈశ్వరరావు, బత్తిన దొరబాబు, తాడి రామారావు, ముమ్మిడివరపు బాపిరాజు, విపర్తి సింహాచలం, జిన్నూరి సాయిబాబా, అంజూరి శ్రీనివాస్ చౌదరి, పలివెల సుధాకర్, తోరం శ్రీను, గెడ్డం గాంధీ, వీరెల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వెల్ల గ్రామంలో వైఎస్ఆర్ 16 వర్ధంతి

**రామచంద్రపురం మండలం విశ్వం వాయిస్ న్యూస్ :-** మాజి ముఖ్య మంత్రి డాక్టర్ వైయస్ఆర్ 16వ వర్ధంతి సందర్భంగా వెల్ల గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలుగు వారి గుండెల్లో చెరిగిపోని జ్ఞాపకం రాజశేఖర్ రెడ్డి అని,ప్రజలు కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలు మనసులో చెరగని ముద్ర వేశారని అన్నారు.నాడు రాజకీయ నాయకులుకు నేడు వున్న పరిస్థితి చాలా భిన్నంగా ఉందని,విలువతో కూడిన పదవులుతో పరిపాలన జరగడం లేదన్నారు. రానున్న రోజులు లో మళ్ళీ వైసీపీ పార్టీ అధికారం లోకి వస్తుందని ఆశభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మండల వైసీపీ కన్వీనర్ పోలినాటి ప్రసాద్,పంతగడ విజయ ప్రసాద్,వెల్ల గ్రామ వైసీపీ నాయకులు,కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.



## మాజి ముఖ్య మంత్రికి ఘన నివాళులు అర్పించిన బోస్



**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 02 :-** వైఎస్ఆర్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా రాజ్యసభ సభ్యుల పిల్లి సుభాష్ చంద్రబోస్ మరియు రామచంద్రపురం నియోజకవర్గ ఇన్చార్జ్ పిల్లి సూర్య ప్రకాష్ మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా వున్న వైయస్ఆర్ విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డితో అపూర్వ అనుబంధం ఉందని, ఆయనతో గడిపిన రోజులు,అలానే రాష్ట్ర ప్రయోజనాలు కోసం అయన ఆలోచించే విధానం నాతో పాటు అనేకమంది నాయకులును ఆలోచింపజేసే విధంగా వుండేవి అన్నారు.అలానే అసంబ్లీలో అయన పాత్ర ప్రతిపక్షం అయినా ప్రభుత్వంలో వున్నా ప్రజా శ్రేయస్సు కోసమే పోరాటం చేసారని గుర్తుకు చేశారు. అనుకోకుండా ఆనాడు రాజశేఖర్ రెడ్డి ని కోల్పోవడం చాలా దురదృష్ట కరం అని అన్నారు.ఆయన వారసుడుగా జగన్ ప్రస్తుత రాజకీయలలో వున్నారని అధికారం వున్నా లేకున్నా ఆయనతోనే ఉంటామని, 2029 లో మళ్ళీ వైసీపీ పార్టీ ఊహకందని రితిలో భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తాం అన్నారు.రామచంద్రపురం నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు,అనుబంధ విభాగ అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు,కార్యకర్తలు, అభిమానులు మహానేతను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు.

## తెలుగు ప్రజలు గుండెల్లో చెరిగిపోని జ్ఞాపకం రాజశేఖరరెడ్డి.



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్:** సంక్షేమ ప్రదాత,అభివృద్ధి విధాత.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి వేడుకలు అల్లవరం మండలం కోడూరుపాడు సెంటర్ లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమలాపురం అసెంబ్లీ ఇంచార్జి డాక్టర్ పినిపే శీకాంత్ అల్లవరం మండలం కోడూరుపాడు వద్ద ఉన్న వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కొమరగిరిపట్నం గ్రామంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి తో పాటు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో చెరిగిపోని జ్ఞాపకం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యులు చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ , ఎంపీపీ శేషరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమీ మరియు ఎంపీటీసీలు, సర్పంచ్ లు అల్లవరం మండలం వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు మహానేతను స్మరించుకున్నారు.

## 104 ఉద్యోగులు బదిలీలు అవాస్తవం

### రీజనల్ మేనేజర్ హిమజ

రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 02 :-104 ఉద్యోగుల సమస్యల మీద సిఐటీయు అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం ఆర్ఎం హిమజ ని ఒక ప్రకటనలో వివరణ కోరారు.ఈ సందర్బంగా అమే స్పందించి మాట్లాడుతూ ఏదైతే పిఎఫ్,ఈఎస్ఐ ఉద్యోగులకు సక్రమంగా అమలు జరిగే విధంగా చూస్తామని అన్నారు.అలానే వెహికల్స్ రిపేర్లు చేయించడం జరుగుతుందని,త్వరగా పూర్తి చేస్తామని చెప్పడం జరిగింది.



## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 54వ జన్మదిన వేడుకలు.

మచ్చా గంగాధర్ ఆధ్వర్యంలో



**కాకినాడ రూరల్ : విశ్వం వాయిస్ న్యూస్.** జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కాకినాడ లో జగన్నాధపురం సత్యదేవి నగర్ లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 54వ జన్మదిన వేడుకలను జనసేన పార్టీ సీనియర్ నాయకుడు మచ్చా గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తోలిత పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేకే కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు . పేదలకు చీరలు పంపిణీ చేశారు . అనంతరం కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మెడికల్ వార్డులో 500 మంది రోగులకు దుప్పట్లో, పండ్లు,పంపిణీ చేశారుఈ సందర్భంగా జనసేన నాయకులు తోట సుధీర్, మచ్చ గంగాధర్, వి.వి. స్వామి, మాట్లాడారు .రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి, ప్రజాసంక్షేమా నికి పవన్‌కళ్యాణ్ కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. వివి స్వామి, గంగాధర్ మాట్లాడారు. జనసేన పార్టీలోని మొట్టమొదటిసారిగా అది సామాన్యుడు కు ఉన్నత పదవులు ఇచ్చి గౌరవించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జగన్నాధపురం ఇంచార్జ్ కొక్కిలగడ్డగంగరాజు,మచ్చా లోకేష్ వర్మ, మోస ఏసోబు, పొన్నాడ నాగేశ్వరరావు, దారపు శిరీష, రచ్చ ధనలక్ష్మి. వాసంశెట్టి దుర్గా. మావులూరి రాగిణి సురేష్ నాయుడు. జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు.

ముఖ్యఅతిథిగా పంతం సందీప్.



**కాకినాడరూరల్: విశ్వం వాయిస్ న్యూస్.** జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ 54వ పుట్టినరోజు సందర్బంగా కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ మండలం రమణయ్య పేట లో స్థానిక జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఆశ్రమ శ్రావణి వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి, వృద్దులకు పళ్ళు అందించి, భోజనాలు వడ్డించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు కాకినాడ రూరల్ జనసేన యంగ్ నాయకులు పంతం సందీప్. ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు, కుటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలు వద్దు... సమాజ సేవే ముద్దు...

గంగడిప్యూటీ సీఎం స్ఫూర్తితో గోవులకు పచ్చగడ్డి వేసిన జనసేన నేత సలాది..



**కాకినాడ రూరల్: విశ్వం వాయిస్ న్యూస్ :** ఫ్లెక్సీలు వద్దు, సమాజం సేవే ముద్దు అని ఉపముఖ్యమంత్రి వర్యులు జనసేన పార్టీ చీఫ్ కొణిదెల పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపుమేరకు రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ వారి ఆదేశాలతో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆడంబరాలకు దూరంగా ఉంటూ పశువులకు పచ్చ గడ్డి గ్రాసం వేయడం జరిగిందని జనసేన పార్టీ కాకినాడ రూరల్ సీనియర్ నాయకులు హైకోర్టు న్యాయవాది జిల్లా రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు సలాది శ్రీనివాస్ బాబు అన్నారు. స్థానిక రమణయ్యపేట (%ఱ్రాజూ% ) జంతు నివారణ కేంద్రం వద్ద పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఆవులకు పచ్చ గడ్డని జనసేన నాయకులు సలాది వాటికి ఆహారంగా వేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు నోరులేని సుమారు 300 మూగ జీవాలకు పచ్చగడ్డి ఆహారంగా వేయడం చాలా ఆనందం ఇచ్చిందని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జంతు హింస నివారణసంఘం ఇంచార్జ్ మంతెన రామ్, జనసేన నాయకులు సలాది నాగబాబు,సలాది యూత్ మాగిశెట్టి మణికంఠ, కొప్పిశెట్టి లోవరాజు, పితాని శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ

**కాకినాడ రూరల్:(కరప) విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ రూరల్ కరప మండలం గొడ్డటిపాలెం గ్రామంలో గల కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ఆదేశాల మేరకు గొడ్డటి పాలెం గ్రామ సర్పంచ్ గోన అనూష ఆంజనేయులు ఆధ్వర్యంలో రేషన్ షాప్ నెంబర్ 3 దగ్గర రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనూష ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలో అనేక సంక్షేమ పథకాలు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు,శ్రీ శక్తి పథకం, అనేక సంక్షేమ పథకాలతో అభివృద్ధి ముందుకు దూసుకుపోతుంది అని అన్నారు, డిప్యూటీ సీఎం పంచాయతీరాజ్,గ్రామీణ అభివృద్ధి , అటవీ శాఖ మాత్యులు కొణిదల పవన్ కళ్యాణ్ కీ జన్మదిన శు భాకాంక్షలు తెలియజేసినారు, గాంధీ కలలు కన్నా, గ్రామ స్వరాజ్యం పంచాయతీలతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు నక్క బ్రహ్మాజీ, నక్క రాజబాబు, గ్రామ కమిటీ టిడిపి అధ్యక్షులువాసంశెట్టి ఉమా, సొసైటీ డైరెక్టర్ గంజా రాంబాబు, పంచాయతీ వార్డు నెంబర్లు చోడ




బత్తులమణికంఠ, వాసంశెట్టి సురేష్, టిడిపి నాయకులు వాసంశెట్టి విష్ణుమూర్తి, శీలం గోపాలకృష్ణ, దాసరి ఏకలవ్యుడు, సరూప లాజరు, తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకత కోసమే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వెల్లడి

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పంపిణీ నిత్యావసర సరుకుల చౌక ధరల దుకాణాల వ్యవస్థలో మునుపటి వరకూ ఉన్న సాధారణ రేషన్ కార్డుల స్థానంలో కొత్త రేషన్ కార్డుల అమలుకు ఎన్.డి.ఎ. ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రజా పంపిణీ వ్యవస్థలో పూర్తి పారదర్శకత కోసమే క్యూఆర్ కోడ్ ఈ-స్మార్ట్ రేషన్ కార్డుల విధానాన్ని అమలు చేస్తున్నట్టు ప్రభుత్వం ఊదర గొడుతూ ఉన్నప్పటికీ అదెలా సాధ్యమో చెప్పకపోయి నప్పటికీ పాత రేషన్ కార్డులపై ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పతాకం రంగులు, జగన్ బొమ్మలను తొలగించడమే ఎన్.డి.ఏ. ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని తెలివైన ప్రజానీకం అర్థం చేసుకున్నది. లేకపోతే కోట్లాది రూపాయలను వెచ్చించి డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయాల్సిన తక్షణ అవసరం, అదనపు ప్రయోజనం ఏముందన్నది ప్రజాస్వామ్య ప్రియుల సహేతుక ప్రశ్న. ఇక ఈ కార్డుల పంపిణీ విషయానికి వస్తే... కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఈ-స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మంగళవారం ప్రారంభించారు. ప్రత్తిపాడులోని పాత తాహసిల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ లబ్దిదారులకు కార్డులను లాంఛనంగా పంపిణీ చేసారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు, ప్రజా పంపిణీ వ్యవస్థలో పూర్తి పారదర్శకతనుపాటించడం కోసమే కూటమి ప్రభుత్వం స్మార్ట్ కార్డులను తీసుకు వచ్చిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ప్రజలు అందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సత్యప్రభ కోరారు. ఇక నియోజకవర్గంలోని శంఖవరం మండలం విషయానికి వస్తే... 14 పంచాయతీల్లోని 32 గ్రామాల పరిధిలోని వరుస సంఖ్య 409001 నుంచి 409044 వరకూ ఉన్న మొత్తం 29 ప్రభుత్వ చౌక ధరల దుకాణాలకు మొత్తం 17,458 స్మార్ట్ రేషన్ కార్డులు విడుదల అయ్యాయి. వీటిని ఆయా పంచాయతీల్లోని సచివాలయాలు, చౌకధరల దుకాణాల వారీగా మండల రెవెన్యూ శాఖ





ఆధ్వర్యంలో స్థానిక వీఆర్ఓల ప్రత్యక్ష పర్యవేక్షణలో చౌకధరల దుకాణాల్లో అందుబాటులో ఉంచి పంపిణీ చేయిస్తున్నారు. శంఖవరం సచివాలయం 1 పరిధిలోని 6 చౌకధరల దుకాణంలో కార్డులను సర్పంచ్ బందిలి గన్నియ్యమ్మ, పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల తెలుగుదేశం పార్టీ పూర్వ ప్రచార కార్యదర్శి పర్వత సురేష్, తాహసిల్దార్ అల్లాడి తాతారావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతంనీడి కుమార్, వీఆర్వోలు తిరుమలనీడి సీతారామ్, కె.వీరలక్ష్మి, చౌకధరల దుకాణం నిర్వాహకురాలు పులి సునీత, ఎన్డియే కూటమి శ్రేణులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

**ఉపముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు**

జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదినం వేడుకలను ఎన్.డి.ఏ. శ్రేణుల ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గం వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పవన్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొని కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి పవన్ కళ్యాణ్ పట్ల తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ కు పరోక్ష పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. బలహీన వర్గాలు, పేదలు, దివ్యాంగుల్లో కొందరికి జనసైనికులు ఏర్పాటు చేసిన బియ్యం బస్తాలను ఎన్.డి.ఏ. శ్రేణులతో కలసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

**సిఎం రిలీఫ్ ఫండ్ రూ. 15.09 కోట్ల పంపిణీ ...**

నియోజకవర్గంలోని వివిధ రకాల బాధితులకు రూ. 15.09 కోట్ల లబ్దిని పవన్ జన్మదిన వేడుకల సభా వేదికగా ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే పంపిణీ చేసారు. ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన 22 మంది వివిధ అనారోగ్య, ప్రమాద బాధితులకు తాత్కాలిక ఉపశమనం, వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 15,09, 552 మొత్తం సొమ్ములను ఆయా లబ్దిదారుల బ్యాంకు పొదుపు ఖాతాల్లో ప్రభుత్వం జమచేయగా ఆయా మంజూరు పత్రాలను లబ్దిదారులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి), ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల జనసేన పార్టీ ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు కరణం సుబ్రహ్మణ్యం, భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సింగిలిదేవి సత్తిరాజు, శంఖవరం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గాబు సుభాష్, ఎన్డీయే కూటమి శ్రేణులు, పెద్ద సంఖ్యలో జనసేన కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మండల టిడిపి అధ్యక్షులు జీను మణి బాబును ఘనంగా సత్కరించిన జగ్గంపేట మేదర సంఘం

**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన జీను మణి బాబును జగ్గంపేట మేదర సంఘం అధ్యక్షులు పిల్లి రమణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మా అభిమాన నాయకుడు జీనుమణి బాబును జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ మండల పార్టీ అధ్యక్షుడుగా నియమించిన శుభ సందర్భంగా ఆయనను మర్యాదపరంగా కలిసి సత్కరించామని మా సమస్యలు వారికి తెలియజేసామని రమణ అన్నారు. జీను మణిబాబు మాట్లాడుతూ మీ సమస్యలను ఎమ్మెల్యే నెహ్రూ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రొట్ట ఏసుబాబు, దొమ్మ దుర్గారావు, మొగ్గ ఆనంద్, దొమ్మ బద్రి, రొట్ట సత్తిబాబు, రొట్ట అప్పారావు తదితర మేదర సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్

**స్మార్ట్ గవర్నమెంట్ స్మార్ట్ ఆలోచన%ఔ%జగ్గంపేటశాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ**

**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా గండేపల్లి రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెడుతూ రేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా లబ్ధిదారులకు స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. మంగళవారం గండేపల్లి మండలం నాయకంపల్లి గ్రామం నందు నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఇది తమ కూటమి ప్రభుత్వానికి వచ్చిన స్మార్ట్ ఆలోచన అని, గతంలో మాదిరిగా పెద్ద పుస్తకాల వలే కాకుండా ఏటిఎం, ఆధార్ కార్డుల తరహాలో రాజముద్రతో పాటు లబ్ధిదారుడు చిత్రం ఉండే విధంగా స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతోందని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ స్మార్ట్ రైస్ కార్డులను రూపొందించడం జరుగుతుందని, సదరు కార్డుపై ముద్రించిన క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు, ఈకేవైసీ స్థితి, రేషన్ సరుకుల వివరాలు, కేటాయించిన పరిమాణం, రేషన్ పొందిన స్థితి, డిపో వివరాలు తెలుస్తాయన్నారు . అంతే కాకుండా రాష్ట్రంలో ఎక్కడి వారైనా ఎక్కడి నుంచ్కెనా రేషన్ తీసుకునే సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు . కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా త్వరలో అర్హులందరికీ కొత్త కార్డులు అందజేయడం జరుగుతుందని, గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవని, వైకాపా జారీ చేసిన రేషన్ కార్డుల్లో వారు ఫోటోలు ముద్రించుకున్నారని, నేడు కూటమి ప్రభుత్వం ప్రభుత్వ రాజముద్ర, లబ్ధిదారుల ఫోటోలను మాత్రమే ముద్రించిందన్నారు . ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, తోట రవి, కందుల చిట్టిబాబు, కుంచె రాజా, కంటిపూడి సత్యనారాయణ, పాలకుర్తి ఆదినారాయణ, గండేపల్లి ఎమ్మార్వో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



## జగ్గంపేటలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా

**జగ్గంపేట : విశ్వం వాయిస్ న్యూస్** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు జగ్గంపేటలో అంబరాన్నంటాయి. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ కూటమి భాగస్వామి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిబద్ధతతో కూడిన వ్యక్తి. ఆయన పుట్టినరోజు వేడుకలు కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరగడం ఆనందకరం. ఇది కూటమి ఐక్యతకు నిదర్శనం. రాష్ట్ర అభివృద్ధి కోసం పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారు. ఆయన చంద్రబాబు నాయుడికి తమ్ముడిలా ఉంటూ నిబద్ధతతో రాజకీయం చేస్తున్నారు. ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నాను అని తెలిపారు.ఈ వేడుకలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, అప్పలరాజు, బిజెపి నాయకుడు దాట్ల కృష్ణ వర్మ, జనసేన నాయకులు బుదిరెడ్డి శ్రీనివాస్, పాలిశెట్టి సతీష్, ఏఎంసి వైస్ చైర్మన్ ముదిరాజ్ శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ పాలిశెట్టి సతీష్, ఏఎంసి డైరెక్టర్ సింగులూరి రామ్, దీపు, కిర్లంపూడి మండల అధ్యక్షుడు ఉలిసి అయిరాజు, జగ్గంపేట మండల అధ్యక్షుడు మరిసే రామకృష్ణ, జగ్గంపేట మండల యూత్ అధ్యక్షుడు మొగులు గంగాధర్, జగ్గిమడుగు మండల ఐటీ కోఆర్డినేటర్ నరేష్, గండేపల్లి మండలం బిసి సెల్ అధ్యక్షుడు వీరబాబు, రామ్ రెడ్డి, జగ్గంపేట మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు గెద్ద బాబురావు, మండపాక శ్రీరామ్, పాలిక కృష్ణ, పల్లిబోయిన మణికంఠతో పాటు కోటమి నాయకులు, జనసేన కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## డి జే సౌండ్ కు అనుమతి లేదు

## జగ్గంపేట ఎస్సై రఘునాధరావు



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** జగ్గంపేట మండలంలో నిర్వహించే వినాయక చవితి నిమజ్జన వేడుకలలో ప్రజలు, కమిటీ సభ్యులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నడుచుకోవాలని జగ్గంపేట ఎస్సై టీ రఘునాధరావు అన్నారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట పరిసర ప్రాంతాలలో గణపతి నవరాత్రి మహోత్సవాలకు, నిమజ్జన సమయంలో డీజే లకు అనుమతి లేదన్నారు.ఈ కార్యక్రమాలను రాత్రి 10 గంటల లోపు ముగించాలన్నారు. ముఖ్యంగా ట్రాంజెండర్ తో డ్యాన్సులు వేయించడం,మందు గుడి సామాగ్రి కాల్చడం,మద్యం సేవించి నిమజ్జనంలో పాల్గొనడం వంటివి చేయరాదన్నారు.పోలీస్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రఘునాధరావు హెచ్చరించారు.



## సంపత్ వినాయక 5వ వార్షికోత్సవం చవితి మహోత్సవాలు ఘనంగా

- 3వేల భక్తులకు అన్నసమర్పణ





**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** స్థానిక కోటగుమ్మం సెంటర్ వద్ద ప్రముఖ వ్యాపారవేత్త భవానీశంకర్ ఆధ్వర్యంలో అడపా రాజు సహకారంతో గత ఐదు సంవత్సరాలుగా సంపత్ వినాయక మహోత్సవంలో భాగంగా మంగళవారం భారీ అన్న సమారాధన మూడువేల మంది భక్తులు ఈ అన్న సమారాధనలో అన్న సమర్పణ అందుకున్నారు. అడపా రాజు మాట్లాడుతూ ఈ సంపత్ వినాయక మహోత్సవాలు ఐదు సంవత్సరాలుగా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నాము. మార్కెట్లో ప్రతి వ్యాపారి వినాయకుడిని దర్శించుకుంటూ ఉంటారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో సురేష్, రత్నం,ప్రకాష్ రావు,వాసు తదితరులు పాల్గొన్నారు.

## నన్నయలో ఎం.ఏ పొలిటికల్ సైన్స్ గ్రూపును యధావిధిగాకొనసాగించాలి

**రౌండ్ టేబుల్ సమావేశం లో ప్రజాసంఘాలు తీర్మానం**



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం రాజమండ్రిలో ని మెయిన్ క్యాంపస్ నందు ఎం.ఏ పొలిటికల్ సైన్స్ గ్రూపు యధావిధిగా కొనసాగించాలని కోరుతూ విద్యార్థి యువజన దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నాడు రాజమండ్రిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్. రాజా అధ్యక్షత జరిగింది. పి.డి ఎస్.యూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిరణ్ కుమార్,ఏ.ఐ.ఎస్.ఎఫ్ కోనసీమ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్,ఏ.ఐ.ఎస్.ఎఫ్ నాయకులు తాడేపల్లి విజయ్ కుమార్, కె.వి.పి. ఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, దళిత సంఘం నాయకులు కోరుకొండ చిరంజీవి, ఎస్సీ,ఎస్టీ సంఘాల నాయకులు పి. వేణుగోపాల్, జే. సుబ్బారావు, ఎస్. విజయ్ కుమార్, ఎన్. ఎస్ యు ఐ నాయకులు తారకేష్, రెల్లి సంఘం నాయకులు నీలం. వెంకటేశ్వరరావు దళిత ప్రజా సంఘం నాయకులు నక్క వెంకటరత్నం,మాజీ ఎస్.ఎఫ్.ఐ నాయకులు టి. అరుణ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పూర్ణిమ రాజు తదితర నాయ కులు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో రాజమండ్రి క్యాంపస్లో పొలిటికల్ సైన్స్ విభాగంలో ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలు నిలిపివేస్తూ యూనివర్సిటీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని ఖండించారు. విశ్వవిద్యాలయం యాజమాన్యం యధావిధి గా ఆ గ్రూపును కొనసాగించాలని డిమాండ్ చేశారు.విశ్వవిద్యాలయ అభివృద్ధికి కొత్త గ్రూపులను ఏర్పాటు చేయాల్సిన యాజమాన్యం ఇటువంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడాన్ని పూర్తిగా రౌండ్ టేబుల్ లో పాల్గొన్న నాయకులు తప్పు పట్టారు. తూర్పుగోదావరి జిల్లాకే కాకుండా మొత్తం గోదావరి జిల్లాలకే తలమానికమైన విశ్వవిద్యాలయం నన్నయ యూనివర్సిటీ అని అటువంటి యూనివర్సిటీ లో పొలిటికల్ సైన్స్ గ్రూపును నిర్వీర్యం చేసే ప్రయత్నం ఉద్దేశ పూర్వకంగా గానే యూనివర్సిటీ యాజమాన్యం చేస్తుందని విమర్శించారు. యూనివర్సిటీ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రభుత్వం స్పందించాలని కోరారు. లేనిపక్షంలో దశలవారి ఉద్యమాన్ని నిర్వహిస్తామని విశ్వవిద్యాలయ యాజమాన్యాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డి.వై.ఎఫ్.ఐ జిల్లా కో-కన్వీనర్ డి. అశోక్ కుమార్ మాట్లాడి ముగించారు.వివిధ సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశంలో నన్నయ యూనివర్సిటీ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసి యాజమాన్యాన్ని హెచ్చరించారు.ఈ సమావేశంలో పి.డి.ఎస్. యు నాయకులు కె.భాను ప్రసాద్, దినేష్ బాబు డి.వై.ఎఫ్.ఐ జిల్లా కన్వీనర్ వి. రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై. భాస్కర్ ఎస్.ఎఫ్.ఐ నాయకులు కే. లహరి, కే. జ్యోతి, టి.సౌమ్య, కార్తీక్, హేమంత్,జోసఫ్ జనవిజ్ఞాన వేదిక నాయకులు సి.హెచ్ నిశ్చల్ తదితరులు పాల్గొన్నారు.

# డా.వైఎస్ ప్రజల గుండెల్లో పదిలం

**ఆరోగ్యశ్రీ, ఫీజు రీ ఇంబర్స్ మెంట్ లాంటి పథకాలు డా వైఎస్ సృష్టి**
**వర్ధంతి కార్యక్రమంలో మాజీ ఎంపీ భరత్ నివాళి.. పలుచోట్ల డా వైఎస్ విగ్రహాలకు నివాళి**
**క్వారీ సెంటర్లో దుప్పట్లు, పండ్లు పంపిణీ.. తండ్రికి తగ్గ తనయుడు జగన్ అని ప్రశంస**
**పేద ప్రజల ఆశలు నెరవేర్చడానికి జగన్ మళ్ళీ అధికారంలోకి వస్తారు**









**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** దివంగత మహానేత మాజీ ముఖ్యమంత్రి డా వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించి నప్పటికీ ప్రజల గుండెల్లో పదిలంగా ఉంటారని మాజీ ఎంపీ,వైయస్సార్ సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ అన్నారు.డా వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా స్థానిక కోటగుమ్మం సెంటర్ , లాలాచెరువు సెంటర్, క్వారీ సెంటర్ తదితర చోట్ల వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.క్వారీ సెంటర్ లో అజ్జరపు వాసు ఆధ్వర్యంలో సుమారు మూడు వందల మందికి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.ఈసందర్భంగా భరత్ మాట్లాడుతూ హెలికాప్టర్ కూలినపుడు ప్రతి ఒక్కరూ టీవీలకు అతుక్కుపోయి డాక్టర్ వైఎస్ బతికి రావాలని కోరుకున్నారని, విపక్షాలు, శత్రువులు సైతం ఇదేవిధంగా భావించారని అందుకే ఆయన మరణించినా జీవించే ఉన్నట్టు లెక్క అన్నారు. ఇప్పటికీ కూడా పేద ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకుంటున్నారంటే అందుకు డాక్టర్ వైఎస్సార్ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకం కారణమని భరత్ గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ అనే అద్భుత పథకం యావత్ భారతదేశానికే దిక్సూచి అని చూపించారని, అప్పటివరకు దేశంలో ఈ పథకం లేదని ఆయన అన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆయుష్మాన్ భారత్ అనే పథకాన్ని కేంద్రం ఆతర్వాత తీసుకొచ్చింద న్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఈ పథకం కొనసాగుతూనే ఉందన్నారు. అలాగే రోడ్డుపై యాక్సిడెంట్లు జరిగితే కుయ్ కుయ్ అంటూ అంబులెన్స్ లు వచ్చేవని అన్నారు. పేద పిల్లలు అందరూ పెద్ద పెద్ద చదువులు చదువుకోడానికి వీలుగా ఫీజు రీ ఇంబర్స్ మెంట్ పథకం డాక్టర్ వైఎస్ ప్రవేశపెట్టారని భరత్ ప్రస్తావించారు. ఈపథకం వలన ఎంతోమంది ఉన్నత స్థితికి వచ్చారని, అందుకే డా వైఎస్ ని తలచుకోని తెలుగువాడు అంటూ ఉండరని ఆయన అన్నారు. డా వైఎస్ ఏ ఆలోచనతో పేదప్రజలకోసం పథకాలు తెచ్చారో అలాగే తండ్రికి తగ్గ తనయుడిగా జగన్మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు తెచ్చారని భరత్ అన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం వచ్చేవిధంగా జగన్ కృషి చేసారని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఒక్కటంటే ఒక్క పథకం చెప్పుకోడానికి లేదని భరత్ అన్నారు. ఎందుకు ఓట్లు వేశామా అని అందరూ అనుకుంటున్నారన్నారు. డా వైఎస్ ఆశయాలు, పేదప్రజల ఆశలు నెరవేర్చడానికి జగన్ మళ్ళీ మీ అందరి ఆశీస్సులతో అధికారంలోకి వస్తారని భరత్ ధీమా వ్యక్తం చేశారు.

## రాజకీయ కక్షతోనే పెద్దిరెడ్డికి వేధింపులు


- కూటమి ప్రభుత్వాన్ని ప్రజలే గద్దె దించుతారు
- మిధున్ రెడ్డి బయటకు వచ్చాక చంద్రబాబుకు చుక్కలు చూపిస్తారు.
- మాజీ మంత్రి పేర్నినాని



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయ కక్షతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానసికంగా వేధిస్తున్నారని,మిధున్ రెడ్డి బయటకు వచ్చాక తండ్రీ కొడుకులు చంద్రబాబుకు , కూటమి ప్రభుత్వానికి చుక్కలు చూపిస్తారని, వైసీపీ నాయకుడు,మాజీ మంత్రి పేర్నినాని వ్యాఖ్యానించారు. మంగళవారం రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డితో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమరెడ్డితో కలిసి రాజమండ్రి సెంట్రల్ జైలులో ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు బయట విలేకరులతో పేర్ని నాని మాట్లాడుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఏమీ చేయలేని చంద్రబాబు ప్రభుత్వం ఆయనను మానసికంగా కృంగదీసేందుకు అక్రమ కేసుల్లో ఎంపీ మిథున్ రెడ్డిని అరెస్టు చేసి 45 రోజులుగా జైలులో పెట్టిందని ఆరోపించారు.ఈ కేసులో ఇప్పటి వరకు చంద్రబాబు ప్రభుత్వం ఎటువంటి ఆధారాలు సేకరించలేక పోయిందన్నారు.మిధున్ రెడ్డి ఏ నేరం చేయలేదు కాబట్టే పోలీసులు కస్టడీకి కోరడం లేదని అన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే పెద్దిరెడ్డి కుటుంబాన్ని చంద్రబాబు ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తుందన్నారు. తమకు న్యాయస్థానాలు మీద నమ్మకం ఉందని, త్వరలో మిథున్ రెడ్డి తప్పుడు కేసులో అరెస్టు అయినట్లు రుజువు అవుతుందన్నారు. బయటకు వచ్చాక మిథున్ రెడ్డి రెట్టింపు ఉత్సాహంతో పార్టీ కోసం పనిచేస్తారని తెలిపారు. ఈ అసమర్థ ప్రభుత్వ పనితీరుని ప్రజల్లోకి తీసుకువెళ్లి రాబోయే మూడున్నర సంవత్సరాల్లో చంద్రబాబు ప్రభుత్వాన్ని గద్దె దించుతామన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ జైలులో మిథున్రెడ్డిని ఎవ్వరినీ కలవనీయడం లేదన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు చుక్కలు చూపిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, రాజానగరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా,రాజమండ్రి నగర పార్టీ అధ్యక్షుడు మార్గాని భరత్,రుడా మాజీ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, యువ నాయకుడు జక్కంపూడి గణేష్,నగర వైసీపీ ఉపాధ్యక్షుడు గుత్తుల మురళీధర్, జిల్లా వైసీపీ మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, మాజీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ హాసినా బేగం,పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమానికి పర్యాయపదం వైఎస్ రాజశేఖర్ రెడ్డి

## - కోటగుమ్మం వద్ద కాంగ్రెస్ పార్టీ ఘన నివాళులు




**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** రాష్ట్రంలో సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించి రెండు సార్లు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. వైఎస్ఆర్ 16వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక కోటగుమ్మం వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనం గా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బాలేపల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకుని రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పనులతో పాటు పలు ప్రాజెక్టులను వైఎస్ఆర్ నిర్మాణం చేసారన్నారు. అటువంటి మహానాయకుడు లేకపోవడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన అమలు చేసిన ఫీజు రీఎంబర్స్మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, వసతి దీవెన వంటి పథకాలనే నేటికి కూడా ఈనాటి ముఖ్యమంత్రులు అమలు చేస్తున్నారంటే ఆయన ఘనతను అందరూ గ్రహించాలన్నారు. ఆయన ఆశయ సాధనకు నిరంతరం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తూనే ఉంటుందన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ లోక్సభలో కాంగ్రెస్ పక్షనేత రాహుల్ గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బతికించాలని రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని, ఆయనపై ఎదురు దాడి చేయడం బీజేపీకి తగదన్నారు. ఇదే విధంగా వ్యవహరిస్తే మాత్రం కాంగ్రెస్ తరపున తగిన విధంగా బుద్ధిచెబుతామని హెచ్చరించారు. సీనియర్ నాయకుడు కొవ్వూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని విజయవంతంగా ముందుకు నడిపించి రెండు సార్లు వైఎస్ఆర్ ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ఆయన తనయుడు వైఎస్ఆర్ ఆశయ సాధనకు తూట్లు పొడుస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసారని విమర్శించారు.కార్యక్రమం లో ఎంఎస్ యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గట్టి నవతారకేష్, కాంగ్రెస్ నాయకులు చామర్తి లీలావతి,బండారు వెంకన్న,యిజ్జరౌతు సత్యనారాయణ,కంచర్ల రాజాపండు,కామవరపు వీర్రాజు,రాజు తదితరులు పాల్గొన్నారు.

## బత్తుల ఆధ్వర్యంలో ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు.




**కోరుకొండ విశ్వం వాయస్ న్యూస్:** జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులు జన సైనికులు వీర మహిళల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయం వద్ద పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని బత్తుల వెంకటలక్ష్మి కేక్ కట్ చేసి, జన సైనికులు, వీర మహిళలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ కష్టపడి సంపాదించిన ధనాన్ని రైతులకు, ఆపదలో ఉన్న వారికి విరివిగా ఆర్థిక సహాయం చేసే మహోన్నత వ్యక్తి, రాజకీయాలలో అధికారం కాకుండా నీతి, నిబద్ధతతో పార్టీని ముందుకు నడిపిస్తున్న వ్యక్తిగా కొనియాడారు. రాష్ట్ర ప్రయోజనార్థం తనకు తాను తగ్గించుకొని, ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు అడ్డాల శ్రీను, మండల గౌరవ అధ్యక్షులు బదిరెడ్డి దొర రామతులసి, సొసైటీ అధ్యక్షులు బత్తుల గోపాలకృష్ణ, ముక్క రాంబాబు, తన్నీరు తాతాజీ, జాజుల గణేష్,జన సైనికులు, వీర మహిళలు, పవన్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర కారాగారాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్.శ్రీ లక్ష్మి



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** మంగళవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్.శ్రీ లక్ష్మి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు అందిస్తున్న ఆహార ప్రమాణాలు, సదుపాయాలను సమీక్షించారు.ఖైదీలతో పాటు వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నా రు. ఖైదీల తరపున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, బెయిల్ పిటీషన్లు వేయాలన్నా, పైకోర్టుల్లో అప్పీలు చేయాలన్నా లేదా మరే ఇతర న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పూర్తి స్థాయిలో సహకరిస్తుందని ఆమె హామీ ఇచ్చారు. ఇందుకోసం పారా లీగల్ వాలంటీర్ల ద్వారా అర్జీలు సమర్పించాలని సూచించారు. అదేవిధంగా, ముద్దాయిలు మరియు ఖైదీలకు అందుబాటులో ఉన్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు.

## రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ భవన్ పై అంతస్తు నిర్మాణానికి సహకరించండి..

- పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరికి పెన్షనర్ల వినతి..




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరి ధవళేశ్వరం విచ్చేసిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏ పి ఎస్ జి ఆర్ ఈ ఎ) ధవళేశ్వరం యూనిట్ అద్యక్షులు యర్రమోతు ధర్మరాజు ఆద్వర్యంలో పురందేశ్వరి కి దుశ్శాలువా తో సత్కరించి వినతిపత్రం అందించారు,ధవళేశ్వరం యూనిట్ రాష్ట్ర అనుబంధ సంస్థ,వైద్యశిభిరాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నాము,ఉడతా సూర్యప్రకాష్ గ్రందాలయం పదిహేనేళ్ళ క్రితం మాకు అందజేశారు, ప్రముఖ గుత్తేదారు మాధవవర్మ ప్రహారీ,గాలి సుబ్బరాజు మలమూత్ర శాలలు ఉదారంగా నిర్మించగా సభ్యులందరం సుమారు ఐదు లక్షల రూపాయలతో అదనపు నిర్మాణం చేసినట్లు ధర్మరాజు వివరించారు, ప్రస్తుతం సభ్యులు మూడు వందల మంది ఉన్నారు, వారంతా ఉన్న గదులు సరిపోక ఆరుబయట కాలక్షేపం చేయు చున్నామని ప్రధాన కార్యదర్శి దువ్వూరి కామేశ్వర శర్మ తెలిపారు, సభ్యుల సౌలభ్యం కొరకు భవనం పైన అంతస్తు నిర్మాణానికి సహకరించ వలసిందిగా అసోసియేట్ అద్యక్షులు తోరం కేశవరావు,దాసరి సాయిబాబా చెప్పారు.ఈ గ్రామంలో ఎన్ని పెన్షనర్ల సంఘాలున్నాయని పురందేశ్వరి ప్రశ్నించగా ఒకే సంఘం ఉందని ధర్మరాజు చెప్పగా వీలు చూసుకుని మీ సమస్య పరిష్కారానికి నావంతు సహకార మందిస్తానని పురందేశ్వరి సానుకూలంగా స్పందించారని ధర్మరాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో కోశాదికారి ఉర్రింకల సత్యనారాయణ, ఆలిండియా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఉపాద్యక్షులు వి. వెంకటేశ్వరరావు,అంజూరి సూర్యారావు, శ్రీరంగం వెంకటేశ్వరరావు, అశోక్ బాబు,తదితరులు పాల్గొన్నారు.

## చెల్లుబోయిన మూర్తి సహకారంతో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

- శారదానగర్ గణేష్ ఉత్సవాలో దీపోత్సవం



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక తాడితోట శారదానగర్లో శ్రీలంభోదర యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ అర్బన్ ప్రాథమిక హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చెల్లుబోయిన సూర్య నారాయణ మూర్తి సహకారంతో గణేష్ ఉత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, పిల్లలు పాల్గొని దీపాలను వెలిగించారు. ముందుగా పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి చెల్లుబోయిన మూర్తి సౌజన్యంతో వారికి పుస్తకాలు పంపిణీ చేశారు. దీపోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా చెల్లుబోయిన మూర్తి మాట్లాడుతూ ప్రతి యేడాది ఇక్కడ గణేష్ ఉత్సవాలను స్థానికులు అంతా కలిసి నిర్వహించు కోవడం జరుగుతుందన్నా రు. పిల్లలు బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో వారికి వివిధ పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించడం జరిగిందన్నా రు.దీపోత్సవంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని దీపాలు వెలిగించడం జరిగిందన్నారు.ప్రత్యుష, జాన్సీరాణి, లంభోదర యూత్ సభ్యులు ఎన్ హేమంత్, ఉదయ్కిరణ్, భాను,మిల్టన్ శేఖర్ తదితరులు మాట్లాడుతూ చెల్లుబోయిన మూర్తి సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించు కుంటున్నామని అన్నారు. దీపోత్సవం చాలా ఆనందంగా జరుపుకోవడం జరిగిందన్నారు.అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

# ఎందరికో ఎమ్మెల్యే టికెట్లు ఇప్పించిన “పులస” చేప

- స్వతంత్రం వచ్చినప్పటి నుంచి లాబీయింగ్
- ఈ చేపకు దాసోహమైన అగ్రనేతలు
- గోదావరి,గౌతమి,సర్కార్ రైళ్ల బోగీలలో పులస వాసనలు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** ప్రధాన పార్టీల ఎమ్మెల్యే టికెట్లను కోట్లాది రూపాయలు హెచ్చించి తెచ్చుకుంటున్న ప్రస్తుత నేతలను మనం చూస్తూనే ఉన్నాం. కాని గోదావరి జిల్లాలలో అరుదుగా దొరికే పులస చేప ఈ ఎమ్మెల్యే టికెట్లు ఇప్పించిందంటే నమ్మడం ఈ తరం వారికి కష్టంగానే ఉంటుంది. కాని గతంలో జరిగింది ఇదే. గోదావరి నదిలో మాత్రమే అదీ వరదల సీజన్లోనే దొరికే పులుస అంటే ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. అందుకునే రాజకీయ లాబీయింగ్ కు ఈ పులసను వాడుకునేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదు, దేశ రాజధాని ఢిల్లీలో ఈ పులస లాబింగ్ ఓ లెవెల్లో ఉండేది ఒకప్పుడు. స్వతంత్రం వచ్చినప్పుడు నుంచి ఈ పులస బంధం కొనసాగుతూ వచ్చింది. ఎందరికో రాజకీయ భవిష్యత్తును ఇచ్చింది. గోదావరి పులస తిన్న విశ్వాసంతో ఎన్నికల సమయంలో బీ.ఫారాలపై సంతకాలు పెట్టేవారనే వాదన ఎప్పటినుంచో ఉంది.

### స్వతంత్రం వచ్చినప్పటి నుంచి...

మనకు స్వతంత్రం వచ్చినప్పటి నుంచి పులస లాబింగ్ జరుగుతూ వస్తుంది. ఇది నేటి తరం వారికి ఆశ్చర్యం కలిగించే విషయమైనప్పటికీ అప్పట్లో అదే జరిగేది. ఎందరికో ఈ పులస రాజకీయ భవిష్యత్తును ఇచ్చిందని ఆనాటి రాజకీయ నాయకులు నేటికీ చెబుతూ ఉంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఎన్నికల వ్యవస్థ ఏర్పడిన తొలినాలల్లో కపిలేశ్వరపురం జమీందారులైన ఎస్పీబీకె పట్టాభి రామారావు,సత్యనారాయణ రావు (చంటిదొర)సోదరులు ఒక వర్గంగా ఉండేవారు. మరో వర్గంలో రాయవరం మనసుబుగా ప్రసిద్ధి చెందిన ఉండవల్లి సత్యనారాయణ మూర్తి ఉండేవారు. వీరిలో జమీందారు సోదరులు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటూ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపు ఓటమలు చెందే వారు. కాని రాయవరం మునిసబు ఎన్నికలలో పోటీ చేసే వారు కాదు.కింగ్ మేకర్ గా ఉంటూ ఎంతోమందికి టిక్కెట్లు ఇప్పించి రాజకీయ భవిష్యత్తు ఇచ్చేవారు. కాకపోతే ఈ రెండు వర్గాలు రాష్ట్ర, దేశ రాజకీయాల్లో చక్రం తిప్పేవాళ్ళు. ఆర్థికంగా స్థితి మంతులైన వీరు ఈ పులస సీజన్లో హైదరాబాద్, ఢిల్లీలో ఉండే రాజకీయ ప్రముఖులకు, ఉన్నత అధికారులకు ఈ పులస రుచి చూపించేవారు. వీరిలో ముఖ్యంగా కపిలేశ్వరపురం జమిందారులను పేర్కొవచ్చు. వీరి కనుసైగల్లోనే మత్స్యకారులు ఉండేవారు. కపిలేశ్వరపురం కేంద్రంగా ఎంతోమంది చేపల వేట చేస్తూ జీవనోపాధి పొందేవారు. ఇప్పటికీ పొందుతున్నారు కూడా. దీంతో పులస సీజన్ వచ్చిందంటే రుచికరమైన చేపలను ఈ జమీందారుల బంగ్లాకు తీసుకొచ్చేవారు. వాటిని అద్భుతంగా వండించి హైదరాబాదు, ఢిల్లీకి పంపించేవారు. ఇదంతా వారి సంస్థలైన చెల్లూరు సుగర్ ఫ్యాక్టరీ,వేమగిరి సర్వారాయ బాటిలింగ్ యూనిట్ (గోల్డ్ స్పాట్ కంపెనీ) ప్రతినిధులు ద్వారా రాష్ట్ర, కేంద్ర మంత్రులకు చేరవేసేవారు. రాయవరం మునసబు కూడా జమీందారులకు ఏమాత్రం తీసిపోకుండా పులసలను వండించి క్యారేజీల ద్వారా పంపించేవారు. కేవలం పులస తిన్న విశ్వాసంతోనే ఎన్నికల సమయంలో జిల్లాలో వీరికి అనుకూలమైన అభ్యర్థులకు టిక్కెట్లు కేటాయించడంలో ప్రాధాన్యత ఇచ్చేవారు. ఇదంతా అప్పట్లో పెద్ద చర్చనీయాంశంగా మారేది.

### ఆ తర్వాత రోజుల్లోనూ పులస లాబింగ్ కొనసాగింది...

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత కూడా గోదావరి జిల్లాలో రాజకీయంగా ఈ పులస లాబింగ్ కొనసాగిందనే చెప్పవచ్చు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఉండే రాజకీయ రాజకీయ నాయకులు తమ గాడ్ ఫాదర్ లకు ఈ పులసలను వండించి పంపించడం ద్వారా బలమైన ఆశీస్సులు అందుకునేవారు. వీరిలో రాజమండ్రి, కడియం, ఆలమూరు, కొత్తపేట రామచంద్రపురం, అమలాపురం, తాళ్ళరేవు వంటి నియోజకవర్గ నాయకులు పై ఈ పులస ప్రభావం స్పష్టంగా కనిపించేది. తెలుగుదేశం పార్టీ నాయకుల విషయానివస్తే... ధవలేశ్వరం కేంద్రంగా పులస పేరొందింది. ఆ ధవళేశ్వరం కడియం నియోజవర్గ పరిధిలో ఉండేది. అప్పటి ఎమ్మెల్యేగా ఉండే వడ్డీ వీరభద్రరావు ఈ పులస వండించి పంపించడంలో తెలుగు రాష్ట్రాల్లో పేరు పొందారు. అప్పట్లో పులస సీజన్ వచ్చిందంటే ప్రతిరోజు ఆ చేపల కూరను వడ్డి వీరభద్రరావు వండిస్తూ ఉండేవారట.అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కు ఆయనే తీసుకెళ్లి దగ్గరుండి వడ్డించేవారని నేటికీ సీనియర్ టిడిపి నాయకులు చెబుతూ ఉంటారు. అలాగే గౌతమి, గోదావరి ఎక్స్ ప్రెస్ ల ద్వారా హైదరాబాదుకు పులస కూరలను వండించి తరలించేవారు. అలాగే రాజమండ్రి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆలమూరు ఎమ్మెల్యేలుగా పనిచేసిన వల్లూరి నారాయణమూర్తి, వివిఎస్ఎస్ చౌదరి, రామచంద్రపురం ఎమ్మెల్యేగా పనిచేసిన తోట త్రిమూర్తులు, అమలాపురం ఎమ్మెల్యేగా ఉండే మెట్ల సత్యనారాయణ రావు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యనందరావు తదితర నేతలు ఈ పులస ఆతిథ్యం ఇవ్వడంలో ముందుండేవారిని చెప్పు వచ్చు.అలాగే కాంగ్రెస్ పార్టీలో కడియం ఎమ్మెల్యేగా ఉండే జక్కంపూడి రామ్మోహనరావు, కొత్తపేట ఎమ్మెల్యేలు గా ఉండే ఎమ్.వి.ఎస్ రాజు, చిర్ల సోమసుందరరెడ్డి,రామచంద్రాపురం ఎమ్మెల్యే గా ఉండే పిల్లి సుబోష్ చంద్ర బోస్,నాటి అమలాపురం ఎమ్మెల్యేలు కుడిపూడి ప్రభాకరరావు,కుడిపూడి చిట్టబ్బాయి వంటి పేర్లు ప్రముఖంగా వినిపించేవి.అన్నిటికంటే ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే ఆత్రేయపురం పూతరేకు హైదరాబాదులో కంటే ఆత్రేయపురంలో తింటానే ఆ అనుభూతి అద్భుతంగా ఉంటుందంటారు. అలాగే తెలంగాణకు చెందిన చాలా మంది రాజకీయ నాయకులు గోదావరి జిల్లాలకు వచ్చి ఈ పులస రుచి చూసేవారని అందుకనే అప్పట్లో జూలై,ఆగస్టు,సెప్టెంబర్ నెలలలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఎక్కువగా ఉండేవని ఓ రాజకీయ ప్రముఖులు తెలిపారు. ఎందుకంటే ఊరికినే భోజనం కోసం వస్తే బాగోదని ప్రారంభోత్సవాల పేరుతో ఈ గోదావరి జిల్లాలకు వచ్చి మంత్రులు ఇతర ప్రముఖులు ఈ పులస ఆతిథ్యాన్ని పొంది చక్కటి అనుభూతిని ఆస్వాదించే వారు.

### గౌతమి,గోదావరి,సర్కార్ ఎక్స్‌ప్రెస్ లలో పులస వాసనలు

పులసల సీజన్ వచ్చిందంటే చాలు గౌతమి, గోదావరి, సర్కార్ ఎక్స్‌ప్రెస్ ల బోగీలు పులస వాసనలతో గుబాయించేవి. ప్రతిరోజు వీటిని హైదరాబాదులో అయిన వాళ్ళకి పంపించడం రివాజుగా ఉండేది. కేవలం మంత్రులు, రాజకీయ నాయకులు,రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులకే గాక బంధు మిత్రులకు ఈ పులస కూర పంపించేవారు.సచివాలయంలో మంత్రి చెప్పినా కదలని ఫైల్ ను ఈ పులస చేప సంతకం పెట్టించేదంటే దాని ప్రత్యేకత ఎలాంటిదో చెప్పవచ్చు. అందుకనే అప్పుడు హైదరాబాద్ వెళ్ళడానికి ప్రధానంగా ఉండే ఆ రెండు రైళ్ల భోగిలలో పులసలను వండించి క్యారేజీలలో పంపించేవారు. ఇప్పట్లా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు ఉండేవి కాదు. హైదరాబాద్ అంటే గౌతమి,గోదావరి ఎక్స్‌ప్రెస్ లే ఫేమస్. ఎంత పంపిస్తే మాత్రం రైలు బోగీలలో వాసనలు రావడం ఏంటి అనుకుంటున్నారు కదూ.. అప్పుడు ఆ కూరకుండే రుచి అలాంటిది మరి. అదీకాక ఇప్పట్లా అధునాతన ప్యాకింగ్ సౌకర్యం అప్పట్లో ఉండేది కాదు. క్యారేజీలలోనే వండించి పంపించడం వల్ల ఆ వాసనలు బయటకు వచ్చేవి. చేపల కూర వేడివేడిగా తింటే బాగుంటుంది కదా మరి అంత దూరం పంపిస్తే పాడైపోదా అనుకోవచ్చు. అంటే మిగిలిన చేపల కూరల మాదిరిగా వేడివేడిగా తింటే పులస బాగోదు.వండిన తర్వాత రోజు నుంచే తినాలి. రెండు మూడు రోజులు వరకు ఈ కూర ఏ మాత్రం పాడవకుండా ఉండడం దీని స్పెషాలిటీ. ఇన్ని బాధలెందుకు అసలు ఆ చేపనే పంపించేస్తే వాళ్లు వండుకు తింటారు కదా అనే కామెంట్ చేయాలను కుంటున్నారు కదాండి.అది కుదరదండి.ఈ పులస చేపను ఎవరుబడితే వాళ్లు వండేస్తే ఆ రుచి రాదండి. గోదావరి జిల్లాలలోనే నిపుణులైన మహిళలు కట్టెల పొయ్యిలపై వీటిని అద్భుతంగా వండగలుగుతారు. ఇది అందరికీ సాధ్యం కాదు. వండటాన్ని బట్టి దీని రుచి ఉంటుంది.అమ్మో... ఇన్ని ప్రత్యేకతలు ఉన్నాయా అనిపిస్తుంది కదాండి. పులుసు అంటేనే ప్రత్యేకతల కలబోత. అన్నట్లు ఆ మూడో రైలు గురించి చెప్పలేదేంటి అను కుంటున్నారా.. ఆ సర్కార్ ఎక్స్‌ప్రెస్ మద్రాస్ వెళ్లేది. మరి రాజకీయ నాయకులు,ఉన్నతాధికారులు కోసం హైదరాబాదు వెళితే పులస ప్రియులైన ఎంతో మంది సినీ ప్రముఖుల కోసం ఈ సర్కార్ ఎక్స్‌ప్రెస్ ద్వారా నాటి మద్రాసు నేటి చెన్నై పంపించేవారు. అప్పటికి సినిమా రంగం హైదరాబాద్ కు రాలేదు. గోదావరి జిల్లాలకు సినిమా రంగానికి ఉన్న అనుబంధం ఎలాంటిదో మీకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అందుకనే కావలసిన వారికి ప్రత్యేకంగా పులసను వండించి ఈ సర్కార్ ఎక్స్‌ప్రెస్ లో పంపించేవారు.సినిమా వాళ్లు కూడా అప్పట్లో పులస ను వెండి తెరపైకి అనేక సందర్భాలలో తీసుకిచ్చేవారు. పులస గురించి తెలుయని కొంతమంది ఇప్పుడు తక్కువ చేసి మాట్లాడుతున్నారు గాని దాని చరిత్ర ఏ స్థాయిలో ఉందో చూసారు కదా అదేనండి చదివారు కదా.ఈ పులసకు సంబంధించి మీకు తెలిసిన విషయాలు ఏమైనా ఉంటే కామెంట్ చెయ్యండి.

## పాటకు ప్రాణం పోసిన ఎస్పీ బాలు

- గాన గంధర్వుడు విగ్రహానికి ఎంపీ పురందేశ్వరి నివాళి..



**ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్:** సాంప్రదాయ సంగీతంలో ప్రవేశం లేకపోయినా అత్యంత ప్రతిభతో పాటకు ప్రాణం పోసిన గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అని రాజమండ్రి ఎం.పీ దగ్గుబాటి పురందేశ్వరి కీర్తించారు.రాకా సాంస్కృతిక సంస్థ రాజమహేంద్రవరం మరియు గోదావరి కల్చరల్ అసోసియేషన్ ధవళేశ్వరం సంయుక్తం ఆధ్వర్యంలో ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయ ఎదురుగా ఉన్న పార్కులో పద్మశ్రీ ఘంటసాల విగ్రహం పక్కనే ఏర్పాటుచేసిన ఎస్పీ బాలు నిలువెత్తు విగ్రహానికి మంగళవారం ఉదయం ఆమె పుష్పాంజలి ఘటించారు.ఈసందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ కష్టతరమైన పాటలు కూడా ఎస్పీ బాలు అవలీలగా పాడారని ప్రస్తావించారు.ఆయనను ఎవరూ అనుకరించలేర న్నారు. అవార్డులు బాలుకి ఆభరణం కాదని, అవార్డులకే బాలు ఆభరణం లాంటి వారని ఆమె పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలకు పైగా అన్ని భాషల్లో శ్రోతలను అలరించిన కళామతల్లి ముద్దుబిడ్డ బాలు మనమధ్య లేకున్నా ఆయన పాడిన పాటలు ఆయన్ని సజీవంగానే ఉంచుతాయని ఆమె నివాళు లర్పించారు. బాలుకి భారతరత్న ఇచ్చేలా కృషిచేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేసారు.ఎంపీ పురందేశ్వరిని దుశ్శాలువా, మెమొంటో తో ప్రముఖ సినీ నటులు శుభలేఖ సుధాకర్ ,రాకా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కంటే వీరన్న చౌదరి, జివి రమణ, సత్కరించారు. ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్, వేగిశెట్టి కోదండరామయ్య, యర్రమోతు ధర్మరాజు, గాదిరాజు రామరాజు, రమేష్, ఎం ఏడుకొండలు, నాగభూషణం, శేషుకుమార్,సావడ శ్రీనివాసరెడ్డి,బొబ్బిలి శ్రీనివాసరావు,మోహన్ పబ్లికేషన్స్ అధినేత ఆకుల రామచంద్రరావు,బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్,అసెంబ్లీ కో కన్వీనర్, నాయి బ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్ యానపు ఏసు, బీజేపీ మండల అధ్యక్షులు షేక్ సాజిద్, సీనియర్ నాయకులు ఈఏస ఐ డైరెక్టర్ ఒంటెద్దు స్వామి, కుబేర్ రావ్,బివి రామారావు,డాక్టర్ కొండలరావు,గుర్రాల వెంకట్రావు పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారోత్సవం.

- వైశ్యులకు రాజకీయంగా గుర్తింపు ఇవ్వాలి.



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** జనసేన పార్టీ లో ఆర్యవైశ్యులకు మంచి గుర్తింపు ఇస్తామని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. మంగళవారం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కోరుకొండ మండల ఆర్యవైశ్య సంఘం నూతన ప్రమాణ స్వీకారోత్సవానికి శాసనసభ్యులు బత్తుల ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలను కొనసాగించడంతో పాటు దాతృత్వం చాటుకోవడంలోనూ ఆర్యవైశ్యులు ముందుంటారన్నారు. జనసేన పార్టీలో ఆర్యవైశ్యులకు గుర్తింపు ఇచ్చామని, వైశ్యులు తెదేపా, భాజపా నుండి పోటీ చేస్తే మద్దతు ఇస్తామన్నారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో బత్తులను ఘనంగా సత్కరించారు. నూతన కార్యవర్గ గౌరవ అధ్యక్షులుగా సత్యవరపు వెంకటేశ్వరరావు (కొండ), కటకం చలం, స్వామి శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా జల్దు సుబ్రహ్మణ్యం, అధ్యక్షులుగా ఓలేటి సూర్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులు సత్యవరపు సుధీర్, పద్మనాభుని సత్య వరప్రసాద్, బొండాడ మోహన్, సుతాపల్లి శ్యామలరావు, కోశాధికారిగా వాకచర్ల సాయి బంగారు గుప్త, ఉప కోసాధికారులుగా జల్దు వెంకటరమణమూర్తి, గ్రంధి కాశి,ఓలేటి రాధా కృష్ణాజి, సెక్రెటరీ కప్పల స్వామి, జాయింట్ సెక్రెటరీ కటకం స్వరూప్, బోనగిరి సతీష్ ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. ఈ సందర్భంగా పలువురు నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. నూతన కార్యవర్గం కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులకు, మండల ఆర్యవైశ్య సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఓలేటి మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరు సహాయ సహకారాలతో సంఘాన్ని బలోపేతం చేసి, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కలిసి తాగుదాం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జాంపేట ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్గా కే.శ్రీదేవి బాధ్యతలు స్వీకరణ

- శ్రీదేవిని అభినందించిన కుడుపూడి సత్తిబాబు
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కు శ్రీదేవి కృతజ్ఞతలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** సాంస్కృతిక రాజమహేంద్రవరంలో జాంపేటలో కొలువై ఉన్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన డైరెక్టర్గా కొండపల్లి శ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మంగళవారం జరిగిన ఈకార్యక్రమంలో ఏపీ శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పాల్గొని, శ్రీదేవికి శాలువా వేసి, శుభాభినందనలు తెలిపారు.శ్రీదేవి స్థానిక 3వ వార్డులో పార్టీ కార్యకర్తగా అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పదవి లభించిందని సత్తిబాబు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ తనకు దేవస్థానంలో డైరెక్టర్ గా అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి సరికొత్త నిర్వచనం వైయస్సార్

- డాక్టర్ టి.కే విశ్వేశ్వర్ రెడ్డి
- జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్వర్గీయ డా.వై.యస్.ఆర్ వర్ధంతి నివాళి




**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** మంగళవారం ఉదయం స్థానిక పేపర్ మిల్ మెయిన్ గేట్ ఎదురుగా ఉన్న డాక్టర్ రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టి.కే.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పి.సి.సి రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద,ఐఎన్టియుసి జిల్లా ప్రెసిడెంట్ జేటి రామారావు,జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ శాఖా పుల్లారావు, జిల్లా డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజశేఖర్,సిటీ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ పట్నాల శ్రీనివాస్,జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బిల్డర్ బాబి,క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు జాలనటరాజ్, కడియం మండలం కేవీఎస్ఎన్ రాజు,యు సత్తిబాబు,తదితరులతో కలిసి దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టికే విశ్వేశ్వర రెడ్డి పేదవారికి రగ్గులు పంచి పెట్టినారు. ఈ సందర్భంగా టీకే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ పేదవారికి ఏ విధంగా సహాయం చేయవచ్చు అని నిరూపించిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ని ఒక వ్యక్తి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత కడు పేదవారి గురించి ఆలోచించి పేదవారి ఆరోగ్యాన్ని బాగుపరిచే విధంగా ఆరోగ్యశ్రీ పథకం, 108 పథకం,పేద విద్యార్థులు ఉన్నత చదువులు అయినటువంటి ఇంజనీరింగ్, మెడిసిన్ చదువుకునేటట్టు ఫీజు రీయింబర్స్మెంట్ పథకం, ప్రజల సంక్షేమానికి సరికొత్త నిర్వచనం ఇచ్చిన పాలకుడు, పేదవారికి మనోధైర్యాన్ని కల్పించిన ప్రజానాయకుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని అటువంటి వ్యక్తి అడుగుజాడల్లో ఇప్పుడు ఉన్నటువంటి రాజకీయ నాయకులు పాటించి ప్రజాభిమానాన్ని పొందాలని కోరారు. పిసిసి ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్ మాట్లాడుతూ పేద ప్రజలే పరమావధిగా స్వర్గీయ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి పనిచేసేవారని పేదవారి సమస్యలు తన సమస్యలుగా భావించి వాటిని ఏ విధంగా పరిష్కరించాలి అనే ఆలోచనతో ఎప్పుడూ ఉండేవారని పేదవారికి ఆరోగ్యం, చదువు ఉచితంగా ఏ విధంగా అందించాలని ఎప్పుడు ఆలోచించే వారిని అందరినీ పేరు పెట్టి పిలిచి, భుజం తట్టి ఆప్యాయతగా పలకరించే వారిని అటువంటి వ్యక్తి అరుదుగా ఉంటారని అన్నారు.

## ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న వైన్ షాపును వెంటనే తొలగించాలి

దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దా పిచ్చయ్య





**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురంలో దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దా పిచ్చయ్య విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలోఆయన మాట్లాడుతూ రఘుదేవపురంలో ఊరి చివర మద్యం దుకాణం పెట్టడం సంతోషమే కానీ ఊరు చివర మూడు గ్రామాలకు సంబంధించిన స్మశాన వాటికకు వెళ్లే దారిలో పెట్టడం దళితులకు ఈ ప్రాంత వాసులకు ఇబ్బందికరంగా ఉందని తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణం దగ్గర సిట్టింగ్ పర్మిషన్ లేకపోయినా లేదు మద్యం దుకాణం ప్రక్కనే సిట్టింగ్ వేసుకుని మద్యం ప్రియులు ఇక్కడే త్రాగడం, ఖాళీ సీసాలు, వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ గ్లాసులు ఇక్కడే పడవేయడం వల్ల ఈ ప్రాంతమంతా పర్యావరణ పరంగా కలుషితం చేస్తున్నారని, ఇక్కడే సిట్టింగ్ వేసి పగిలిన సీసాలు స్మశాన వాటికలో పడవేయడం వల్ల స్మశానవాటికకు సంబంధించిన ట్యాంకు చుట్టూ సీసాలు గ్లాసులు ఉన్నందున స్నానం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారని, ఇక్కడ రైతులకు సంబంధించి పంట కాలువ ఉన్నందున కల్వర్టు మీద కూర్చుని సీసాలు పగలగొట్టి ఆ కాలువలోనే వేయడం వల్ల కాలువలోకి దిగాలంటే భయపడుతున్న పరిస్థితులు ఇక్కడ ఏర్పడ్డాయని అన్నారు. పొలాలకు వెళ్లే మహిళలు కూడా ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని, దళిత సంక్షేమ సంఘం తరపున డిమాండ్ చేస్తున్నానని ఆయన అన్నారు.

## టీడీపీని స్థాపించి ఎన్టీఆర్ చిరస్మరణీయుడయ్యారు

గన్నవరం, మహానగర్



సినిమా నటుడుగా అభిమానుల మనస్సులో తిరుగులేని స్థానం సాధించిన ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి, ప్రజలకు సేవచేయటం ద్వారా ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందారని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అభిప్రాయపడ్డారు. నందమూరి హరికృష్ణ 69వ జన్మదిన పురస్కరించుకొని ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరులో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరం, రక్తదాన శిబిరం ప్రారంభోత్సవంలో యార్లగడ్డ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో యార్లగడ్డ ప్రసంగిస్తూ రాష్ట్రంలో ఎంతోమంది సినీ నటులు పేరు ప్రఖ్యాతులు సాధించినప్పటికీ, తెలుగు ప్రజల గుండెల్లో తిరుగులేని స్థానం దక్కించుకుంది మాత్రం ఎన్టీ రామారావే అన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి ఆరు నెలల్లోనే ముఖ్యమంత్రి అయిన ఆయన పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం, రాయితీపై జనతా వస్త్రాలు వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతోపాటు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు వంటి చట్టం చేయటం ద్వారా ప్రజలకు చేరువయ్యారన్నారు. ప్రపంచంలో 60 సంవత్సరాల వయసులో పార్టీని స్థాపించి ముఖ్యమంత్రి పదవిని చేపట్టటం ఎన్టీ రామారావు కె సాధ్యమైందని ఎమ్మెల్యే వెంకట్రావ్ కొనియాడారు. “శక్తివంతమైన నాయకులు అత్యంత శక్తివంతమైన ప్రదేశాల నుండి వస్తారన్న” ఇంగ్లీష్ నానుడికి భిన్నంగా ఎన్టీ రామారావు వల్ల కుగ్రామమైన నిమ్మకూరు గ్రామానికి పేరు ప్రఖ్యాతులు వచ్చాయన్నారు. రాజ్యసభ పదవిని త్యాగం చేసి సమైక్యాంధ్ర ఉద్యమానికి అండగా నిలిచిన వ్యక్తి హరికృష్ణ అని గుర్తు చేశారు. సమైక్య ఉద్యమం సమయంలో రాష్ట్రంలో ఎంతోమంది ప్రజా ప్రతినిధులు రాజీనామాలు చేసినప్పటికీ సమైక్య రాష్ట్రం కోసం పదవికీ రాజీనామా చేసిన ఏకైక నాయకుడు హరికృష్ణ అని పేర్కొన్నారు. టిడిపి పార్టీ స్థాపించిన సమయంలో తండ్రి ఎన్టీఆర్ రాష్ట్ర పర్యటనలో వాహనాన్ని నడిపిన హరికృష్ణ నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పనిచేశారని చెప్పారు. హరికృష్ణతో తనకు గల అనుబంధాన్ని ఈ సందర్భంగా యార్లగడ్డ గుర్తు చేసుకున్నారు. టీడీపీ స్థాపించిన తరువాత ఇప్పటి వరకు ఏ ఎన్నికల్లోను గన్నవరం నియోజకవర్గంలోని మానికొండ గ్రామంలో టీడీపీకి మెజార్టీ రాలేదని అసెంబ్లీ ఎన్నికల సమయంలో నందమూరి రామకృష్ణ ఆ గ్రామంలో ప్రచారం చేయటంతో తొలిసారి మానికొండలో టీడీపీ అధిక్యత సాధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర, నందమూరి సుహాసిని, నందమూరి రామకృష్ణ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, గుడివాడ ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు, గొట్టిపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం, మహానగర్

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం జనసేన నాయకుల ఆధ్వర్యంలో జరిగిన పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ కేక్ కోసి జన శ్రేణులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా 50 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం రాష్ట్రంలో ఉన్న దుర్భర పరిస్థితులు అరాచక పాలన నుండి రాష్ట్రాన్ని రక్షించేందుకు టిడిపి, బిజెపితో కలిసి కూటమి ఏర్పాటు చేయటంలో పవన్ కళ్యాణ్ చొరవ అభినందనీయమన్నారు. అక్రమ కేసులతో చంద్రబాబు నాయుడు జైల్లో పెట్టినప్పుడు జైలుకు వెళ్లి చంద్రబాబును పరామర్శించిన పవన్ షరతులు లేకుండా మద్దతు ప్రకటించి రాష్ట్ర ప్రజల మన్ననలను చూరగొన్నారని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్ర అభివృద్ధిలో భాగం పంచుకున్నారని పవన్ కళ్యాణ్ ఆశయాలు అనుగుణంగా జనసైనికులు పనిచేయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో తన విజయం కోసం వివిధ కార్యక్రమంలో బిజీగా ఉన్నప్పటికీ హనుమాన్ జంక్షన్ భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారని గుర్తు చేసుకున్నారు. మరో 15 ఏళ్ల పాటు కూటమి ఐక్యమత్యంతో ఉంటుందని ప్రకటించిన పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి కోసం తహతహలాడుతున్నారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసిమెలసి పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని యార్లగడ్డ సూచించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమల శెట్టి రమేష్ బాబు మాట్లాడుతూ తమ పార్టీలో కార్యకర్తలకే పెద్దపేట వేస్తూ త్రిశూల వ్యూహాన్ని అనుసరిస్తున్నామన్నారు. పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా ఆనంద్ కుమార్, చిమటా రవి వర్మ, నాభిగాని కొండ, సాంబశివనాగరాజు, కూనపురెడ్డి నాని, హరి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## నవంబరు కల్లా అమెరికాతో వాణిజ్య ఒప్పందం

న్యూఢిల్లీ

అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయని.. త్వరలోనే పరిస్థితులన్నీ చక్కబడతాయని.. నవంబరుకల్లా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదురుతుందని ఆశిస్తున్నామని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ముంబైలో జరుగుతున్న అంతర్జాతీయ పెట్టుబడిదారుల వార్షిక సదస్సును ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించిన గోయల్.. భారత్‌తో వాణిజ్య, వ్యాపార సంబంధాలను పెంచుకోవాలనే ఆసక్తి, ఉత్సాహం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోందని అన్నారు. ఈయూతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు కూడా చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. అలాగే.. అంతకుముందు మరో కార్యక్రమంలో మాట్లాడుతూ అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే, భారతదేశం ఎప్పుడూ డెడ్‌లైన్స్ పెట్టుకొని వాణిజ్య చర్చలు జరపదని.. పరస్పర ప్రయోజనకరంగా ఉండే ఒప్పందాలపై మాత్రమే చర్చలు జరుపుతుందని ఆయన స్పష్టం చేశారు.

# మరణించిన నా తల్లిని దూషిస్తారా?

-మొదటిపేజీ తరువాయి

బృందాల(ఎసజీహెచ్ గ్రూపులు)కు ఆర్థిక సాయం చేయడానికి సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ‘జీవికా నిధి సాఖ్ సహకారీ సంఘ్ లిమిటెడ్’ సంస్థను మోదీ మంగళవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ‘అమ్మ ప్రతి ఒక్కరి ఆత్మగౌరవం. కొద్దిరోజుల కిందట దర్భంగాలో జరిగిన కాంగ్రెస–ఆర్‌జేడీ సభ వేదికపై నా తల్లిని దూషించారు. సంప్రదాయ విలువలకు పేరుగాంచిన బిహార్ నేలపై ఇలాంటి ఘటన జరుగుతుందని నేనెన్నడూ ఊహించలేదు. బిహార్లో ఇది చూసిన ప్రతి తల్లీ ఇందుకు ఎంతగానో బాధపడుతోందని నాకు తెలుసు. నా గుండెల్లో ఉన్నంత బాధే వారిలో కూడా ఉంది. భారత మాతనే అవమానించేవారికి.. నా తల్లి పట్ల అలాంటి అసభ్య పదాలు వాడడం పెద్ద లెక్కలోది కాదు. ఇలాంటివారిని శిక్షించాలి. నా తల్లికి రాజకీయాలతో సంబంధం లేదు. ఆమె తప్పేంటి..? ఎందుకు దూషించాలి? బిహార్ సీతామాత జన్మభూమి. కాంగ్రెస్, ఆర్‌జేడీలను నేను క్షమించినా.. బిహార్ తల్లులు క్షమించరు’ అని మోదీ అన్నారు. తనకు జన్మనిచ్చిన తల్లి మాతృభూమికి సేవచేయాలని తనను కోరిందని.. అందుకే దేశంలో మహిళల సంక్షేమానికి తాను అవిశ్రాంతంగా కృషిచేస్తున్నానని తెలిపారు. ఆమె తన కోసం చీర కూడా కొనుక్కుని ఎరుగదని చెప్పారు. మహిళా వ్యతిరేక మనస్తత్వం ఉన్నవారు అధికారంలోకి వస్తే.. అమ్మలు, అక్కచెల్లెళ్లు, ఆడబిడ్డలు ఎక్కువ బాధలు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆర్‌జేడీ హయాంలో రాష్ట్రంలో నేరాలు, హత్యలు, దోపిడీలు, అత్యాచారాలు, వసూళ్లు నిత్యకృత్యమని గుర్తుచేశారు. హంతకులు, రేపిస్టులకు ఆర్‌జేడీ ప్రభుత్వం రక్షణ కల్పించిందన్నారు. నాడు మహిళలే ఎక్కువగా బా?ధలు పడ్డారని.. వారే ఆ ప్రభుత్వాన్ని దించేశారని చెప్పారు. వెనుకబడిన వర్గాలకు చెందినవారు అధికారంలోకి రావడాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ సహించదని.. అందుకే తనను దూషిస్తోందని మోదీ ధ్వజమెత్తారు.

**తక్కువ వడ్డీతో రుణాలు..**

స్వయం సహాయక బృందాలకు తక్కువ వడ్డీతో రుణాలు/ఆర్థిక సాయం అందించడం నితీశ్ సర్కారు ప్రారంభించిన ‘జీవికా నిధి’ లక్ష్యం. ఈ సంస్థ నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం, కేంద్రం కూడా నిధులు అందిస్తాయి. మహిళా పారిశ్రామికవేత్తలు ఆర్థిక సాయం కోసం ప్రస్తుతం సూక్ష్మ ఆర్థిక సంస్థలపై ఆధారపడుతున్నారు. 18–24 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మహిళలకు తక్కువ వడ్డీలతో సకాలంలో ఆర్థిక సాయం అందించే జీవికా నిధిని ఏర్పాటుచేశారు. ఈ వ్యవస్థ పూర్తిగా డిజిటల్ లావాదేవీలే నడుస్తాయి. దీని ద్వారా ‘జీవికా దీదీల’ బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నిధులు బదిలీ అవుతాయి.

కాంగ్రెస్ నేత ఖేడాకు రెండు ఓటరు ఐడీలు

కాంగ్రెస్ మీడియా విభాగం ఇన్‌చార్జి పవన్ ఖేడాకు వేర్వేరు నంబర్లతో రెండు ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు ఉన్నాయని బీజేపీ ఆరోపించింది. బిహార్‌లో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ గగ్గోలు పెడుతున్నారని, కానీ అసలు ‘ఓట్ల దొంగ’ కాంగ్రెస్సేనని విమర్శించింది. ఖేడాకు రెండు ఓటరు ఐడీలు ఎలా వచ్చాయో ఎన్నికల సంఘం(ఈసీ) దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎన్నికల సంఘం ఖేడాకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 8వ తేదీ 11 గంటల్లోపు సమాధానం ఇవ్వాలని సూచించింది. బీజేపీ ఆరోపణలపై ఖేడా స్పందిస్తూ ఆ పార్టీ నాయకులు చెప్పిన తర్వాతే తనకు రెండో ఓటరు ఐడీ ఉన్నట్లు తెలిసిందన్నారు. దీన్ని బట్టి ఓటర్ల జాబితాలు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో తేటతెల్లమవుతోందన్నారు. దీనికి ఈసీనే నిందించాలని, ఓటర్ల జాబితాలను సక్రమంగా నిర్వహించడంలో ఈసీ విఫలమైందని విమర్శించారు.


# మహిళల్లో కేసులెక్కువ.. పురుషుల్లో మరణాలెక్కువ

న్యూఢిల్లీ

దేశంలో కేన్సర్ వ్యాధి కేసులు, మరణాల్లో భిన్న వైఖరి కనిపిస్తోంది. మహిళల్లో కేన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతుండగా పురు షుల్లో మాత్రం కేన్సర్ మరణాలు అధికంగా సంభవిస్తున్నాయి. ప్రజల జీవనశైలిలో వచ్చిన మార్పులు, మారిన ఆహార అలవాట్లు కేన్సర్ వ్యాధికి ఎక్కువగా కారణమవుతున్నాయి. 2015%–%2019 మధ్య 43 కేన్సర్ రిజిస్ట్రీల్లో నమోదైన గణాంకాలను విశ్లేషించిన ఓ జాతీయ బృందం ఈ ఆందోళనకర వివరాలను బయటపెట్టింది. దీనిప్రకారం 2015%–%2019 మధ్య 7.08 లక్షల కేన్సర్ కేసులు నమోదవగా 2.06 లక్షల మరణాలు సంభవించాయి. ఈ లెక్కన 2024లో దేశవ్యాప్తంగా 15.6 లక్షల కేసులు నమోదై 8.74 లక్షల మరణాలు నమోదై ఉండొచ్చని అంచనా వేసింది.

**మహిళల్లో ఎక్కువ కేసులు**

2012%–%2022 మధ్య జాతీయ కేన్సర్ రిజిస్ట్రీలు పలు ఆసక్తికర అంశాలను తెరపైకి తెచ్చాయి. మహిళల్లో కేన్సర్ కేసులు పురుషుల కంటే ఎక్కువగా నమోదయ్యాయి. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ కేన్సర్ బాధితులు మహిళల్లో ఎక్కువగా ఉన్నారు. కానీ ఆశ్చర్యకరంగా మహిళల్లో ఈ కేన్సర్ల కారణంగా మరణాల రేటు తక్కువగా ఉంది. మొత్తం కేసుల్లో మహిళల వాటా 51.1 శాతం. కానీ మరణాల రేటు మాత్రం 45 శాతమే. దీనికి ప్రధాన కారణం మహిళల్లో ఎక్కువగా వచ్చే బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్లు. ఇవి స్క్రీనింగ్ ద్వారా ముందే గుర్తించే వీలుండటంతోపాటు ముందస్తుచికిత్సలతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. మరోవైపు పురుషుల్లో వచ్చే ఓరల్, లంగ్, లివర్, ఉదర, అన్నవాహిక కేన్సర్లు ఆల స్యంగా నిర్ధారణ కావడంతో మరణాలు అధికంగా నమోదవుతు న్నాయని ఐసీఎంఆర్%–%ఎన్‌సీడీఐఆర్ డైరెక్టర్ ప్రశాంత్ మాథూర్ తెలిపారు.



**పొగాకును నియంత్రించకుంటే మరణాలు తగ్గవు..**

శ్ కేన్సర్‌పై పోరులో పురుషుల ప్రవర్తననే పెద్ద శత్రువుగా చూడాలి. పొగాకు నియంత్రణలో కఠిన చట్టాలు అమలు చేయకపోతే మరణాలు తగ్గవు. గ్లోబల్ అడల్ట్ టొబాకో సర్వే ప్రకారం 2009%–%10లో 34.6% ఉన్న పొగాకు వినియోగం 2016%–%17 నాటికి 28.6%కి తగ్గింది. అయినా కేసులు పెరగడానికి పొగాకు దుష్ప్రభావాలకు 20 ఏళ్ల తర్వాత బయటపడే గుణం ఉండటమే కారణం. అధిక మద్యపానం కూడా నోటి కేన్సర్ భారాన్ని పెంచుతోంది. మద్యం, పొగాకు రెండూ విడిగా కేన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ఇక కలిపి వాడితే మరింత ప్రమాదం పెరుగుతుంది.

%–% డాక్టర్ ప్రశాంత్ మాథూర్

**మరణాలకు కారణం అలవాట్లే..**

‘ పురుషుల్లో ఊపిరితిత్తుల కేన్సర్ కంటే నోటి కేన్సర్ కేసులు ఎక్కువగా నమో దు అవుతున్నాయి. అందుకు ప్రధాన కారణం గుట్కా, జర్దా, బీడీ, సిగరెట్, పొగాకు విని యోగం అలవాట్లేనని అధ్యయనం పేర్కొంది. అలాగే కేన్సర్ లక్షణాలను పురుషులు ఎక్కువగా నిర్లక్ష్యం చేస్తుండటం వల్ల చికిత్స మొదలుపెట్టే సరికే వ్యాధి మూడు లేదా నాలుగో దశకు చేరుకుంటోందని తెలిపింది. దీంతో చికిత్సలు ఫలితం ఇవ్వడంలేదని అధ్య యనం వివరించింది.

**పర్యావరణం, జీవనశైలి ప్రభావం**

‘ అయితే దేశమంతా కేన్సర్ కేసుల తీరు భిన్నంగా ఉంటోంది. ఈశాన్య రాష్ట్రం మిజోరాం (ఐజ్వాల్)లోని పురుషుల్లో ప్రతి లక్ష మంది పురుషుల్లో 269.4 కేన్సర్ కేసులు, అరుణా చల్‌ప్రదేశ్ (పపుంపారే) లోని ప్రతి లక్ష మంది మహిళల్లో 227.5 కేన్సర్ కేసులు నమోదవుతుండగా మహారాష్ట్రలోని బర్షీలో మాత్రం అతితక్కువ కేన్సర్ కేసులు నమోదైనట్లు అధ్యయనం గుర్తించింది. వాయు కాలు ష్యం, ఆహార అలవాట్లు, జన్యు కారణాలు మొదలైన అంశాల వల్ల ప్రాంతాలవారీ వ్యత్యాసం కనిపిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**ప్రాంతాలవారీగా కేన్సర్ కేసుల తీరు: (ప్రతి లక్ష జనాభాకు)**

హైదరాబాద్: బ్రెస్ట్ కేన్సర్ అత్యధికం (54)
ఐజ్వాల్: సర్వైకల్ కేన్సర్ అత్యధికం (27.1)
శ్రీనగర్: పురుషుల్లో లంగ్ కేన్సర్ అత్యధికం (39.5)
ఐజ్వాల్ మహిళలు: లంగ్ కేన్సర్ అత్యధికం (33.7)
అహ్మదాబాద్: పురుషుల్లో ఓరల్ కేన్సర్ అత్యధికం (33.6)
శ్రీనగర్: ప్రోస్టేట్ కేన్సర్ అత్యధికం (12.7)
ఈస్ట్ ఖాసీ హిల్స్: మహిళల్లో ఓరల్ కేన్సర్ అత్యధికం (13.6)

# చైనా ఆయుధ పాఠవం

బీజింగ్, సియోల్

రక్షణ రంగ దిగ్గజాల్లో ఒకటైన చైనా బుధవారం తన ఆయుధ పాటవాన్ని ప్రదర్శించనుంది. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై తాము సాధించిన విజయానికి 80 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని దీనిని ఏర్పాటు చేసింది. అధునాతన యుద్ధ విమానాలు, క్షిపణులు, ఎలక్ట్రానిక్ జామింగ్ వంటి హార్డ్‌వేర్ వ్యవస్థల్ని తొలిసారి ప్రపంచం ముందు ప్రదర్శించబోతోంది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ సహా 26 దేశాల అగ్రనేతలు దీనికి హాజరవుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రతిష్ఠాత్మక తియానన్మేన్ స్క్వేర్ వద్ద జరిగే కార్యక్రమంలో జిన్‌పింగ్ ప్రసంగించనున్నారు. అమెరికాకు ఏమాత్రం తీసిపోని అనేక ఆయుధాలను చైనా సైన్యం ప్రదర్శించనుంది. వీటిలో నాలుగో తరం యుద్ధ ట్యాంకులు, అత్యాధునిక విమానాలు, హైపర్‌సోనిక్ క్షిపణులు వంటివి ఉంటాయి. అమెరికా తన బలాన్ని చాటేందుకు జూన్‌లో ఇలాంటి ప్రయత్నమే చేసింది.

**పుతిన్ నా పాత మిత్రుడే: జిన్‌పింగ్**



పుతిన్ మంగళవారం జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఆయన్ని తన పాత మిత్రుడుగా జిన్‌పింగ్ పేర్కొని సాదరంగా స్వాగతించారు. షీ తన ప్రియమిత్రుడు అని పుతిన్ చెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం మొదలైనప్పటి నుంచి చైనా–రష్యా బంధం బలపడుతూ వస్తోంది. 30 రోజుల చెల్లుబాటుతో.. వీసా అవసరం లేకుండా చైనాలోకి వచ్చేందుకు రష్యా పర్యాటకులను ఈ నెల నుంచే అనుమతించాలని తాజా సమావేశంలో నిర్ణయం కుదిరింది. గ్యాస్ సరఫరాపైనా ఒప్పందాలు ఖరారయ్యాయి.

**జిన్‌పింగ్‌తో షెహబాజ్, మునీర్ భేటీ**

ఫీల్డ్ మార్షల్‌గా బాధ్యతలు తీసుకున్న పాకిస్థాన్ సైన్యాధిపతి ఆసిం మునీర్ మంగళవారం జిన్‌పింగ్‌తో తొలిసారి భేటీ అయ్యారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా పాల్గొన్నారు.

**బుల్లెట్ ప్రూఫ్ రైలులో కిమ్**

ఉత్తర కొరియా అధినేత కింగ్‌జోంగ్ ఉన్ బుల్లెట్ ప్రూఫ్ రైలులో బీజింగ్ చేరుకున్నారు. 2023 తర్వాత ఆయన దేశం దాటడం ఇదే తొలిసారి. అమెరికా, దాని మిత్ర దేశాల ఆంక్షలతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న ఉత్తర కొరియాకు చైనా నుంచి పూర్తి మద్దతు అందుతోంది. రష్యాకు ఉత్తర కొరియా తన సైనికులను పంపుతోంది. ఇప్పుడు ఈ మూడు దేశాధినేతలు ఒక వేదిక వద్ద కనిపించనుండటం వారి మధ్య బలపడుతోన్న బంధానికి నిదర్శనంగా నిలవనుంది. పుతిన్, కిమ్‌లను తమవైపు ఆకట్టుకునేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు గండికొట్టేలా ముగ్గురినీ ఒక్కచోటకు చేర్చడం చైనా వ్యూహంగా చెబుతున్నారు. ఈ ప్రదర్శనకు హాజరు కావద్దని ప్రపంచ నేతల్ని జపాన్ కోరింది.

# పళ్లు తోముకున్న వెంటనే నీళ్లు ఎందుకు తాగొద్దు?



పళ్ళ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మంచి నోటి పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పకుండా దంత వైద్యుడిని సందర్శించడం అవసరం. నోటి ఆరోగ్యం మొత్తం శరీర ఆరోగ్యంతో ముడిపడి ఉంటుంది. కాబట్టి నోటి సమస్యలు గుండె జబ్బులు వంటి ఇతర ఆరోగ్య సమస్యలకు దారి తీయవచ్చు. ఉదయం, రాత్రి బ్రష్ చేసిన తర్వాత నీరు త్రాగవద్దని అంటారు. కానీ దీని వెనుక ఉన్న కారణం ఏంటో మీకు తెలుసా? బ్రష్ చేసిన తర్వాత టూత్‌పేస్ట్ నుండి పలుచని ఫ్లోరైడ్ పొర మన దంతాలపై పేరుకుపోతుంది. ఈ పొర బ్యాక్టీరియాతో పోరాడి ఎనామెల్‌ను బలపరుస్తుంది. ఫ్లోరైడ్ యొక్క పని దంతాలను కావిటీస్ నుండి రక్షించడం. ఎనామెల్ దెబ్బతినకుండా నిరోధించడం. ఉదయం, రాత్రి బ్రష్ చేసిన తర్వాత నీరు త్రాగవద్దని అంటారు. కానీ దీని వెనుక ఉన్న కారణం ఏంటో మీకు తెలుసా? బ్రష్ చేసిన తర్వాత టూత్‌పేస్ట్ నుండి పలుచని ఫ్లోరైడ్ పొర మన దంతాలపై పేరుకుపోతుంది. ఈ పొర బ్యాక్టీరియాతో పోరాడి ఎనామెల్‌ను బలపరుస్తుంది. ఫ్లోరైడ్ యొక్క పని దంతాలను కావిటీస్ నుండి రక్షించడం. ఎనామెల్ దెబ్బతినకుండా నిరోధించడం. మీరు బ్రష్ చేసిన వెంటనే నీరు త్రాగినా లేదా శుభ్రం చేసినా ఈ ఫ్లోరైడ్ త్వరగా కొట్టుకుపోతుంది. దీని కారణంగా టూత్‌పేస్ట్ ప్రభావం అసంపూర్ణంగా ఉంటుంది. మీ దంతాలు కావిటీస్ నుండి పూర్తిగా రక్షించబడవు. దంతవైద్యుల అభిప్రాయం ప్రకారం.. ఫ్లోరైడ్ దాని ప్రభావాన్ని చూపించడానికి కనీసం 10–15 నిమిషాలు పడుతుంది. అప్పుడు మాత్రమే అది ఎనామెల్‌ను బలోపేతం చేస్తుంది. మీరు ఆరోగ్యకరమైన దంతాలను కోరుకుంటే మీరు బ్రష్ చేసిన తర్వాత కొంత సమయం వేచి ఉండాలి. నీరు మాత్రమే కాదు, టీ–కాఫీ లేదా ఏదైన తినడం కూడా బ్రష్ చేసిన వెంటనే మానుకోవాలి. మీ ఈ ఒక్క అలవాటుతో మీరు మీ దంతాలను బలంగా, చాలా కాలం పాటు కావిటీస్ లేకుండా ఉంచుకోగలుగుతారు. ఇది మీ ఆరోగ్యకరమైన చిరునవ్వును కాపాడుకోవడానికి సహాయపడుతుంది. ఆరోగ్య కరమైన దంతాల కోసం రోజుకు రెండుసార్లు బ్రష్ చేయాలని దంతవైద్యులు సిఫార్సు చేస్తారు. ఇది దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. మంచి అలవాట్లతో మీ దంతాలను బలంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.



# ఈ లక్షణాలు కనిపిస్తే డయాబెటిస్ ఉన్నట్లే..

ఉదయం పూట మీకు కొంచెం అలసటగా లేదా బలహీనంగా అనిపిస్తుందా? ఎట్టి పరిస్థితుల్లోనూ దానిని విస్మరించవద్దు.. ఎందుకంటే.. కొన్నిసార్లు ఈ చిన్న సమస్యలు కూడా పెద్ద వ్యాధికి సంకేతం కావచ్చు.. ముఖ్యంగా డయాబెటిస్ కు కారణం కావచ్చు. ఇది క్రమంగా శరీరాన్ని దెబ్బతీస్తుంది. దీని లక్షణాలు మొదట ఉదయాన్నే కనిపించడం ప్రారంభిస్తాయి. అటువంటి పరిస్థితిలో, ఈ లక్షణాలను సకాలంలో గుర్తించి వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. చెడు జీవనశైలి, తప్పుడు ఆహారపు అలవాట్ల కారణంగా దేశంలో డయాబెటిస్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ వ్యాధి పిల్లల నుంచి పెద్దల వరకు అందరినీ బాధితులుగా మారుస్తోంది. వాస్తవానికి , ఈ దీర్ఘకాలిక వ్యాధి చాలా ప్రమాదకరమైనది. ఇది క్రమంగా శరీరాన్ని బలహీనపరుస్తుంది. సకాలంలో గుర్తించకపోతే, ఇది తీవ్రమైన రూపాన్ని తీసుకోవచ్చు. పరిస్థితి మరింత దిగజారే వరకు చాలా మందికి దాని లక్షణాలు తెలియవు. డయాబెటిస్ అనేది దీర్ఘకాలిక వ్యాధి.. ఇది శరీరం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది. శరీరం తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి చేయలేనప్పుడు లేదా ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించలేనప్పుడు ఇది సంభవిస్తుంది. అలసట – బలహీనత: మీరు ప్రతి ఉదయం అలసిపోయి బలహీనంగా అనిపిస్తే.. అది ఒక హెచ్చరిక సంకేతం కావచ్చు. ఈ రకమైన లక్షణం మధుమేహాన్ని సూచిస్తుంది. ఉదయం తక్కువ శక్తి అంటే శరీరంలో ఏదో సమస్య ఉందని అర్థం. అధిక రక్తంలో చక్కెర స్థాయిల కారణంగా మీరు నీరసంగా లేదా శక్తి లేనట్లు బలహీనంగా అనిపించవచ్చు. తరచుగా దాహం వేయడం: ఉదయం నిద్ర లేచినప్పుడు చాలా దాహం వేయడం, అలాగే.. మీ నోరు త్వరగా ఎండిపోవడం రక్తంలో అధిక చక్కెరకు సంకేతం కావచ్చు. చక్కెర స్థాయి ఎక్కువగా ఉన్నప్పుడు, మూత్రపిండాలు మూత్రం ద్వారా అదనపు గ్లూకోజ్‌ను విసర్జించడానికి ప్రయత్నిస్తాయి. దీని వల్ల శరీరం నిర్జలీకరణానికి గురవుతుంది. ఇవి మధుమేహం లక్షణాలు కావొచ్చు.. అస్పష్టమైన దృష్టి: అధిక రక్తంలో చక్కెర కళ్ళను కూడా ప్రభావితం చేస్తుంది. కొన్నిసార్లు రక్తంలో చక్కెర పెరుగుదల కారణంగా మనం సరిగ్గా చూడలేము. మీరు అకస్మాత్తుగా అస్పష్టమైన దృష్టిని అనుభవించడం ప్రారంభిస్తే, మీ రక్తంలో చక్కెర స్థాయి ఎక్కువగా ఉందని అర్థం.. తరచుగా మూత్ర విసర్జన: రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు, మూత్రపిండాలు ఎక్కువ నీటిని విసర్జిస్తాయి. దీనివల్ల తరచుగా మూత్ర విసర్జన జరుగుతుంది.

# పెసర పప్పు ఆరోగ్య ప్రయోజనాలు?



పప్పులో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. పప్పులో అనేక రకాలు ఉన్నాయి. శనగపప్పు, కందిపప్పు, ఎర్రపప్పు, పుట్నాల పప్పు, కానీ, పెసర పప్పు అత్యంత ఆరోగ్యకరమైనది అంటున్నారు ఆరోగ్యనిపుణులు. ఇందులో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ప్రోటీన్, ఐరన్, కాల్షియం, పొటాషియం, అనేక విటమిన్లు ఉన్నాయి. ఇవి అనేక వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది: పెసర పప్పులో మెగ్నీషియం ఉంటుంది. దీని కారణంగా ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. మీకు అధిక రక్తపోటు సమస్య ఉంటే, మీరు మీ ఆహారంలో మూంగ్ పప్పును తప్పక తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. జీర్ణ వ్యవస్థ కోసం: పెసర పప్పులో ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. ఇది అజీర్ణం, గుండెల్లో మంట సమస్య నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. దీని వినియోగం జీర్ణ శక్తిని బలోపేతం చేస్తుంది. మీ ఎముకలను బలంగా చేసుకోండి: పెసర పప్పులో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. పగుళ్ల సమస్య ఉంటే, ఖచ్చితంగా మూంగ్ పప్పును ఆహారంలో చేర్చుకోవాలని చెబుతున్నారు. మీ కళ్ళను ఆరోగ్యంగా ఉంచుకోండి: పెసర పప్పులో విటమిన్ సి, విటమిన్ బి5, విటమిన్ బి6 సమృద్ధిగా ఉంటాయి.. ఇది కంటి ఆరోగ్యానికి మంచిది. ఇందులో ఉండే విటమిన్ సి రెటీనాను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చర్మం, జుట్టుకు ప్రయోజనకరమైనది: పెసర పప్పు చర్మానికి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మ సంబంధిత సమస్యలు నయం అవుతాయి. మీరు మీ రోజువారీ ఆహారంలో పెసర పప్పును తీసుకుంటే ముఖం ముడతలు, మచ్చలు మొదలైన వాటిని తగ్గించవచ్చు. మూంగ్ పప్పులో ఉండే రాగి జుట్టు మూలాలను బలపరుస్తుంది. అలాగే, హెయిర్ మాస్క్‌గా వాడితే జుట్టును మందంగా, పొడవుగా, మెరిసేలా చేస్తుంది.

# నల్లమిరియాలలో దాగున్న అద్భుత ఆరోగ్య రహస్యాలు!



నల్ల మిరియాలను సుగంధ ద్రవ్యాల రాజు అని పిలుస్తారు. వంటకు రుచిని ఇవ్వడమే కాకుండా ఇవి ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. మిరియాలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి, జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. మితంగా తీసుకోవడం తప్పనిసరి. నల్ల మిరియాలను సుగంధ ద్రవ్యాల రాజు అని పిలుస్తారు. ఇవి వంటకు రుచిని ఇవ్వడమే కాకుండా.. మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ఆయుర్వేదంలో వీటిని మందుగా కూడా వాడుతారు. మనం రోజూ తినే ఆహారంలో మిరియాలను చేర్చుకుంటే.. మన శరీరానికి చాలా రక్షణ దొరుకుతుంది. నల్ల మిరియాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. మిరియాలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మన శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి మెదడు పనితీరును, జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తాయి. అల్జీమర్స్ వంటి వ్యాధులను కూడా నివారించడానికి సహాయపడతాయి. మిరియాలలో పైపెరిన్ అనే ఒక రసాయనం ఉంటుంది. ఇది క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మిరియాలలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు మన శరీరంలోని కణాలను కాపాడతాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి నల్ల మిరియాలు సహాయపడతాయి. కొద్దిగా వాడితే హై బ్లడ్ షుగర్ తగ్గే అవకాశం ఉంది. మిరియాలు మన జీర్ణ ఎంజైమ్ లను ఉత్తేజపరుస్తాయి. మనం తినే భోజనంతో పాటు వీటిని తీసుకుంటే జీర్ణక్రియ సులభంగా జరుగుతుంది. మిరియాల లోని గుణాలు గ్యాస్ సమస్యలను కూడా తగ్గిస్తాయి. నల్ల మిరియాలను మితంగా వాడితేనే మంచిది. ఎక్కువగా తింటే గ్యాస్, కడుపు మంట వంటి సమస్యలు రావచ్చు. అందుకే ఎంత తినాలనేది డాక్టర్ ను అడిగి తెలుసుకోవడం మంచిది. నల్ల మిరియాలు కేవలం రుచి కోసం మాత్రమే కాదు.. అవి యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి. జీర్ణక్రియకు సహాయపడతాయి. రక్తంలో చక్కెరను అదుపులో ఉంచుతాయి. మెదడు ఆరోగ్యాన్ని కాపాడతాయి. కానీ ఎప్పుడూ మితంగానే తీసుకోవాలి.


# పెయిన్ కిల్లర్స్‌తో యాంటీబయాటిక్స్ కలిపి వేసుకుంటున్నారా?



మనలో చాలా మంది నొప్పి మందులను యాంటీబయాటిక్స్‌తో కలిపి వాడుతుంటారు. కానీ తాజా పరిశోధనలు ఇది చాలా ప్రమాదకరమని చెబుతున్నాయి. ఇలాంటి కలయిక వల్ల బ్యాక్టీరియా మరింత శక్తివంతమై యాంటీబయాటిక్స్‌ను తట్టుకునే స్థితికి చేరుకుంటుంది. దీని ఫలితంగా సాధారణ ఇన్ఫెక్షన్లకే పెద్ద ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. సాధారణంగా మనం వాడే నొప్పి మందులను యాంటీబయాటిక్స్‌తో కలిపి వేసుకుంటే.. అది చాలా ప్రమాదకరం అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల బ్యాక్టీరియా మరింత త్వరగా ఆ యాంటీబయాటిక్ లను తట్టుకునే శక్తిని పెంచుకుంటుంది. ఫలితంగా ఆ సూక్ష్మక్రిములు ఇంకా ప్రమాదకరంగా మారతాయి. దక్షిణ ఆస్ట్రేలియా యూనివర్సిటీలో చేసిన పరిశోధనలో ఈ విషయం బయటపడింది. నొప్పి మందులు ఒంటరిగా వాడినా కూడా బ్యాక్టీరియా నిరోధకత పెరుగుతుంది. కానీ వాటిని యాంటీబయాటిక్స్‌తో కలిపి వాడినప్పుడు.. ఆ నిరోధకత మరింత వేగంగా పెరిగింది. నిపుణులు చెప్పిన దాని ప్రకారం.. యాంటీబయాటిక్ నిరోధకత అనేది మనం అనుకున్నదానికంటే చాలా క్లిష్టమైన సమస్య. ఇది కేవలం యాంటీబయాటిక్‌ల వల్ల మాత్రమే కాదు.. మనం వాడే ఇతర మందుల వల్ల కూడా పెరుగుతుంది. ముఖ్యంగా వృద్ధులు ఒకేసారి చాలా మందులు వాడేటప్పుడు ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఇబుప్రోఫెన్, పారాసెటమాల్‌తో పాటు.. మధుమేహానికి వాడే మెట్ఫార్మిన్, కొలెస్ట్రాల్‌కు వాడే అటోర్వాస్టాటిన్ వంటి మందులను ఒకేసారి వాడినప్పుడు కూడా ఇలాంటి సమస్యే వస్తుందని పరిశోధకులు గుర్తించారు. దీని వల్ల ఈ మందులను వాడటం మానేయాలని కాదు.. కానీ యాంటీబయాటిక్స్‌తో కలిపి వాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. 2024లో ప్రచురించబడిన మరో అధ్యయనం ప్రకారం.. యాంటీబయాటిక్‌లకు తట్టుకునే ఈ రకమైన బ్యాక్టీరియా వల్ల 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా 3.9 కోట్ల మంది ప్రాణాలు ప్రమాదంలో పడవచ్చు. ఆధునిక వైద్యంలో యాంటీబయాటిక్ నిరోధకత ఒక పెద్ద సమస్య. నొప్పి మందులను యాంటీబయాటిక్స్‌తో కలిపి వాడితే ఈ సమస్య పెరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. వైద్యుల సలహాలు తీసుకోవడం, అనవసరమైన యాంటీబయాటిక్స్ వాడకాన్ని తగ్గించడం ద్వారా ఈ ప్రమాదకరమైన పరిస్థితిని నివారించవచ్చు.

బిజినెస్ వాయిస్

## త్వరలో అందుబాటులోకి రానున్న ఆన్‌లైన్ గేమింగ్ చట్టం




ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్ చట్టం అతి త్వరలో అందుబాటులోకి వస్తుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 21న ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ చట్టం-2025ని పార్లమెంటు ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ చట్టం ఈ-స్పోర్ట్స్, ఇతర ఆన్‌లైన్ గేమ్‌లను ప్రోత్సహిస్తూనే అన్ని రకాల ఆన్‌లైన్ మనీ గేమ్‌లను నిషేధిస్తుంది. ఇప్పటికే దీనికి రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. ప్రభుత్వం నోటిఫై చేసిన తర్వాత ఈ చట్టం అమల్లోకి వస్తుంది. అనుకున్న సమయం కంటే చాలా త్వరగా ఈ చట్టం అమలులోకి వస్తుంది. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్ కృష్ణన్ సెమీకండక్టర్లపై జరిగిన ఐసీఈఏ ఈవెంట్ సందర్భంగా అన్నారు. గత వారం ఆర్థిక సేవల శాఖ, ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖతో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు జరిపిన సంయుక్త సమావేశంలో బిల్లు నిబంధనను అమలు చేయడానికి వివరణాత్మక మార్గదర్శకాలను, ఆన్‌లైన్ మనీ గేమ్‌ల కోసం లావాదేవీలను సమీక్ష నిర్వహించే వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సమయాన్ని కోరాయి. ఈ చట్టం ఆన్‌లైన్ మనీ గేమ్‌లకు సంబంధించిన ప్రకటనలను, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు అటువంటి గేమ్‌లలో నిధులను బదిలీ చేయకుండా నిషేధిస్తుంది. అందుకే బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఆర్థిక పరమైన లావాదేవీల తనిఖీలకు సమయం కోరాయి. ఆన్‌లైన్ మనీ గేమ్స్ గురించి యాడ్స్ వేస్తే 2 ఏళ్ల జైలుశిక్ష, రూ. 50 లక్షల జరిమానా విధించనున్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్ మనీ గేమ్స్‌కు ఆర్థిక సహకారం అందించే వారికి 3 ఏళ్ల జైలుశిక్ష, రూ. కోటి వరకు జరిమానా విధిస్తారు. పదే పదే చట్టాన్ని ఉల్లంఘిస్తే 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ. 2 కోట్ల జరిమానా విధించనున్నారు.

## రూ. 1.05 లక్షల మార్కు దాటిన బంగారం



బంగారం ధరలు హద్దుల్లేకుండా దూసుకెళు_న్నాయి. ఇప్పటికే భారీగా పెరిగిన ధరలను చూసి సామాన్యులు కొనేందుకు దూరమవుతుండగా, తాజాగా పసిడి ధరలు సరికొత్త రికార్డు గరిష్టాలకు చేరాయి. వరుసగా ఆరో రోజు బంగారం రూ. 1,000 పెరగడంతో దేశ రాజధానిలో సోమవారం పది గ్రాములు రూ. 1,05,670 వద్ద కొత్త గరిష్ఠాలను తాకింది. ఇందుకు ప్రధానంగా అమెరికా ఫెడ్ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలు, గ్లోబల్ మార్కెట్లలో డిమాండ్ పెరగడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్లో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం సోమవారం రూ.930 పెరిగి 10 గ్రాములకు రూ.1,05,880 (అన్ని పన్నులు కలిపి) జీవితకాల గరిష్ట స్థాయికి చేరుకుంది. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పసిడి రూ. 850 పెరిగి రూ. 97,050 వద్దకు చేరింది. యూఎస్ ఫెడ్ వ్యవహారంలో పెరుగుతున్న ఆందోళనలు, టారిఫ్ విధానాలపై పెరిగిన అనిశ్చితి మధ్య పెట్టుబడిదారులు సురక్షితమైన ఆస్తుల వైపు మొగ్గు చూపడంతో ధరలు అత్యధికంగా పెరుగుతున్నాయని వ్యాపారులు తెలిపారు. మరోవైపు వెండి ధరలు కూడా రూ. 1,000 పెరిగి కిలోగ్రాముకు రూ. 1,36,000 (అన్ని పన్నులు కలిపి) కొత్త గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్‌లో డిమాండ్ కారణంగా దేశీయ మార్కెట్లలో వెండి రికార్డు స్థాయిలో పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో స్పాట్ గోల్డ్ ఔన్సుకు 3,470.51 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# నిబంధనల ప్రకారమే రష్యా చమురు కొనుగోళ్లు



రష్యా చమురు, ఇంధన వాణిజ్యాన్ని కొనుగోలు చేయడంలో భారత్ ఎటువంటి నియమాలను ఉల్లంఘించలేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు. సోమవారం ఓ జాతీయ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. భారత ప్రభుత్వం అంతర్జాతీయ నిబంధనలను గౌరవించడంతోనే గ్లోబల్ మార్కెట్లలో చమురు ధరలు పెరగకుండా స్థిరంగా ఉన్నాయి. ఈ సందర్భంగా వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో రష్యా చమురుకు భారత్ 'లాండ్రోమ్యాట్'గా మారిందన్న వ్యాఖలను కేంద్ర మంత్రి తోసిపుచ్చారు. ఆయన వ్యాఖ్యలు వాస్తవానికి ఏ మాత్రం పొంతనలేదని తెలిపారు. అంతేకాకుండా రష్యా చమురును కొనుగోలు చేసి భారత్ లాభపడిందనే వ్యాఖ్యలనూ ఆయన తిప్పికొట్టారు. 2022లో రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేయడానికి చాలా కాలం ముందు నుంచే భారత్ అతిపెద్ద పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశంగా ఉందని, ఎగుమతుల పరిమాణం, మార్జిన్‌లు అంతే ఉన్నాయని అన్నారు. కొంతమంది విమర్శకులు భారత్ రష్యా చమురు కోసం 'లాండ్రోమాట్'గా మారిందని ఆరోపిస్తున్నారు. అందులో ఏ మాత్రం నిజం లేదనిని పేర్కొన్నారు. రష్యా నుంచి కొనే చమురు ధరలు జీ7 దేశాలు విధించే ప్రైస్ క్యాప్‌కు అనుకూలంగా ఉన్నాయి. ఈ ప్రైస్ క్యాప్ జీ7 దేశాలు రష్యా ఆదాయాన్ని నియంత్రించడం కోసం తెచ్చిందనే విషయాన్ని గుర్తించుకోవాలి. ప్రపంచ చమురు ధరలను స్థిరంగా ఉండటంలో కీలక యంత్రాంగంగా భారత్ పని చేస్తోందని మంత్రి వెల్లడించారు. కాగా, ఇటీవల పీటర్ నవారో మాట్లాడుతూ, భారత్ లాండ్రోమ్యాట్‌గా ఉండటం మూలంగా ఓ వర్గం లాభపడుతోంది. అందుకు భారత్ తన ప్రజలను పణంగా పెడుతోందని, దాన్ని అడ్డుకోవాలన్నారు. ఉక్రెయిన్ ప్రజలను బలి తీసుకుంటున్న ఈ ధోరణి, అమెరికనలు చెల్లింపుదారులుగా ఏం చేయాలనేది చూడాలన్నారు. భారత్ లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి అధినేత నరేంద్ర మోదీ పుతిన్, జిన్‌పింగ్‌లతో ఎందుకని అంటకాగుతున్నారో అర్థం కావట్లేదని అన్నారు. ఈ క్రమంలోనే హర్దీప్ సింగ్ తాజా వ్యాఖ్యలు చేశారు.

## యూపీఐ ఆగస్టులో 20 బిలియన్ లావాదేవీల రికార్డు

భారతదేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చారిత్రక ఘనత సాధించింది. తొలిసారిగా ఒకే నెలలో 20.01 బిలియన్ (2000 కోట్లు) లావాదేవీల మార్కును అధిగమించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఆగస్టు 2025 గణాంకాలను సోమవారం విడుదల చేసింది, ఇది యూపీఐ యొక్క విశేష వృద్ధిని స్పష్టం చేస్తుంది. ఎన్‌పీసీఐ డేటా ప్రకారం, ఆగస్టు 2025లో యూపీఐ ద్వారా 20.01 బిలియన్ లావాదేవీలు నమోదయ్యాయి, ఇది జులై నెలలో నమోదైన 19.47 బిలియన్ లావాదేవీలతో పోలిస్తే 2.8 శాతం అధికం. వార్షిక ప్రాతిపదికన, ఈ వృద్ధి 34 శాతంగా ఉంది. లావాదేవీల విలువ రూ.24.85 లక్షల కోట్లుగా నమోదైంది, గత ఏడాదితో పోలిస్తే 24 శాతం పెరుగుదలను సూచిస్తుంది. సగటున రోజుకు 645 మిలియన్ లావాదేవీలు జరిగాయని, ఒక్కో రోజు సగటు విలువ రూ.80,177 కోట్లుగా ఉందని ఎన్‌పీసీఐ తెలిపింది. ఆగస్టు 2న ఒకే రోజు 700 మిలియన్ లావాదేవీలతో యూపీఐ మరో రికార్డు సృష్టించింది. ఎస్బీఐ రీసెర్చ్ నివేదిక ప్రకారం, డిజిటల్ చెల్లింపుల్లో మహారాష్ట్ర 9.8 శాతం వాటాతో అగ్రస్థానంలో నిలిచింది, కర్ణాటక (5.5 శాతం) మరియు ఉత్తరప్రదేశ్ (5.3 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. పీ2ఎం (వినియోగదారుల నుంచి వ్యాపారులకు) లావాదేవీలు గణనీయంగా పెరిగాయి, 2020 జూన్‌లో 39 శాతంగా ఉన్న వాటా 2025 జులై నాటికి 64 శాతానికి చేరింది. కిరాణా సామాను (24.3 శాతం లావాదేవీలు) మరియు రుణ వసూళ్లు (12.8 శాతం విలువ) వంటి విభాగాల్లో యూపీఐ వాడకం అధికంగా ఉంది. యూపీఐ లావాదేవీల వృద్ధి దేశంలో చలామణిలో ఉన్న నగదు (సీఐసీ) కంటే చాలా వేగంగా ఉందని ఎస్బీఐ నివేదిక సూచిస్తుంది.




2025 ఏప్రిల్-జులై మధ్య యూపీఐ సగటు నెలవారీ లావాదేవీల విలువ రూ.24,554 బిలియన్‌గా ఉండగా, సీఐసీ వృద్ధి కేవలం రూ.193 బిలియన్‌గా ఉంది. ఈ వేగవంతమైన వృద్ధి ఆర్థిక సమ్మిళితత్వాన్ని ప్రోత్సహిస్తోంది, డిజిటల్ చెల్లింపుల ద్వారా వ్యాపారులు మరియు వినియోగదారులకు సౌలభ్యాన్ని అందిస్తోంది. ఆగస్టు 2025లో యూపీఐ 20.01 బిలియన్ లావాదేవీలను నమోదు చేసింది, ఇది చరిత్రలో తొలిసారిగా 20 బిలియన్ మార్కును అధిగమించింది.

# కొత్త స్పాన్సర్ వేటలో బీసీసీఐ.. రూ.300 కోట్ల టర్నోవర్ ఉంటేనే ఛాన్స్!

భారత క్రికెట్ నియంత్రణ మండలి కొత్త జెర్సీ స్పాన్సర్ వేటలో పడింది. కేంద్ర తీసుకొచ్చిన ఆన్‌లైన్ గేమింగ్, గ్యాంబ్లింగ్ నియంత్రణ చట్టం కారణంగా డ్రీమ్ 11తో ఒప్పందం రద్దు చేసుకున్న బీసీసీఐ.. టీమిండియా కొత్త స్పాన్సర్ కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. ఆసక్తి గల కంపెనీల నుంచి బిడ్డింగ్ స్వీకరిస్తామని తెలిపింది. స్పాన్సర్ నియమ నిబంధనల గురించిన వివరాలు సెప్టెంబర్ 2 మంగళవారం నుంచి అందుబాటులో ఉంచనుంది. అంతేకాదు దరఖాస్తులు సమర్పించేందుకు సెప్టెంబర్ 16 తుది గడువుగా నిర్ణయించింది బీసీసీఐ. కొత్త స్పాన్సర్ ఎంపిక విషయంలో మాకు స్పష్టత ఉంది. ప్రభుత్వం ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం విధించినందున డ్రీమ్ 11 వంటి సంస్థలతో బీసీసీఐ స్పాన్సర్‌షిప్‌ను కొనసాగించదు. కొత్తగా అమల్లోకి వచ్చిన ఆంక్షల కారణంగా డ్రీమ్ 11తో ఒప్పందం ముగిసిపోయింది. అందుకే కొత్త స్పాన్సర్ ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. ఆశావహులు సెప్టెంబర్ 16లోపు బిడ్డింగ్ వేయాలి అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించాడు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కొత్త స్పాన్సర్ ఎంపిక చేపట్టనుంది బీసీసీఐ. అందుకే.. స్పాన్సర్‌కు ఉండాల్సిన అర్హత ప్రమాణాలను వెబ్‌సైట్‌లో పెట్టింది. ఆర్థికంగా, వ్యక్తిగతంగా కొన్ని లక్షణాలు ఉన్న వాటినే పరిశీలిస్తామని భారత బోర్డు స్పష్టంగా పేర్కొంది. అవేంటంటే.. గత మూడేళ్ల కాలంలో కంపెనీ టర్నోవర్ సగటున రూ.300 కోట్లు ఉండాలి. కంపెనీ నికర ఆస్తుల విలువ గత మూడేళ్లలో రూ.300 కోట్లు ఉండి తీరాలి.



### వ్యక్తిగతంగా అయితే..

కంపెనీపై, ఆ సంస్థ యజమానిపై ఎటువంటి క్రిమినల్ కేసులు ఉండకూడదు. మోసాలకు పాల్పడం, ఆర్థిక నేరాల్లో భాగమవ్వడం వంటివి అన్నమాట. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఆర్థికపరమైన ప్రయోజనాల్లో వైరుధ్యం ఉండకూడదు. ఏదైనా నేరం కింద రెండేళ్లకు పైగా జైలు జీవితం అనుభవించకూడదు. మరీ ముఖ్యంగా రిజర్వ్ బ్యాంక్ ఇండియా జాబితాలో ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ఉండకూడదు. అథ్లెటిక్స్, క్రీడా దుస్తులతో పాటు పరికరాల తయారీ కంపెనీలు బిడ్డింగ్ వేయవచ్చు. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, ఫైనాన్షియల్ సర్వీస్ అందించే కంపెనీలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆల్కహాల్ లేని శీతల పానీయాల కంపెనీలు కూడా అర్హులే. బీమా కంపెనీలతో పాటు ఫ్యాన్స్ మిక్సర్ గ్రౌండర్స్, సేఫ్టీ లాక్స్ సంస్థలు కూడా ఆసక్తి ఉంటే బిడ్డింగ్‌లో పాల్గొనవచ్చు.

### బిడ్డింగ్‌కు వీళ్లు అనర్హులు

ఆన్‌లైన్ మనీ గేమింగ్, బెట్టింగ్ లేదా గ్యాంబ్లింగ్‌తో సంబంధం ఉన్న కంపెనీలు. క్రిప్టో కరెన్సీకి సంబంధించిన వ్యాపారాలతో ముడిపడి ఉన్న కంపెనీలు. ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణ చట్టం 2025 ప్రకారం నిషేధిత జాబితాలో ఉన్న కంపెనీలు. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. ఈ మెగా టోర్నీకి ముందే జెర్సీ స్పాన్సర్‌గా ఉన్న డ్రీమ్ 11తో ఒప్పందం రద్దు కావడంతో టీమిండియా స్పాన్సర్ లేకుండానే బరిలోకి దిగనుంది. అయితే.. ఆసియా కప్ జరుగుతుండగానే కొత్త స్పాన్సర్‌ను వెతికే పనిలో పడింది బీసీసీఐ. తొలి పోరులో భారత్ సెప్టెంబర్ 10న ఆతిథ్య యూఏఈతో.. సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో.. సెప్టెంబర్

## బుమ్రాతో నాకు పోలికా?.. మేమిద్దరం..: వసీం అక్రమ్



జస్ప్రీత్ బుమ్రా.. ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్లలో ఒకడిగా కొనసాగుతున్నాడు. అన్ని ఫార్మాట్లలో టీమిండియా పేస్ దళానికి నాయకుడిగా వ్యవహరిస్తున్నాడు. బుమ్రా బౌలింగ్ చేస్తుంటే ప్రత్యర్థి బ్యాటర్ వెన్నులో వణుకు పుట్టాల్సిందే. ఇంగ్లండ్ పర్యటనలో కేవలం మూడు టెస్టులు మాత్రమే ఆడినప్పటికి తన అత్యుత్తుమ ప్రదర్శనను బుమ్రా ఇచ్చాడు. ఇటీవలే తన ఫిట్‌నెస్ టెస్టులను క్లియర్ చేసిన ఈ టీమిండియా పేస్ గుర్రం.. ఆసియాకప్-2025కు సిద్దమవుతున్నాడు. ఈ నేపథ్యంలో బుమ్రాపై పాకిస్తాన్ మాజీ కెప్టెన్, స్వింగ్ సుల్తాన్ వసీం అక్రమ్ ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రస్తుత తరంలో బుమ్రాను మించిన బౌలర్ మరొకరు లేరని అక్రమ్ కొనయాడాడు. అదేవిధంగా బుమ్రాను తన పోల్చడంపై ఈ పాక్ దిగ్గజం స్పందించాడు. కాగా ఇప్పటికే చాలా సందర్భాల్లో మాజీలు బుమ్రాను అక్రమ్‌తో పోల్చారు. ఆండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో కామెంటేటర్‌గా వ్యవహరించిన భారత మాజీ పేసర్ వరుణ్ అరుణ్ అయితే ఏకంగా వసీం అక్రమ్ కంటే బెటర్ బౌలర్ అని పేర్కొన్నాడు. అయితే వసీం అక్రమ్ కూడా 90లలో తన పేస్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లకు చుక్కలు చూపించేవాడు. "జస్ప్రీత్ బుమ్రా ప్రపంచంలోని గొప్ప బౌలర్లలో ఒకడు. అతడికి అద్భుతమైన బౌలింగ్ యాక్షన్ ఉంది. మంచి వేగంతో కూడా బౌలింగ్ చేయగలడు. అయితే 90లలో ఆడిన బౌలర్లను ఇప్పుడు ఉన్న బౌలర్లతో పోల్చడం సరికాదు. అతను కుడిచేతి వాటం బౌలర్, నేను ఎడమచేతి వాటం బౌలర్‌ని. అతడితో నన్ను ఎలా పోలుస్తారు. బుమ్రా బౌలింగ్ యాక్షన్ వేరు, నా బౌలింగ్ యాక్షన్ వేరు. సోషల్ మీడియాలో ఇటువంటి చర్చలు నేను తరుచుగా చూస్తున్నాను. ఊళ్లో పెళ్లికి కుక్కల హడావుడిలా ఉంది. ఈ మాజీ క్రికెటర్ల చర్చలను నేను పట్టించుకోను. బుమ్రా కూడా పట్టించుకోడు. ఈ తరంలో బుమ్రా గొప్ప బౌలర్. మా జనరేషన్‌లో మా స్థాయికి తగ్గట్టు మేము రాణించాము. కాబట్టి రెండు తరాలను పోల్చాల్సిన అవసరం లేదని జియో న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అక్రమ్ పేర్కొన్నాడు.

క్రీడా వాయిస్


## 'ఆసియా కప్-2025లోనూ అతడిని ఆడించరు.. మళ్లీ బెంచ్ మీదే'



టీమిండియాకు దొరికిన అదురైన లెఫ్టార్మ్ స్పిన్నర్లలో కుల్దీప్ యాదవ్ ఒకడు. అండర్-19 ప్రపంచకప్-2014లో భారత్ తరఫున ఆరు ఇన్నింగ్స్‌లో పద్నాలుగు వికెట్లు కూల్చి వెలుగులోకి వచ్చాడీ కాన్పూర్ 'కుర్రాడు'. ఆ తర్వాత దేశీ క్రికెట్లో, ఐపీఎల్‌లో రాణించి టీమిండియాకు ఆడే అవకాశం దక్కించుకున్నాడు. చైనామన్ స్పిన్నర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్న కుల్దీప్ యాదవ్.. ఇప్పటికే మ్యాచ్ విన్నర్‌గా నిరూపించుకున్నాడు. గతేడాది సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌ను భారత్ 4-1తో గెలవడంలో కుల్దీప్‌ది కీలక పాత్ర. అదే విధంగా.. టీ20 ప్రపంచకప్-2024, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 టైటిళ్లను టీమిండియా సొంతం చేసుకోవడంలోనూ అతడు కీలకంగా వ్యవహరించాడు. అయినప్పటికీ చాన్నాళ్లుగా కుల్దీప్ బెంచ్‌కే పరిమితమవుతున్నాడు. ఇటీవల ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా ఐదు టెస్టుల్లోనూ అతడికి ఆడే అవకాశం రాలేదు. మార్చిలో చివరగా టీమిండియాకు ఆడిన కుల్దీప్ యాదవ్.. ఆసియా కప్-2025 టోర్నమెంట్‌తో పునరాగమనం చేసే అవకాశం ఉంది.

### ఇంగ్లండ్‌లో ఆడిస్తే గెలిచేవాళ్లం

అయితే, ఈ టీ20 టోర్నీలోనూ కుల్దీప్ యాదవ్ బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశం ఉందని.. భారత మాజీ స్పిన్నర్ మణిందర్ సింగ్ అంటున్నాడు. "ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో కుల్దీప్ యాదవ్‌ను ఆడించి ఉంటే.. టీమిండియా 3-1తో గెలిచేది. కుల్దీప్ లాంటి బౌలర్లు అరుదుగా ఉంటారు. ఇంగ్లిష్ బ్యాటర్లు అతడి బౌలింగ్‌లో ఇబ్బందిపడేవారు. అతడి గూగ్లీలను వాళ్లు రీడ్ చేయలేకపోయేవారు. తొలి టెస్టులో వాళ్లు 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించారు. ఆ సమయంలో కుల్దీప్ గనుక మైదానంలో ఉండి ఉంటే ఇలా జరిగేదే కాదు.
ఈసారి కూడా బెంచ్ మీదే!
ఇక ఆసియా కప్ టోర్నీలోనూ ఇద్దరు స్పిన్నర్లను మాత్రమే ఆడించాలని భావిస్తే.. మేనేజ్‌మెంట్ కుల్దీప్ యాదవ్‌ను ఈసారి కూడా పక్కనపెట్టవచ్చు. వరుణ్ చక్రవర్తిని ఆడిస్తారు. బ్యాటింగ్ కూడా చేయగలడు కాబట్టి అక్షర్ పటేల్‌ను తీసుకుంటారు" అని మణిందర్ సింగ్ ఇండియా టుడేతో పేర్కొన్నాడు. కాగా సెప్టెంబరు 9- 28 వరకు యూఏఈ వేదికగా ఆసియా కప్ టోర్నీ నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. ఇదిలా ఉంటే.. చివరగా ఇంగ్లండ్‌లో పర్యటించిన టీమిండియా ఆండర్సన్- టెండుల్కర్ ట్రోఫీని 2-2తో సమం చేసిన విషయం తెలిసిందే. ఇక ఈ టూర్‌తోనే శుభ్‌మన్ గిల్ టీమిండియా టెస్టు సారథిగా ప్రయాణం ఆరంభించాడు. బౌలింగ్ దళంలో పేసర్లు మహ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్, ప్రసిద్ కృష్ణ కీలకంగా వ్యవహరించగా.. స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కూడా సత్తా చాటాడు.




## 'మట్టి కుస్తీ'కి సీక్వెల్‌ను ప్రకటించిన విష్ణు విశాల్

తమిళ నటుడు విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'గట్ట కుస్తీ' (తెలుగులో మట్టి కుస్తీ) స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం 2022లో విడుదలై తమిళంతో పాటు తెలుగులో మంచి విజయాన్ని అందుకుంది. అయితే తాజాగా ఈ సినిమాకి సీక్వెల్‌ను ప్రకటించారు మేకర్స్. కథానాయకుడు విష్ణు విశాల్ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సినిమాకి 'గట్ట కుస్తీ 2' అని పేరు పెట్టారు. దీనికి సంబంధించిన ఒక అనౌన్స్‌మెంట్ వీడియోను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది. 'గట్ట కుస్తీ' సినిమాకు దర్శకత్వం వహించిన చెల్లా అయ్యావు ఈ సీక్వెల్‌కు కూడా దర్శకత్వం వహించబోతుండగా.. మొదటి భాగంలో నటించిన విష్ణు విశాల్, ఐశ్వర్య లక్ష్మీ ఈ సీక్వెల్‌లో కూడా ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. అలాగే, కరుణాస్, మునీష్కాంత్, కాళీ వెంకట్ వంటి నటులు కూడా ఇందులో కొనసాగనున్నారు. విష్ణు విశాల్ తన సొంత నిర్మాణ సంస్థ 'విష్ణు విశాల్ స్టూడియోస్'తో పాటు 'వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్'తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




## సెకండ్ పార్ట్‌లో హీరో అతడే.. మెయిన్ విలన్ క్లూ

గత వీకెండ్‌లో మూడు నాలుగు తెలుగు సినిమాలు రిలీజైతే వాటిలో కొన్నింటికి పాజిటివ్ టాక్ వచ్చింది. కానీ జనాలు పెద్దగా ఇంట్రెస్ట్ చూపించట్లేదు. మరోవైపు మలయాళ డబ్బింగ్ మూవీ 'కొత్త లోక'కి తెలుగులో ఓ మాదిరి రెస్పాన్స్ వచ్చింది. మెట్రో సిటీల్లో ఆదివారం వరకు మంచి ఆక్యుపెన్సీ చూపించింది. తొలి నుంచి ఇది సూపర్ హీరో తరహా యూనివర్స్ అని చెప్పిన టీమ్.. ఇప్పుడు మరిన్ని ఆసక్తికర విషయాల్ని రివీల్ చేసింది. మనం పురాణాల్లో విన్న యక్షిణి పాత్రని తీసుకుని, దానికి సూపర్ పవర్స్ జోడించి 'కొత్త లోక' సినిమాని తీశారు. కల్యాణి ప్రియదర్శన్ లీడ్ రోల్ చేసింది. బడ్జెట్ కూడా రూ.35-40 కోట్ల మధ్యనే అని టాక్. అయితే ఇంత తక్కువ బడ్జెట్ పెట్టి ఈ రేంజు ఔట్ పుట్ చూపించడంపై ప్రేక్షకులు ఆశ్చర్యపోతున్నారు. సినిమా పాజిటివ్ టాక్ రావడంతో పాటు రూ.60-70 కోట్ల వరకు కలెక్షన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. అంటే లాభాల్లోకి ఎంటరైనట్లే. తాజాగా ఈ చిత్రానికి వస్తున్న ఆదరణ గురించి మాట్లాడిన దర్శకుడు డొమినిక్ అరుణ్.. ఈ మూవీ ఫ్రాంచైజీలో మొత్తం ఐదు పార్ట్స్ ఉంటాయని చెప్పుకొచ్చాడు. అలానే 'కొత్త లోక' సినిమా ప్రారంభంలోనే మెయిన్ విలన్ ఎవరనేది హింట్ ఇచ్చామని పేర్కొన్నాడు. ఐదు భాగాలకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ అంతా షూటింగ్ మొదలవకముందే పూర్తి చేశామని క్లారిటీ ఇచ్చాడు. ఈ మూవీలో అతిథి పాత్రలో కనిపించి ఆకట్టుకున్న టొవినో థామస్.. రెండో పార్ట్‌లో లీడ్ రోల్ చేస్తాడనే రూమర్స్ వినిపిస్తున్నాయి. అయితే 'కొత్త లోక' తొలి పార్ట్ చివరలో దుల్కర్ సల్మాన్ కూడా కనిపించాడు. రాబోయే పార్ట్స్‌లో ఏదో ఒకదానిలో దుల్కర్ కూడా కచ్చితంగా ఉండటం గ్యారంటీ. ఇప్పటివరకు కమర్షియల్‌గా గుర్తింపు తెచ్చుకున్న కల్యాణి.. ఈ సినిమాతో మరింతగా క్రేజ్ సంపాదిస్తుండటం విశేషం.

## 'ఓజీ' కొత్త గ్లింప్స్.. విలన్ పాత్ర పరిచయం

'ఓజీ' సినిమా నుంచి కొత్త గ్లింప్స్ రిలీజ్ చేశారు. పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఉదయం.. కారుపై ఓజీ కూర్చున్న ఓ కొత్త లుక్ రిలీజ్ చేశారు. ఇప్పుడు గ్లింప్స్ వీడియో విడుదల చేశారు. ఇందులో విలన్ పాత్రధారిని పరిచయం చేశారు. అతడి పాత్ర పేరు ఓమి. బాలీవుడ్ స్టార్ ఇమ్రాన్ హష్మీ ఈ రోల్ చేశాడు. సదరు పాత్రతో గ్లింప్స్ చివరలో హ్యాపీ బర్త్ డే ఓజీ అని చెప్పించారు. అంతా బాగానే ఉంది గానీ పవన్ పుట్టినరోజు సందర్భంగా అతడిని హైలైట్ చేసే గ్లింప్స్ లాంటిది పడితే అభిమానులు కాస్త ఖుషీ అయ్యేవారు. అలా కాకుండా హీరో కంటే విలన్ పాత్రకు ఎక్కువ ఎలివేషన్స్ ఇచ్చేలా గ్లింప్స్ రిలీజ్ చేయడం కాస్త విచిత్రంగా అనిపించింది. ఎప్పటిలానే బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, విజువల్స్ బాగున్నాయి. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఈ గ్యాంగ్ స్టర్ డ్రామాని ఈ నెల 25న థియేటర్లలో రిలీజ్ చేయనున్నారు. సుజీత్ దర్శకుడు కాగా తమన్ సంగీతమందించాడు. డీవీవీ దానయ్య నిర్మాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ఈ సినిమాకు అభిమానుల్లో బజ్ గట్టిగానే ఉంది. పవన్ గత చిత్రం 'హరిహర వీరమల్లు' దారుణంగా ఫెయిల్ అవడంతో ఈ మూవీపై ఫ్యాన్స్ బోలెడు ఆశలు పెట్టుకున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి?





## బెల్లంకొండ సినిమా వాయిదా.. కానీ

తెలుగులో ఒకప్పుడు వరుసగా సినిమాలు చేస్తూ.. అప్పుడప్పుడూ విజయాలు అందుకుంటూ కెరీర్‌ను బాగానే ముందుకు తీసుకెళ్లాడు బెల్లంకొండ శ్రీనివాస్. కానీ మధ్యలో 'ఛత్రపతి' బాలీవుడ్ రీమేక్‌లో నటించడం తన కెరీర్‌కు పెద్ద డ్యామేజీ అయింది. ఆ సినిమా హిందీలో సరిగా ఆడలేదు. పైగా తెలుగులో బాగా గ్యాప్ వచ్చింది. ఈ విరామం తర్వాత 'భైరవం' చిత్రంలో నటిస్తే అది నిరాశపరిచింది. ఐతే తన కొత్త చిత్రం 'కిష్కింధపురి' మీద బెల్లంకొండ శ్రీనివాస్ చాలా నమ్మకంగా ఉన్నాడు. కార్తికేయతో 'చావు కబురు చల్లగా' సినిమా తీసిన కౌశిక్ పెగల్లపాటి ఈ చిత్రాన్ని రూపొందించాడు. ఇది డివైన్ ఎలిమెంట్స్‌తో ముడిపడ్డ ఫాంటసీ హార్రర్ మూవీ. దీని టీజర్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచింది. 'రాక్షసుడు' తర్వాత శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ కలిసి నటించిన చిత్రమిది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 12న 'కిష్కింధపురి' రిలీజ్ కావాలి. ఐతే అదే రోజు 'మిరాయ్' భారీ అంచనాల మధ్య రిలీజవుతుండడంతో దానికి పోటీగా వెళ్లకపోవడం మంచిదే అన్న సందేహాలు కలిగాయి. రిలీజ్ డేట్ మార్చక తప్పదని అనుకున్నారు. ఆ ప్రకారమే 'కిష్కింధపురి' వాయిదా పడింది. అలా అని వారం, రెండు వారాలేమీ పోస్ట్ పోన్ చేయలేదు. ఒక్క రోజు ఆలస్యంగా సెప్టెంబరు 13న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. 13న అన్నది హార్రర్ చిత్రాలకు సెంటిమెంటుగా కలిసొచ్చే డేట్. హార్రర్ చిత్రాల టైటిళ్లు కూడా ఈ నంబర్‌తో పెడుతుంటారు. '13 బి' అందుకు ఉదాహరణ.






VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com